




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



అణ్ణా సారేది దళితులపక్షం

ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా...
పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి

కార్పొరేట్ దోపిడీదారుల కోసమే
బ్యాంకుల ప్రవేటీకరణ

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 6 | సోమవారం | 02-12-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


# బడుగుల నేస్తం బాలమల్లేశ్

### సిఎం సంతాపం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాల మల్లేష్ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు ఎన్. బాలమల్లేష్ ఆకస్మిక మరణం తీవ్రంగా కలచివే-సిందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభా-కర్ అన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. బాల మల్లేష్ విద్యార్థి దశ నుంచి యువజన నాయకునిగా రాష్ట్ర స్థాయిలో అనేక పోరాటాలు ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. వ్యవసాయ కూలీ, వ్యవసాయ కార్మిక సంఘం లో రాష్ట్ర నాయకునిగా ఎదిగిన బాలమల్లేష్‌కు మంత్రి పొన్నం నివాళులు అర్పించారు.





### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గం నివాళి

బాలమల్లేష్ భౌతిక కాయంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గం అరుణ పతాకాన్ని కప్పి నివాళులు అరిపించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంత్ రావు ఇటి.నర్సింహ, ఎం.బాలనర్సింహ, కలవేన శంకర్, వివిఎస్.బోస్ నివాళులు అర్పించారు.



ప్రజాపక్షం/హైదరాబాద్

బడుగు బలహీనవర్గాల సమస్యల పరిష్కారానికి, నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు పోరాడిన నిరాడంబర జీవి, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు బాలమల్లేష్ అని పలువురు వామపక్ష, రాజకీయ , ప్రజా సంఘాల నాయకుల, మేధావులు కొనియాడారు. బలహీనవర్గాల గొంతుకగా, వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాల్లో కీలక భూమికను పోషించారని వారు గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఐక్య ఉద్యమాలను విజయవంతం చేసేందుకు వామపక్ష, ఇతర రాజకీయ పార్టీలతో ఆయన మంచి సమన్వయకర్తగా వ్యవహరించారని ప్రశంసించారు. విద్యార్థి దశలో వామపక్ష భావజాలం పట్ల ఆకర్షితులై విద్యార్థి సంఘం నాయకుడి స్థాయి నుంచి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి స్థాయి వరకు ఎదిగారని వారు తెలిపారు. వామపక్ష, ప్రజా, కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ భౌతికకాయాన్ని ఆదివారం హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్ ఆవరణలో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన భౌతిక కాయానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, బాలమల్లేష్ అభిమానులు, ఉద్యోగ సంఘాల నేతలు పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించాయి. ఆయన సతీమణి వందన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "జోహార్ కామ్రేడ్ బాలమల్లేషన్న...జోహార్..జోహార్ " అంటూ నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించగా, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, బి ఆర్ ఎస్

తరువాయి 3లో

## నిరాడంబర నేతకు అంతిమ వీడ్కోలు

ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి/ఆల్వాల్

'ఇప్పటి వరకు మాతోటే ఉండి మాయమై పోయావేంటన్నా! ఇక మాకు దిక్కెవరన్నా.. మా కష్టాలు ఎవరికి చెప్పుకోవాలని' అని దివంగత నక్కా బాలమల్లేష్ భౌతికకాయాన్ని చూసి మేడ్చల్ జిల్లా యాప్రాల్ వాసులతో పాట సమీప ప్రాంతాల నుండి తరలివచ్చిన అభిమానులు రోదిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. శనివారం గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్ భౌతికకాయాన్ని ఎఎస్ రావు నగర్‌లోని పొలోమి ఆస్పత్రి నుండి యాప్రాల్‌లోని ఆయన స్వగృహానికి తరలించినప్పటి నుంచి ఆదివారం అంత్యక్రియలు పూర్తయ్యే వరకు స్థానికులతో పాటు సిపిఐ ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు విచారంలో మునిగిపోయారు. సందర్శకుల కోసం భౌతికకాయాన్ని ఆదివారం మధ్యాహ్నం యాప్రాల్‌లోని బాల మల్లేష్ నివాసం నుండి తిరుమలగిరి, సికింద్రాబాద్ మీదుగా హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో మగ్దూంభవన్‌లో రెండు గంటల పాటు ఉంచారు. ఆ తరువాత తిరిగి అదే మార్గంలో యాప్రాల్‌కు తరలించారు. యాప్రాల్ చౌరస్తా నుంచి బాలమల్లేశ్ స్వగృహం మీదుగా ఊరంతా సాగిన అంతిమ యాత్రలో భారీ సంఖ్యలో సిపిఐ నాయకులు, గ్రామస్థులు, వివిధ పార్టీల ముఖ్యులు, వందలాది సంఖ్యలో హాజరయ్యారు. చితికి బాలమల్లేశ్ కుమారుడు నిశాంత్ నిప్పంటించారు. అంతకుముందు ఆదివారం ఉదయం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి బాలమల్లేష్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్ బోస్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలయ్య యాదవ్, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి యాదయ్యలు ప్రజా గాయకుడు దివంగత నేత గద్దర్ కుమారుడు సూర్య తదితరులు యాప్రాల్‌లోని స్మశానవాటికలో సాయంత్రం 7 గంటల వరకు బాలమల్లేష్ అంత్యక్రియలు పూర్తయ్యేవరకు ఉన్నారు. అంతిమ యాత్రలో పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, వందలాది సంఖ్యలో ఎర్ర జెండాలతో ప్రజా కళాకారుడు వెంకటాచారి బృందం బాలమల్లేష్ సేవలను కొనియాడుతూ గీతాలు ఆలపించారు. సిపిఐ రాష్ట్ర

తరువాయి 12లో



# సంక్రాంతి తర్వాత రైతు భరోసా

"రుణమాఫీ విషయంలో బిఆర్‌ఎస్ రైతులను మోసం చేసింది. మారీచుల మాయ మాటలు రైతులు నమ్మొద్దు. ఏమైనా మానవ తప్పిదాలతో జరిగితే మళ్లీ సరిదిద్దుతాం. ఖాతాల్లో తప్పులు సరిదిద్దుకుని అధికారులకు చెప్తే రుణమాఫీ పూర్తవుతుంది. రేషన్ కార్డు లేని వారికి కూడా రుణమాఫీ చేశాం.
– సిఎం రేవంత్‌రెడ్డి

- అసెంబ్లీలో చర్చించి, విధివిధానాలు ఖరారు చేస్తాం
- వరికి రూ.500 బోనస్ కొనసాగిస్తాం
- ప్రభుత్వ పాఠశాలలు, రేషన్‌కార్డులకు సన్న బియ్యం
- కెసిఆర్ హయాంలో బకాయి పెట్టిన రూ.7,625 కోట్ల రైతు బంధు చెల్లించాం
- తెల్లకార్డు లేనివారికీ రుణమాఫీ చేశాం : సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- గుజరాత్ గులాం కిషన్‌రెడ్డికి తెలంగాణతో ఏం సంబంధమని ఆగ్రహం : మోదీ హామీలపై చర్చకు రావాలని సవాల్

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. 'మారీచుల మాయమాటలు నమ్మొద్దు.. సోనియాగాంధీ గ్యారంటీగా నేను చెబుతున్నా' అని రైతులకు సిఎం విజ్ఞప్తి చేశారు. వరికి రూ.500 బోనస్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులతో కలిసి సిఎం మాట్లాడారు. రైతు భరోసాపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశామని, అసెంబ్లీలో చర్చించి, త్వరలో విధివిధానాలు ఖరారు చేస్తామని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎలా పూర్తి చేశామో, రైతు భరోసా కూడా అదేవిధంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రూ.7 లక్షల కోట్ల అప్పుతో కెసిఆర్ తమకు ప్రభుత్వాన్ని అప్పగించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతినెలా రూ. 6500 కోట్లు వడ్డీకే కట్టాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలాదిగజారిందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కెసిఆర్ హయాంలో అప్పుల గురించి గతంలో ఎవరూ బయటపెట్టలేదని

తరువాయి 2లో

## కాంగ్రెస్ హామీలపై చర్చకు సిద్ధం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి
'కాంగ్రెస్ గ్యారంటీల గారడీ..ఆరు అబద్ధాలు..66 మోసాలు'' పేరుతో చార్జ్‌షీట్ విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్




గత బిఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఏ మాత్రం తేడా లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ హామీల అమలుపైన తాము చర్చకు సిద్ధమని, సిఎం హోదాలో ఉన్న రేవంత్ తన భాషను మార్చుకుంటేనే చర్చకు వస్తానని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.''కాంగ్రెస్ గ్యారంటీల గారడీ..ఆరు అబద్ధాలు.. 66 మోసాలు'' పేరుతో బిజెపి చార్జ్‌షీట్‌ను హైదరాబాద్‌లోని కత్రియ హోటల్‌లో కిషన్ రెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలవికాని హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చి హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. వంద రోజుల్లో

తరువాయి 2లో

## మోదీ గ్యారంటీలపై బహిరంగంగానే చర్చిద్దాం

బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు మోదీ గ్యారంటీలపైన బహిరంగంగా చర్చించేందుకు తాము సిద్ధమని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 2014, 2019, 2024 ఎన్నికల సందర్భంగా బిజెపి తమ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలపై బహిరంగంగా చర్చిద్దామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో సవాళు విసిరారు. బిజెపి నాయకులకు ప్రధాని మోదీ చివాట్లు పెట్టిన నేపథ్యంలోనే చార్జ్ షీట్‌ను దాఖలు చేశారని పేర్కొన్నారు. బిజెపి,బిఆర్‌ఎస్ కవల పిల్లలు అని, ఒకరినొకరు ఎ, బి టీములుగా వ్యవహరిస్తారని, ఇది అనేక సార్లు రుజువైందని పొన్నం ప్రభాకర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బిఆర్‌ఎస్‌తో బిజెపి మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిన మాట వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. కిషన్ రెడ్డి ఎంపికి ఎక్కువ. కేంద్రమంత్రికి తక్కువ అని

తరువాయి 2లో



## కారు బీభత్సం

బైక్‌లు, ఆటోపైకి దూసుకెళ్లిన వాహనం
దంపతులు మృతి
మరో నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం / హైదరాబాద్

బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్న దంపతులను కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో చోటుచేసుకుంది. శనివారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న స్విఫ్ట్‌కారు హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు వెళ్తుండగా లంగర్‌హౌస్ వద్దకు రాగానే అదుపు తప్పి మూడు బైక్‌లు, ఆటోలో ప్రయాణిస్తున్న వారిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంతో బైక్‌పై ప్రయాణిస్తున్న లంగర్ హౌస్‌కు చెందిన మీనా ఠాకూర్, దినేష్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మొదట రోడ్డు పక్కనే బైక్‌ను ఆపుకుని జుబేర్ అనే యువకుడు తన ముఖానికి మాస్క్ ధరిస్తుండగా ఒక్కసారిగా కారు అదుపు తప్పి తనపైకి రావడాన్ని

తరువాయి 2లో

# భారీ ఎన్‌కౌంటర్

గ్రేహౌండ్స్ బలగాలు – మావోయిస్టుల మధ్య భీకర యుద్ధం
ఏడుగురు మావోయిస్టులు హతం
మృతుల్లో కీలక నేత బద్రు

ప్రజాపక్షం/ఏటూరు నాగారం







ఏటూరు నాగారం మండల చెల్పాక వద్ద భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన వారిని ఇల్లందు–నర్సంపేట ఏరియా కమిటీ దళంగా పోలీసులు గుర్తించారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో ఇల్లందు–నర్సంపేట ఏరియా పార్టీ కార్యదర్శి తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ కుర్సం మంగు అలియాస్ భద్రు(35) అలియాస్ పాపన్న, ఏటూరునాగారం మహాదేవ్‌పూర్ ఏరియా కమాండర్ ఈగోలపు మల్లయ్య అలియాస్ మధు(43)తో పాటు దళ నాయకులు ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్(22), దళ సభ్యురాలు ముస్సాకి జమున(23), జైసింగ్(24), కిషోర్ (22),

తరువాయి 2లో

## సత్సంబంధాలతోనే సరైన న్యాయం

రిటైర్డ్ జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్

హనుమకొండలో రెండవ రోజు ఉత్సాహంగా ఐఎఎల్ రాష్ట్ర మహాసభలు




ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

కోర్టులలో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు మధ్య సత్సంబంధాలతోనే బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని ఎపి హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి. ప్రవీణ్ కుమార్ అన్నారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో జరుగుతున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎఎల్) తెలంగాణ రాష్ట్ర మహాసభలలో ఆదివారం రెండవ రోజు న్యాయమూర్తులు, న్యాయవాదుల సంబంధాలు వృత్తిపరమైన నైతిక విలువలు అన్న అంశంపై జరిగిన సదస్సుకు ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించగా జస్టిస్ సి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కోర్టులలో కొత్తగా ప్రవేశించిన న్యాయవాదులకు సీనియర్లు మార్గదర్శకం చేయాలన్నారు. చట్టాలపై, కొత్తగా వస్తున్న తీర్పులపై న్యాయవాదులు పట్టు సాధించాలని, విషయ అవగాహన, వాదనా పటిమను పెంపొందించుకోవాలన్నారు. చైతన్యవంతమైన నిపుణత కలిగిన బార్ నుండే ఉత్తమమైన జడ్జీలు పుట్టుకొస్తారని చెప్పారు. వృత్తిలో ఏ విధంగా రాణించాలో సీనియర్ న్యాయవాదుల నుండి జూనియర్‌లు

తరువాయి 2లో



## ప్రజాహక్కులను బలహీనపరుస్తున్న శక్తులపై పోరాటం

వయనాడ్ ఎంపి ప్రియాంకగాంధీ స్పష్టీకరణ

**వయనాడ్ :** బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంకాగాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజల హక్కులను బలహీనపరుస్తున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాటం సాగుతోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ కొద్దిమంది తన వ్యాపారవేత్తలైన మిత్రుల చేతుల్లో పెడుతోందని

తరువాయి 12లో

## మాకు అన్నివేళలా అండగా నిలవండి

### క్యూబా కమ్యూనిస్టు పార్టీ పిలుపు




**హవానా:** పోరాటాల గడ్డ క్యూబాకు వెన్నుదన్నుగా నిలవాలని అన్ని రాజకీయ, ప్రగతిశీల, సామాజిక, వామపక్ష, ఉద్యమ పార్టీలకు క్యూబా కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టేందుకు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమవుతున్న నేపథ్యంలో ఓ ప్రకటన చేసింది. అమెరికా 1962 నుంచి క్యూబాపై ఆంక్షలను విధిస్తూ, ఆర్థికంగా, వాణిజ్యపరంగా ఈ దేశాన్ని కట్టడి చేస్తూ వచ్చింది. దేశాన్ని అస్థిరపర్చాలని అమెరికా ప్రయత్నాలతో క్యూబా ప్రజలు ఇబ్బందికర పరిస్థితుల్లో జీవితాలు గడుపుతున్నారు. విద్యుత్ సంక్షోభం నెలకొంది. ఆర్థికంగా కట్టడి చేయడం వల్ల నేషనల్ ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్ నిర్వహణకు అవసరమైన చమురు, విడిభాగాలు, పరికరాల సరఫరాకు ఆటంకం ఏర్పడింది. హరికేన్ ఆస్కార్, రఫేల్‌తో పాటు భారీ భూకంపాలు సంభవించడంతో దేశం మరింత కష్టాల్లో చిక్కుకుంది. ఎన్ని ఆటంకాలు వచ్చినా... ఎన్ని సవాళ్లు ఎదురైనా క్యూబా ప్రజలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. ధైర్యంగా ఎదురొడ్డి పోరాడారు. క్యూబా పోరాటాలకు చిరునామా... వెన్నుచూపడం క్యూబాకు తెలియదు. ఎప్పుడు కూడా ఓటమిని అంగీకరించబోదు. అయితే క్యూబా ప్రజల పోరాటానికి మిత్రులంతా అండగా నిలుస్తారని, ఉమ్మడిగా సంఘీభావం తెలుపుతారని, సాధ్యమైనంత మేరకు సహాయ సహకారాలు అందిస్తారని ఆకాంక్షిస్తున్నాం. సంఘీభావాన్ని ఎవ్వరూ ఆపలేరు. 'క్యూబా కోసం నేడు నిలిచిన వారు అన్ని వేళల్లో క్యూబాకు అండగా నిలుస్తారు' అన్న నినాదంతో తన ప్రకటనను క్యూబా కమ్యూనిస్టు పార్టీ ముగించింది.

## ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరి 20 బాధ్యతలు చేపట్టనున్నారు. తన యంత్రంగాన్ని సిద్ధం చేసుకుంటున్న ట్రంప్.. ఇప్పటికే భారత సంతతికి చెందిన అమెరికన్లకు కీలక పదవులు కట్టబెట్టారు. తాజాగా భారత సంతతికి చెందిన న్యాయవాది కశ్యప్ పటేల్‌ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా నియమించనున్నట్లు ప్రకటించారు. కశ్యప్ పటేల్... 'క్యాష్ పటేల్'గా ప్రాచుర్యం పొందారు. ఆయన మంచి న్యాయవాది, పరిశోధకుడు. అవినీతి నిర్మూలనకు శ్రమిస్తున్నారు. క్యాష్ పటేల్‌ను ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా నియమించడం ద్వారా దర్యాప్తు సంస్థకు పునర్వైభవం రాగలదని ట్రంప్ ఆకాంక్షించారు. గుజరాతీ మూలాలున్న కాష్ పటేల్ పూర్వీకులు తూర్పు ఆఫ్రికాలోని ఉగాండా నుంచి కెనడాకు, ఆపై అమెరికాకు వలస వచ్చి స్థిరపడ్డారు. 1980లో న్యూయార్క్ గార్డెన్ సిటీలో కశ్యప్ జన్మించారు. తండ్రి ఏవియేషన్ కంపెనీలో ఫైనాన్షియల్ అధికారిగా పని చేశారు. యూనివర్సిటీ ఆఫ్ రిచ్‌మాండ్‌లో గ్రాడ్యుయేషన్ చేసి.. యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను ఆయన అభ్యసించారు. మియామీ కోర్టుల్లో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు.





# తిరుగుబాటు దళాల అధీనంలోకి అలెప్పో

### మిత్రుల సాయంతో ఉగ్రవాదులను మట్టుపెడతాం: అసద్

ప్రపంచం

**డమాస్కస్:** సిరియా రెండవ రాజధాని నగరం అలెప్పోను రెబల్స్ స్వాధీనం చేసుకున్నారు. రెబల్స్ జరిపిన మెరుపు దాడుల్లో అనేకమంది సైనికులు చనిపోయారు. అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు ఈ పరిస్థితి పెద్ద సవాల్‌గా మారింది. అయితే తిరుగుబాటు దారుల ఆటకట్టిస్తామని, తమ మిత్రులతో కలిసి ఉగ్రవాదులను నాశనం చేస్తామని ఆయన దీమాగా ప్రకటించారు. 'మా భూభాగాల సమగ్రత కాపాడుకుంటున్నాం. మిత్రులు, మిత్ర కూటముల సాయంతో ఉగ్రవాదులను నామరూపాలు లేకుండా చేయగల సామర్థ్యం సిరియాకు ఉంది' అని అసద్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన చేసింది. యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయద్ అల్ నహ్యాన్‌తో అసద్ ఫోన్‌లో తాజా పరిణామాలపై, ప్రాదేశిక అంశాలు, సమస్యలపై మాట్లాడినట్లు వెల్లడించింది. ఇదిలావుంటే ఈ వారంలో తిరుగుబాటు దళాలు సిరియాపై విరుచుకుపడ్డాయి. తూర్పు గ్రామాల గుండా ఆకస్మిక దాడి చేశాయి. 2016 యుద్ధమప్పుడు లెప్పోను ప్రభుత్వ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న తర్వాత ఇలాంటి పరిణామం జరగడం ఇదే మొదటిసారి. అలెప్పో తమ అధీనంలో ఉందని, నగర విమానాశ్రయం కూడా తమ నియంత్రణలోనే ఉందని తిరుగుబాటు దళాలు ప్రకటించాయి. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 24 గంటల కర్ఫ్యూ విధించాయి. నగర వాసుల భద్రత, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తుల రక్షణ కోసమే కర్ఫ్యూ విధించినట్లు సమర్థించుకున్నాయి. ఇదిలావుంటే సిరియా దళాలు రంగంలోకి దిగి తిరుగుబాటు దళాలను కట్టడి చేస్తున్నట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. హమా ప్రావిన్స్‌లో సిరియా సైన్యం మోహరించినట్లు అక్కడి గవర్నర్ కమల్ బర్మో తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాలు, అన్ని సంస్థల్లో పని యథావిధిగా సాగుతోందన్నారు. ఉగ్రవాదుల వాహనాలు హమాలోకి ప్రవేశించినట్లు వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఉత్తర హమా ప్రావిన్స్‌లోకి ఉగ్రమూకలు ప్రవేశించారన్న వాదనను సిరియా రక్షణ శాఖ కొట్టిపారేసింది. ఇదంతా తప్పుడు సమాచారమని స్పష్టంచేసింది.

## పాకిస్తాన్‌లో ఆగని అల్లర్లు

### గిరిజన తెగల మధ్య ఘర్షణల్లో 130కి చేరిన మృతుల సంఖ్య

**పెషావర్:** పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫక్తుఖ్వా ప్రావీన్స్‌లో చెలరేగిన అల్లర్లు ఇంకా శాంతించలేదు. ఈ ఘర్షణల్లో మృతుల సంఖ్య 130కి చేరిందని అధికారులు ప్రకటించారు. పరిస్థితి ఉద్రిక్తంగానే ఉందని అధికారులు ప్రకటించారు. నవంబర్ 22న పరాచినార్ వద్ద ఒక బస్సుపై గుర్తుతెలియని సాయుధులు దాడి చేసిన ఘటనలో 47 మంది మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. అనంతరం మృతుల సంఖ్య 57కు చేరింది. కాగా, ఈ ఘటన కారణంగా అలిజాయ్, బగాన్ గిరిజన తెగల మధ్య ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఆదివారం కూడా పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నట్టు సమాచారం. భద్రతాబలగాలను మోహరింప చేశామని, పరిస్థితి అదుపులోకి తీసుకొస్తామని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, అఫ్ఘానిస్తాన్ సరిహద్దునగల ఈ ప్రావీన్స్‌పై తాలిబన్ల ప్రభావం ఎక్కువ. ఇస్లామిక్ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని పాకిస్తాన్ తాలిబన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే, పాక్ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నాయి. గిరిజన ప్రాబల్యం ఉన్న ప్రాంతం కావడంతో, అధికారులు సైతం ఇక్కడ శాంతిభద్రతలను కాపాడడంలో విఫలమవుతున్నారు.

**8 మంది ఉగ్రవాదులు మృతి**

రెండు వేర్వేరు ఘటనల్లో 8 మంది ఉగ్రవాదులు మృతి చెందారు. ఇద్దరు భద్రతా జవాన్లు కూడా ప్రాణాలు కోల్పోయారు. అధికారుల కథనం ప్రకారం బకా ఖేల్ ప్రాంతంలో అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం అందడంతో భద్రతా బలగాలు అక్కడికి చేరుకున్నాయి. అక్కడ చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో ఐదుగురు తీవ్రవాదులతోపాటు ఒక జవాను మృతి చెందాడు. ఖైబర్ జిల్లా షగాయ్ ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ముగ్గురు ఉగ్రవాదులు, ఒక జవాను ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. అక్కడ కూడా ఉగ్రకార్యకలాపాల గురించి సమాచారం అందడంతో, బలగాలు చేరుకున్నాయి. ఫలితంగా ఎదురు కాల్పులు చోటు చేసుకు



## బ్రిక్స్ కరెన్సీపై 100 శాతం సుంకం విధిస్తాం: ట్రంప్




**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టబోయే డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. బ్రిక్స్ దేశాల కరెన్సీపై 100శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీని రూపొందించడంపై దృష్టిని కేంద్రీకరించిన క్రమంలో ట్రంప్ ఈ మేరకు హెచ్చరించడం చర్చకు దారితీసింది. అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకు రావాలన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపు మేరకు అందుకోసం బ్రిక్స్ దేశాలు ఆలోచన చేస్తున్నాయి. అయితే బ్రిక్స్ దేశాల కరెన్సీ వస్తేగనుక దిగుమతులపై నూరు శాతం సుంకం విధిస్తామని, అమెరికాతో వాణిజ్యం కూడా చేయనివ్వమని ట్రంప్ 'ట్రూట్' మాధ్యమంగా హెచ్చరించారు.

### కారు బీభత్సం

**(మొదటి పేజీ తరువాయి)**

గ్రహించి అక్కడి నుంచి తృటిలో తప్పించుకున్నాడు. ఆ తరువాత కారు దినేష్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఆ తరువాత మరో రెండు బైక్‌లను ఢీ కొట్టింది. అంతటితో ఆగకుండా ఆటోను సైతం ఢీ కొట్టింది. ఈ హఠాత్పరిణామంతో రహదారులపై ప్రయాణిస్తున్న ఇతర వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆటోను ఢీ కొట్టి కారు నిలిచిపోయింది. బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీనా ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నలుగురు ఆటో ప్రయాణికులను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన దంపతుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకునానరు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వికారాబాద్ జిల్లా మోద్కురుకు చెందిన ప్రణయ్‌ని అరెస్టు చేశారు. అయితే డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం, మితిమీరిన వేగంతో కారును నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని పోలీసులు గుర్తించారు.

### భారీ ఎన్‌కౌంటర్

**(మొదటి పేజీ తరువాయి)**

కామేష్(23) ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున పోలీస్ కూంబింగ్ దళాలకు చెల్పాక వద్ద మావోయిస్టులు ఎదురుపడడంతో ఎదురు కాల్పులు మొదలయ్యాయి. కాల్పుల అనంతరం పోలీసులు ఘటనా స్థలంలో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. రెండు ఏకే 47 రైఫిల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దళ కమాండర్ బద్రుతో పాటు మరో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. బద్రుపై రూ.20లక్షల రివార్డు ఉంది. గుత్తికోయ సామాజిక వర్గానికి చెందని బద్రున స్వస్థలం ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా చెరమంగి, ఏగోళపు మల్లయ్య అలియాస్ మధుది పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామం, ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్, స్వస్థలం బీజాపూర్ జిల్లా ఉసూర్ గ్రామం, అలాగే మిగతా నలుగురు మావోయిస్టు సభ్యులైన ముస్సాకి జమున, జైసింగ్, కిషోర్, కామేష్‌లు కూడా ఛత్తీస్‌గడ్‌కు చెందిన వారే కావడం గమనార్హం.

### బహిరంగంగానే చర్చిద్దాం

**(మొదటి పేజీ తరువాయి)**

ఎద్దేవా చేశారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బిజెపి 'మోదీ గ్యారంటీ' పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని, మోదీ గ్యారెంటీల అమలు ఎంతవరకు వచ్చిందో చర్చించడానికి తాము సిద్ధమని అన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ స్కీములు, మోదీ ఇచ్చిన హామీలపై చర్చించడానికి తాము సిద్ధమన్నారు. 2014 నుంచి 2024 వరకు పెరిగిన పెట్రోల్, డీజీల్, గ్యాస్ ధరలపైన కూడా చర్చిద్దామని అన్నారు.

### కాంగ్రెస్ హామీలపై చర్చకు సిద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**

నెరవేరుస్తామన్న హామీలను, ఒక ఏడాది గడిచినా పూర్తికాలేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది విజయోత్సవాలను జరుపుకుంటుందని ఎద్దేవా చేశారు. గత ఏడాది డిసెంబర్ 9న అందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించారని, కానీ ఏడాది గడిచినప్పటికీ పూర్తిగా రుణమాపీ చేయలేదని ఆరోపించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు డిపాజిట్ రాలేదన్నారు. మోదీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపిదేనని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా సహాయం అందించిందని, కేంద్ర ప్రభుత్వం నేరుగా 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నుంచి నిధులు ఇస్తుందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని, అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజా ఉద్యమాల ద్వారానే బుద్ధి చెప్పాలని కిషన్ రెడ్డి అన్నారు.

## చల్పాక అడవుల్లో తుపాకుల మోత

### తెలంగాణలో మావోయిస్టులకు వరుస ఎదురు దెబ్బలు

#### ఎన్‌కౌంటర్‌పై అనుమానం పౌర హక్కుల సంఘం

**ప్రజాపక్షం/ఖమ్మం:** ఏటూరునాగారం సమీపంలోని చల్పాక అడవులు చాలా రోజుల తర్వాత తుపాకీ మోతలతో దద్దరిల్లాయి. చల్పాక అడవులు ఒకప్పుడు మావోయిస్టులకు కేంద్రంగా ఉండేవి. రెండు దశాబ్దాలుగా మావోయిస్టుల కదలికలు ఈ ప్రాంతంలో లేక ప్రశాంతతను సంతరించుకున్నాయి మళ్లీ ఆదివారం ఎన్‌కౌంటర్‌తో ఈ అడవులు ఉలిక్కి పడ్డాయి. 1991లో చల్పాక అడవుల్లో మందుపాతర పేల్చి ఎస్ఐ, సిఐ సహా ఏడుగురిని మావోయిస్టులు హతమార్చారు. సాధారణ ఎన్నికల సందర్భంగా 1991 జూన్ 21న పోలీసులను కవ్వించి అడవుల్లోకి రప్పించి హతమార్చారు. ఆ తర్వాత దాదాపు మూడు దశాబ్దాలకు మళ్లీ ఇప్పుడు చల్పాక అడవులు చర్చనీయాంశమయ్యాయి. ఆదివారం చల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఏరియా కార్యదర్శులు సహా మొత్తం ఏడుగురు హతమయ్యారు. కుర్సం మంగు అలియాస్ భద్రు ఉరఫ్ పాపన్న, ఎలగొల్పు మల్లయ్య అలియాస్ మధు, ఎం. దేవల్ అలియాస్ కరుణాకర్, ఎం. జమున, జైసింగ్, కామేష్ మృతి చెందిన వారిలో ఉన్నారు. మధు మినహాయిస్తే మిగిలిన వారంతా 35 ఏళ్ల లోపు వారే. భద్రు నర్సంపేట ఏరియా కార్యదర్శి కాగా మధు, కరుణాకర్, జమునలు మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్రంలో కీలక బాధ్యతల్లో ఉన్నట్లు సమాచారం. తెలంగాణలో వరుస ఎన్‌కౌంటర్లు మావోయిస్టులను మళ్లీ కోలుకోకుండా దెబ్బతీస్తున్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో భారీగా పోలీసులను మోహరించి ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులను ఏరివేస్తున్న క్రమంలో తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలపై మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ దృష్టి సారించింది. సెల్టర్ జోన్‌గా తెలంగాణను మార్చుకోవాలని ప్రయత్నించే క్రమంలో తెలంగాణ అడవుల్లో సాయుధ దళాల సంచారం మొదలైంది. కానీ ఇక్కడ వరుస ఎదురు దెబ్బలు మావోయిస్టు పార్టీని కోలుకోలేకుండా దెబ్బతీస్తున్నాయి. పోలీసులు మావోయిస్టు ప్రణాళికను అమలు కానివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఈ ఏడాది జూలై 25న దామరతోగు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కీలక నాయకుడు అశోక్ మృతి చెందగా సెప్టెంబర్ ఐదున కరక గూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే అతి పెద్ద ఎన్‌కౌంటర్. మళ్లీ ఇప్పుడు ఆదివారం చల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు హతం కావడం మావోయిస్టుల ప్రయత్నాని మళ్లీ దెబ్బకొట్టింది. గోదావరి నదికి ఇవతల మావోయిస్టులు పార్టీని విస్తరింపజేసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. కానీ ప్రతిసారి ఓ కుదుపు ఆ పార్టీకి ప్రతిబంధకంగా మారుతుంది. ప్రజల నుంచి అంతగా మద్దతు దొరకకపోవడంతో మావోయిస్టుల జాడ పోలీసులకు వెంటనే తెలిసిపోతుంది. ఎన్‌కౌంటర్ల పేరిట బలైపోతున్నారు. రెండవది మావోయిస్టులో స్థానికులు ఎక్కువగా లేకపోవడం ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన వారు ఎక్కువగా ఉండడంతో ప్రజల దరి చేరడంలో విఫలమవుతున్నారు. వెరసి తెలంగాణలో వరుస ఎదురు దెబ్బలకు గురవుతున్నారు.



**ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు :**

చల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ప్రజా సంఘాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం లక్ష్మణ్, ఎన్. నారాయణ ఆదివారం జరిగింది ఎన్‌కౌంటర్ కాదని పోలీసులు చిత్రహింసలకు గురిచేసి హతమార్చారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్ తర్వాత పౌర హక్కుల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు విషమిచ్చి మత్తుకు గురైన మావోయిస్టులను అదుపులోకి తీసుకుని చిత్రహింసలు పెట్టారని ఆ తర్వాత కాల్చి చంపారని వారు తెలిపారు. ఈ ఘటనపై ప్రస్తుత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక పరిరక్షణ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కేంద్రంతో కలిసి ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌లో ఒక పోలీస్ కూడా గాయపడకపోవడాన్ని గమనించాలని వారు కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో కగార్ తరహా ఆపరేషన్ కోరుకుంటున్నారని ఇది ప్రజల హక్కులకు భంగం కలిగించడమేనని పౌర హక్కుల సంఘం ఆరోపించింది.

### సరైన న్యాయం

**(మొదటి పేజీ తరువాయి)**




నేర్చుకోవాలన్నారు. కోర్టుల గౌరవాన్ని కాపాడే విధంగా న్యాయవాదులు మెదలుకోవాలని, తద్వారా కోర్టులకు వచ్చే బాధితులకు సకాలంలో న్యాయం అందించాలన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కుల గురించే మాట్లాడుతున్నారని, కానీ బాధ్యతలను గుర్తించడం లేదని అన్నారు. కోర్టులలో కేసుల విషయంలో న్యాయవాదులు వాయిదాలు కోరడం మానాలని, బాధితుల వైపు నిలబడాలని సూచించారు. హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నిర్మలా గీతాంబ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు ఆందోళనకరమని, న్యాయవ్యవస్థ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. న్యాయవాదులు రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో సైనికుల వంటి వారని చెప్పారు. న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య పరస్పర గౌరవ సంబంధాలను కొనసాగించాలన్నారు.ఈ మహాసభలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షులు పొట్ల మాధవరావు, ఏపి రాష్ట్ర అధ్యక్షుడు కేవీఎస్ సురేష్, ఝార్ఖండ్ బార్ కౌన్సిల్ సభ్యులు రషీద్, సీనియర్ న్యాయవాదులు జి. విద్యాసాగర్ రెడ్డి, ఎం. ఆది రెడ్డి, బీమనాథం శ్రీనివాస్, అయిప్సో జాతీయ కార్యదర్శి కేవిఎల్, వరంగల్, జనగామ, ములుగు జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, వై. చంద్ర రుషి, వినయ్ కుమార్, ఐఏఎల్ రాష్ట్ర, జిల్లా నాయకులు క్రిష్ణారావు, జి. వెంకటేశ్వర్లు, మేరుగు సుభాస్, కొత్తపల్లి చిరంజీవి, వలీ ఉల్లా ఖాద్రి,జయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి. ప్రవీణ్ కుమార్‌తో పాటు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్ రమేష్ బాబు,హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నిర్మలా గీతాంబను ఐఏఎల్ నాయకులు,మహాసభల ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

**న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలి రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్**

న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. మహాసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులను అరికట్టాలని, అందుకు తక్షణమే ప్రొటెక్షన్ యాక్ట్ అమలులోకి తేవాలన్నారు.

రూ. 10 లక్షల న్యాయవాదుల ఆరోగ్య భీమా అమలు చేయాలని, ప్రాక్టీసు నిలిపి వేసి రిటైర్డ్ అయిన న్యాయవాదులకు ఆరు లక్షలు చెల్లించడంతో పాటు నెలకు రూ. 10వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అలాగే న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం సంవత్సరానికి రూ. 15 కోట్ల కార్పస్ ఫండ్ ఇవ్వాలన్నారు.. ఈ సందర్భంగా ఝార్ఖండ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రషీద్ న్యాయవాదుల సంక్షేమానికి ఆ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

### సంక్రాంతి తర్వాత రైతు భరోసా

**(మొదటి పేజీ తరువాయి)**

చెప్పారు. ప్రభుత్వం ఇంత అప్పుల్లో ఉందని కెసిఆర్, హరీశ్ రావు, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటెల రాజేందర్, అధికారులు ఎవరూ చెప్పలేదన్నారు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ఆస్తులు, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేశామని సిఎం గుర్తు చేశారు. భారీగా ఉన్న అప్పు చూసి కూడా అధైర్యపడకుండా పాలనసాగిస్తున్నామన్నారు.

**అధికారంలోకి రగానే కెసిఆర్ బకాయి పెట్టిన రూ.7,625 కోట్ల రైతు బంధు చెల్లించాం..**

2023 వానాకాలంలో రైతు బంధును కెసిఆర్ ప్రభుత్వం ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. కెసిఆర్ బకాయి పెట్టిన రూ.7,625 కోట్ల రైతు బంధు మేం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించామని గుర్తు చేశారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా నూటికి నూరుశాతం రైతు రుణమాఫీ చేశామని చెప్పారు. ఆగస్టు 15నాటికి 22.22లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామన్నారు. ఆగస్టు 15నాటికి రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లు జమచేశామన్నారు. నిన్న (శనివారం) 3.14లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,747కోట్లు వేశామన్నారు. ఇప్పటివరకు 25.35 లక్షలమంది రైతుల ఖాతాల్లో రూ.21వేల కోట్లు జమ చేశామన్నారు. రుణమాఫీ విషయంలో బిఆర్ఎస్ రైతులను మోసం చేసిందని విమర్శించారు. మారీచుల మాయ మాటలు రైతులు నమ్మొద్దు అని ప్రజలకు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏమైనా మానవ తప్పిదాలతో జరిగితే మళ్లీ సరిదిద్దుతామన్నారు. ఖాతాల్లో తప్పులు సరిదిద్దుకుని అధికారులకు చెప్తే రుణమాఫీ పూర్తవుతుందని సిఎం చెప్పారు. రేషన్ కార్డు లేని వారికి కూడా రుణమాఫీ చేశామన్నారు. మొదట్లో బ్యాంకు అధికారులు రుణమాఫీపై సరైన సమాచారం ఇవ్వలేదన్నారు. బ్యాంకుల్లోని మొత్తం పాతబకాయిలు కలిపి రూ. 30 వేల కోట్లుగా లెక్క చెప్పారన్నారు.

మిగితా తొమ్మిదేళ్లు కూడా అన్ని కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహిస్తాం..

మిగితా 9 ఏళ్లు కూడా అన్ని కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తామనే నమ్మకం కలిగిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతులకు తొలి ప్రాధాన్యం ఇస్తుంది కాంగ్రెస్ ఒక్కటే అన్నారు. నెహ్రూ నుంచి వైఎస్ఆర్, ఇప్పుడు కూడా రైతులే మా ఎజెండా అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతులకు తొలిప్రాధాన్యం ఇస్తున్నది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. రుణమాఫీ విషయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు మోసం చేసిందని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతోనే భోజనం..**

ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతోనే భోజనం వడ్డించేలా ఆదేశాలు ఇచ్చామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్, బిజెపి రూపంలో వచ్చే మారీచులను రైతులు నమ్మొద్దని అన్నారు. బిపిటి, హెచ్‌ఎంటి, తెలంగాణ సోనా వేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం రైతుల కోసం పని చేస్తుందన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గుజరాత్ గులామని విమర్శించారు. కిషన్ రెడ్డికి తెలంగాణతో ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఆయనకు తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలపై చర్చిద్దాం రావాలని సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. గుజరాత్‌లో మద్య నిషేదం అమల్లో ఉందని, కానీ అక్కడికి వెళ్లితే ఏ బ్రాండ్ అంటే ఆది దొరుకుతుందని ఒక ప్రశ్నకు సమాధనంగా సిఎం చెప్పారు.

ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. రైతులను రాజు చేయాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలోమంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, ఎంపి మల్లు రవి, ఎంఎల్‌ఏలు దానం నాగేందర్, మందుల స్వామియేల్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, శ్రీగణేశ్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.









# బడుగుల నేస్తం బాలమల్లేశ్








(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ నాయకులు బోయినపల్లి వినోద్‌కుమార్, వి.శ్రీనివాస్ గౌడ్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంఎల్‌సి ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డి.జి.నర్సింహ, టి.సాగర్, సిపిఐ ఎంఎల్ (న్యూడెమొక్రసీ) నాయకులు భాస్కర్, మహేష్‌కుమార్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు ఎస్.ఎల్ పద్మ, రమ, ఎస్‌యుసిఐ (సి) రాష్ట్ర కార్యదర్శి మురహరి, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకి రాములు, ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ, బిఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, పల్లె రవి కుమార్, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, సినీదర్శకులు బాబ్జీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బాలమల్లేష్‌తో తమకు ఉన్న సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు కంటతడి పెట్టుకున్నారు. బాలమల్లేష్ ఆశయ సాధన కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బాలమల్లేష్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

**పలువురి నివాళి :** సిపిఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, నాయకులు రామాంజనేయులు, సిపిఐ సీనియర్ నాయకులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, సిపిఐ ఎం.ఎల్.న్యూడెమొక్రసీ నాయకులు కె.గోవర్ధన్, మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరి రావు, పిఒడబ్లు నాయకురాలు సంధ్య, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధానకార్యదర్శి ఎం.నర్సింహ, కార్యదర్శి వెంకటేష్, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.కాంతయ్య, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్, గీతపనివారల సంఘం రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎన్‌ఎఫ్‌ఐ డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, జనరల్ మేనేజర్ ఎన్.మధుకర్, 'ప్రజాపక్షం' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ ఇ.చంద్రశేఖర్, జనరల్ మేనేజర్ (యాడ్స్) వి.మదన్ తదితరులు పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎస్.ఛాయాదేవి (హైదరాబాద్), సాయిలు గౌడ్( మేడ్చల్ మల్కాజిగిరి), పాలమాకుల జంగయ్య (రంగారెడ్డి ), బెజవాడ వెంకటేశ్వర్లు (సూర్యాపేట), నెల్లికంటి సత్యం (నల్లగొండ), గోదా శ్రీరాములు (యాదాద్రి భువనగిరి), సాబీర్ పాషా(కొత్తగూడెం), మంద పవన్ (సిద్ధిపేట) మర్రి వెంకటస్వామి(కరీంనగర్), విజయ లక్ష్మి పండిట్ (వికారాబాద్ ), రాజారెడ్డి (జనగాం), కర్రె బిక్షపతి (హన్మకొండ) బాలమల్లేష్ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**బాలమల్లేష్ మరణం తనకు, పార్టీకి నష్టం : కూనంనేని**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బాలమల్లేష్ మరణం వ్యక్తిగతంగా తనకు, పార్టీకి నష్టమని అన్నారు. పార్టీ ఎటువంటి బాధ్యతలను అప్పగించినా బాలమల్లేష్ పూర్తి చేసేవారని, వామపక్షాల సమన్వయ బాధ్యతలను ఆయనకే అప్పగించేవారమని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల ప్రేరణతో ఎంతో మంది నాయకులు తయారు కావాల్సిన అసవరం ఉన్నదన్నారు. అతి చిన్న వయసులోనే బాలమల్లేష్ మరణించడం దురదృష్టకరమన్నారు. బాలమల్లేష్ కుటుంబానికి సిపిఐ పూర్తి అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని అన్నారు.

**మనసులో చిరస్థాయిగా నిలిచే వ్యక్తి : చాడ**

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బాలమల్లేష్ భౌతికంగా లేపోయినప్పటికీ అందరి మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఆయన అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారని, రెడ్ గార్డ్ నుంచి అంచలంచెలుగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా తాను పనిచేసిన సమయంలో చేపట్టిన "పోరుబాట"లో తనతో పాటు బాలమల్లేష్ పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు.

**పేదల కోసం పరితపించే ఉద్యమకారుడు : మహేష్ కుమార్‌గౌడ్**

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నిరంతరం పేదల కోసం పరితపించే ఉద్యమకారుడు బాలమల్లేష్ అని, ఆయన మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. బాలమల్లేష్ మరణం పేద, మధ్యతరగతి వర్గాలకు తీరని నష్టమన్నారు. గతంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాను బాలమల్లేష్‌తో కలిసి అనేక పోరాటాలు, ప్రజా సంఘాల సమావేశాల్లో పాల్గొన్నానని గుర్తు చేశారు.

**పేదలు ఒక ఆత్మబంధువును కోల్పోయారు : వేం నరేందర్ రెడ్డి**

ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బాలమల్లేష్ మరణించడంతో పేదలు ఒక ఆత్మబంధవును కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన సందర్భంలో కూడా బాలమల్లేష్ పేదలకు సంబంధించిన సమస్యలనే ప్రస్తావించారని తెలిపారు. మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో బాలమల్లేష్‌ను తాను దగ్గరగా చూశానని, ఆయన నిత్యం పేదలు, బలహీనవర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారన్నారు. బాలమల్లేష్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాలమల్లేష్ మరణం పట్ల సిఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా బాధపడ్డారని, అనివార్య కారణాలతో సిఎం రాలేకపోయారని తెలిపారు.

**కలగొలుపుగా ఉండే బాలమల్లేష్ : కోదండరామ్**

టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ అందరితో కలగొలుపు, ఉత్సాహం కలిగిన నాయకుడు బాలమల్లేష్ అని కొనియాడారు. ఆయనది అందరితో కలిసిపోయే మనస్తత్వమని, హైదరాబాద్‌లో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టినా ముందుండి వాటిని విజయవంతం చేసేవారని గుర్తుచేశారు. ఒక అద్భుతమైన కార్యకర్తను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

**బాలమల్లేష్‌లో సామాజిక స్పృహ ఉన్నది: వినోద్‌కుమార్**

బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ బాలమల్లేష్ జీవితం ఒక త్యాగమయమని, ఆయనలో సామాజిక స్పృహ ఉన్నదని అన్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన వ్యవసాయ కార్మిక సమావేశంలో వ్యవసాయ కూలీలకు కూడా రైతు బీమాను అమలు జరిపించాలని ప్రతిపాదించిన సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి బాలమల్లేష్ అని కొనియాడారు. గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వి.వెన్నెల మాట్లాడుతూ బాలమల్లేష్ అడుగులో తామూ అడుగుగా ముందుకెళ్తామన్నారు. సిపిఐ సీనియర్ నాయకుడు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బాలమల్లేష్ మరణాన్ని తాను జీర్ణించుకోలేకపోతున్నానన్నారు.

**వామపక్ష, ప్రజా, భూపోరాటాలకు నష్టం: సాగర్**

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్ మాట్లాడుతూ బాలమల్లేష్ అకాల మరణం వామపక్ష, ప్రజా, భూ పోరాటాలకు తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యుదయ, వామపక్ష ఉద్యమాలకు ఆయన లేని లోటు తీరనిదన్నారు.

**బాలమల్లేష్ ఒక ఆణిముత్యం: నాగేశ్వర్**

మాజీ ఎంఎల్‌సి ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ తమ ఆర్థిక ప్రయోజనాల కోసం కనీసం విలువలను కూడా పాటించని నేటి రాజకీయ వ్యవస్థలో, బాలమల్లేష్ ఒక అణిముత్యం లాంటి కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. కష్ట, శ్రమ, పేద వర్గాల పక్షాన నిరంతరం పనిచేస్తూ పోరాటం చేసిన నాయకుడని అన్నారు. ఎంఎల్‌సి గోరటి వెంకన్న మాట్లాడుతూ బాలమల్లేష్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూపోరాటాల్లో పాల్గొన్నారని, నిత్యం ప్రజల కోసం పరితపించారన్నారు. ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్ మాట్లాడుతూ బాలమల్లేష్, తాను యువజన సంఘాలలో కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం ప్రజాతంత్ర, బహుజన ఉద్యమాలకు తీరని లోటన్నారు.






## సురవరం సుధాకర్‌రెడ్డి, అజీజ్‌పాషా సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన కామ్రేడ్ బాలమల్లేష్ ఆకస్మికంగా మరణించిన విషాద వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, ఎఐటియుసి సీనియర్ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి అన్నారు. బాలమల్లేష్ విద్యార్థి రోజుల నుంచి తనకు, తన కుటుంబానికి పరిచయం ఉన్నదని గుర్తుచేసుకున్నారు. బాలమల్లేష్ మృతికి సంతాపాన్ని, ఆయన సతీమణి వందన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వారు తెలియజేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ ఆకస్మిక మరణం సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్‌కు, ఆయన కుటుంబానికి తీరనిలోటు అని సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా అన్నారు. బాలమల్లేష్ సతీమణి వందనకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సిపిఐ సహా ప్రజాసంఘాల ఉద్యమాల నిర్మాణంలో బాలమల్లేష్ విశేషమైన కృషి చేశారని, ఆ కృషి ఎన్నటికీ మరిచిపోలేనిదన్నారు. విద్యార్థి దశలో ఉన్న కాలంనుంచి బాలమల్లేష్ పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేశారని, పీడిత తాడిత అట్టడుగువర్గాలకు వ్యవసాయ భూములు, ఇండ్ల స్థలాలు సాధించేందుకు అలుపెరుగని, మడమతిప్పని సమరశీల పోరాటాలు నిర్వహించి విజయం సాధించాడన్నారు. సిపిఐ సహా కార్మికులు, రైతులు, అణగారినవర్గాలకు బాలమల్లేష్ మృతి తీరనిలోటు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాలమల్లేష్ మృతి పట్ల సిపిఐ నాయకులు వి.రాంనరసింహారావు సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### ప్రతి ఎకరానికి సాగు నీరు అందేలా ..

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి



రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

లక్ష మందితో డిసెంబర్ 4న పెద్దపల్లిలో బహిరంగ సభ

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులు, పౌరసరఫరాల విభాగంపై మంత్రి సమీక్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రోటోకాల్ ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌తో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పౌరసరఫరాల శాఖ విభాగంపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌లు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలుపై అధికారుల తీసుకోవాల్సిన చర్యల గురించి పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ పనులు, కాళేశ్వరం ప్యాకేజ్ 9 పెండింగ్, చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకం, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం, రామగుండం ఎత్తిపోతల పథకం, ఎల్లంపల్లి కెనాల్ నెట్ వర్క్ ప్యాకేజ్ 2 పనులు, ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తదితర అంశాలపై మంత్రి ఉత్తమ్ సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మన రైతులు పండించారని, గతంలో ఎక్కడా లేని విధంగా సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందని, రైతులకు ఎక్కడా తరుగులేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులకు రికార్డు సమయంలో వడ్ల డబ్బులు పడ్తున్నాయని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తికరంగా ఉందని, డిసెంబర్ 4న సిఎం పర్యటన ఉన్న సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి రైస్ మిల్లులు/ఇంటర్మీడియట్ గోదాములకు తరలించాలని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే గంటల వ్యవధిలో రైతులకు మద్దతు ధర, బోనస్ చెల్లించడం జరుగుతుందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన నేపథ్యంలో డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, గత ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తమ ప్రభుత్వం 10 నెలల కాలంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేశామని, ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ ప్రైవేట్ సంస్థలో యువత ఉపాధి పొందేలా అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, సిఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం గత 10 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టాలని, దేవాదుల ప్రాజెక్టుగా సంబంధించి మరిన్ని అవుట్ లెట్ నిర్మాణం చేయాలని, పత్తిపాక రిజర్వాయర్ నిర్మించడం వల్ల 2.4లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు కొత్తగా మరో 15 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా జరుగుతుందని అన్నారు. రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వ పాలసీ అనుసరిస్తూ సహకారం అందిస్తున్నారని అన్నారు. జిల్లాలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌ను కలెక్టర్, ఉన్నతాధికారులు రెగ్యులర్‌గా తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని, గౌరవెల్లి గండేపల్లి ప్రాజెక్టులను లింక్ చేసి సమాంతరంగా నిర్మాణ పనులు చేపట్టాలని గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి బండ్ నిర్మాణం చివరి దశలో ఉందని, కాలువల పనులకు అవసరమైన భూసేకరణ పూర్తిచేయాలని, భూ సేకరణపై ఎటువంటి కోర్టు నిబంధనలు లేనందున ముందుగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాళేశ్వరం ప్యాకేజీ 9 పనులు, మలక్‌పేట రిజర్వాయర్ కాలువ, అప్పర్ మానేరు పనులు ప్రాధాన్యత అందించాలని కోరారు.

అనంతరం మంత్రుల బృందం సిఎం రేవంత్ రెడ్డి డిసెంబర్ 4న పాల్గొనే యువశక్తి సభా స్థలిని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రెస్ మీట్ నిర్వహించి ముఖ్యమంత్రి సభ నిర్వహణ, సాగునీటి ప్రాజెక్టులు, ధాన్యం కొనుగోలు, సన్న రకం వడ్లకు బోనస్ వంటి అంశాల పై తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్య నారాయణ, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పామెలా సత్పతి, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, పెద్దపల్లి అదనపు కలెక్టర్‌లు డి.వేణు, జె.అరుణశ్రీ, అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ దోపిడీదారుల కోసమే

# బ్యాంకుల ప్రైవేటీకరణ

ప్రైవేటీకరణను మహిళా ఉద్యోగులు ప్రతిఘటించాలి

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దోపిడీదారుల కోసమే మోదీ ప్రభుత్వం బ్యాంకులను ప్రైవేటీకరిస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు ఆరోపించారు. దేశ అభివృద్ధికి, పురోగతికి ఊతమివ్వడానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలకమైన పాత్రను పోషిస్తాయన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకింగ్‌ను మరింత బలోపేతం చేయడానికి బదులుగా ప్రైవేటీకరిస్తే సామాన్య ప్రజల పొదుపునకు భద్రత ఉండబోదని, ఆ పొదుపు దోపిడీకి గురయ్యే అవకాశాలు ఉంటాయని, తద్వారా బ్యాంకు ఉద్యోగుల భద్రతకు పెనుముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్, నారాయణగూడలోని తాజ్ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన 'ఇండియన్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్' (ఎపి,టిఎస్) ఆధ్వర్యంలో బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అసోసియేషన్ మహిళా విభాగం కన్వీనర్ జి.పద్మ అధ్యక్షత వహించగా, ఈ సదస్సులో బి.ఎస్.రాంబాబుతో పాటు ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి.రాజేశ్వరరెడ్డి, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డా.మౌనిక బోపన్న, ప్రముఖ పాత్రికేయురాలు అజిత కాట్రగడ్డ, ఇండియన్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపి,టిఎస్) చైర్మన్ కె.రాధాకృష్ణ, అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్, ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు తదితరులు వేదికపై ఆసీనులయ్యారు. రాంబాబు ప్రారంభోపన్యాసం చేస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేందుకు బ్యాంకుల జాతీయకరణ చేపట్టాలని దేశ వ్యాప్తంగా ఎఐబిఇఎ చేసిన అనేక పోరాటాల ఫలితంగానే ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయకరణ చేశారని గుర్తు చేశారు. నాటి నుండి నేటి వరకు బ్యాంకింగ్ రంగం దేశ అభివృద్ధికి ఆర్థిక వెన్నెముక అని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో, అభివృద్ధికి వనరులను పెంపొందించడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయని, బ్యాంకులో జమ చేసిన సామాన్య ప్రజల పొదుపును కాపాడుతున్నాయని తెలిపారు. ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణ చేపట్టినప్పుడు జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్‌లు తీవ్రంగా వ్యతరేకించాయని, ఇప్పుడు జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలనే బిజెపి అనుసరిస్తుందని, బ్యాంకుల ప్రైవేటీకరణ చేపడుతుందని విమర్శించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణతో ప్రజా సొమ్ము లూటీ జరిగే ప్రమాదంతో పాటు బ్యాంకు ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని, భవిష్యత్తులో పెన్షన్ విధానం కూడా కనుమరుగు అవుతుందని ఆయన తెలిపారు. నష్టాల్లో కూరుకున్న ప్రభుత్వరంగ బ్యాంకులను లాభాల్లో తెచ్చిన ఘనత బ్యాంకు ఉద్యోగులదేనన్నారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. ప్రజా సొమ్ము, ఉద్యోగ భద్రతకు, మోదీ ప్రభుత్వ ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఓడించి, ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించుకునేందుకు బ్యాంకు ఉద్యోగులు బలమైన పోరాటానికి సిద్ధంకావాలని అయన పిలుపునిచ్చారు. అన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 48 శాతం మహిళా ఉద్యోగులు ఉన్నారని, బ్యాంకుల ప్రైవేటీకరణను తీవ్రంగా ప్రతిఘటించాలని, విస్తృతమైన పోరాటాలు నిర్వహించాలని బి.ఎస్. రాంబాబు పిలుపునిచ్చారు. జి.రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమ్మతితో అత్యున్నత నైతికతకు అనుగుణంగా ఇండియన్ బ్యాంకు తన వ్యాపారాన్ని నిర్వహిస్తూ లాభాల్లో నడుస్తుందని వివరించారు. పని ప్రదేశంలో వివక్ష, లైంగిక వేధింపులకు గురైన కొన్ని సంఘటనలు ఇండియన్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ తమ దృష్టికి తీసుకొచ్చిందని, ఇలాంటి సంఘటనలు జరగకుండా ఇండియన్ బ్యాంకు యాజమాన్యం కఠిన చెర్యలు తీసుకుంటుందని జి.రాజేశ్వరరెడ్డి తెలిపారు.

# కాలుష్య నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జీవమున్న ఏకైక గ్రహమైన భూమిని భవిష్యత్ తరాల మనుగడుకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మనుషులకు ప్రాణాధారమైన గాలి, నీరు, నేల రోజు రోజుకీ విషతుల్యమై, ప్రాణాలను హరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణ దిశగా ప్రభుత్వానికి సహకరిస్తూ, విధిగా ఉద్యమించాల్సిన పరిస్థితి నెలకొన్నదని మంత్రి సురేఖ తెలిపారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినం ( డిసెంబర్ 2) సందర్భంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ కాలుష్య నియంత్రణపై తన భావాలను పంచుకున్నారు. భారతదేశంలో 1984 డిసెంబర్ 2న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లోని యూనియన్ క్యాబ్డ్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఘోరమైన పారిశ్రామిక విపత్తుగా నిలిచిందని మంత్రి సురేఖ అన్నారు. ఈ దుర్ఘటనలో విడుదలైన ప్రమాదకరమైన మిథైల్ ఐసోసైనేట్ అనే విష రసాయనంతో కూడిన గాలిని పీల్చి వేల మంది మరణించగా, దాదాపు 6లక్షల మంది ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవడం నాడు దేశాన్ని కంపింపచేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఘోర దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారిని స్మరించుకుంటూ ప్రతీ ఏడాది డిసెంబర్ 2న జాతీయ కాలుష్య నియంత్రణ దినాన్ని జరుపుకుంటున్నామని మంత్రి సురేఖ తెలిపారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పరిశ్రమల కాలుష్యాన్ని నివారించడంతో పాటు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడేలా ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏటా డిసెంబర్ 2న జాతీయ కాలుష్య నియంత్రణ దినాన్ని జరుపుకుంటున్నామని మంత్రి సురేఖ పేర్కొన్నారు. మానవ నిర్లక్ష్యం వల్ల రోజురోజుకీ పెరుగుతున్న కాలుష్యంతో సంభవిస్తున్న దుష్పరిణామాలు, కాలుష్య నియంత్రణకై ఆచరించాల్సిన కార్యాచరణను ప్రచార చేయడం, పారిశ్రామిక కాలుష్యాన్ని నివారించే దిశగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి సురేఖ వివరించారు.

ఫోకస్

# ఆరోగ్యం

## చెవులు వినిపించవు



ఒక వయసుకు వచ్చేసరికి వినికిడి కూడా తగ్గుతుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో అధిక పౌనఃపున్యం ఉండే ధ్వనులు సరిగా వినపడవు. చాలామంది వినికిడి తగ్గిందన్న విషయాన్ని అంగీకరించటానికే ఇష్టపడరు. ఒకవేళ దాన్ని అంగీకరించినా, వైద్యులకు చూపించుకోవటానికి ఇష్టపడరు. కానీ దీనివల్ల నలుగురిలో కలవలేకపోవటం, ఎవరేమంటారోనని చిన్నతనంగా భావిస్తుండటం, సమాజానికి దూరం కావటం, క్రమేపీ కుంగుబాటులోకి జారిపోవటం వంటి సమస్యలన్నీ బయల్దేరతాయి. కాబట్టి వినికిడి తగ్గుతోందనిపిస్తే తోసేసుకుని తిరగటం కాకుండా.. వైద్యులకు చూపించుకుని అవసరమైతే తేలికపాటి వినికిడి యంత్రాల వంటివి తీసుకోవటం ద్వారా చక్కటి సామాజిక జీవితాన్ని గడపొచ్చని గుర్తించాలి. యుక్తవయసు నుంచీ పెద్దపెద్ద ధ్వనులు వినకుండా ఉండటం, చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని అతిగా ధ్వని పెంచుకో కుండా ఉండటం చెవి ఆరోగ్యానికి ముఖ్యం.

## ఊడే పళ్లు... బోసి నవ్వు..



వయసుతోపాటు పళ్లు ఊడడం సహజం. ఈ సమస్య లేని వారు చాలా అరుదు. ఊడే పళ్లు.. బోసి నవ్వే వయసు మీరిన వారి ప్రత్యేకతలు. ఇప్పటికీ మన సమాజంలో చాలా మంది నమ్మే విషయం ఒక వయసు రాగానే అందరికీ దంతాలు వూడిపోతాయనీ, నోరు బోసిపోవటం తథ్యమనీ! ఇది చాలా తప్పు. చిన్న వయసు నుంచీ చక్కటి నోటి ఆరోగ్య పద్ధతులు పాటిస్తూ ఉన్న వారికి వృద్ధాప్యంలో పళ్లు వూడిపోవు. నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవటం, చక్కటి ఆహారం తీసుకోవటం ఈ రెండూ పాటిస్తే జీవితాంతం మన దంతాలు మనతోనే ఉంటాయని వైద్యరంగం ఎప్పటి నుంచో చెబుతోంది. రోజూ రెండుపూట్లా బ్రషింగ్ చేసుకోవటం, చక్కగా నములుతూ ఆహారం తీసుకోవటం, ఆహారం తీసుకోగానే నోటిని శుభ్రపరచుకోవటం, అప్పుడప్పుడు దంత వైద్యులకు చూపించుకుని దంతాల మీద గార పేరుకుంటే దాన్ని తొగించేందుకు స్కేలింగ్ చేయించుకోవటం.. ఈ జాగ్రత్తలు తీసుకుంటే చాలు! చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి రక్తం చిమురుస్తుండటం వంటి సమస్యలు తలెత్తితే వెంటనే దంతవైద్యులకు చూపించుకుని చికిత్స తీసుకోవటం చాలా అవసరం. చిగుళ్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే దంత మూలం బలహీనపడి, దంతాలు వూడిపోయే అవకాశాలు పెరుగుతాయి. దంతాలు వూడితే ఆహారం తీసుకోవటం కష్టంగా తయారై, పోషకాహారం తినలేని పరిస్థితులూ తలెత్తుతాయి. దీనివల్ల మొత్తం ఆరోగ్యమే దెబ్బతింటుంది. అలాగే వయసు పెరిగిన కొద్దీ నోరు పొడిబారటం ఎక్కువ అవుతుంది, దీనివల్ల దంతాల మీద రంధ్రాలు పడటం, చిగుళ్ల బాధల వంటివీ పెరుగుతాయి. కాబట్టి చిగుళ్ల సమస్యలు, దంతాలు పుచ్చిపోవటం, జివ్వుమనటం వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను చూపించుకుని, వాటిని చక్కదిద్దుకోవాలి. ఒకవేళ దంతాలు వూడినా ఇప్పుడు సమర్థమైన, శాశ్వతమైన కృత్రిమ దంతాలు (ఇంప్లాంట్స్) అమర్చే అవకాశం ఉంది కాబట్టి వృద్ధాప్యంలో దంత సమస్యలతో ఇబ్బందులు పడాల్సిన అవసరమే లేదని గుర్తించాలి. సాధారణ ఆరోగ్యం బాగుండేందుకు కూడా ఇది కీలకం!

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం) ప్రతి సోమవారం

- కామన్వెల్తులో సభ్యత్వంగల దేశాల సంఖ్య?
  53
- తెలివితేటలకు మూలస్థానము
  మస్తిష్కము
- మనదేశంలో ఎక్కువసార్లు ప్రవేశపెట్టిన అత్యవసర సరిస్థితి ఏది?
  రాజ్యాంగబద్ధ అత్యవసర పరిస్థితి
- పూర్ణ స్వరాజ్యం తమ లక్ష్యమని ప్రకటించిన సమావేశం?
  లాహోర్ సమావేశం
- నాజీ పార్టీ గుర్తు ఏమిటి?
  స్వస్తిక్
- సైమన్ కమిషన్ భారతదేశ పర్యటన?
  1927
- మానవుడిలో చక్కని ఆలోచనకు కారణమైన మెదడు భాగం?
  మస్తిష్కం
- పోలవరం ప్రాజెక్టుకు పెట్టిన పేరు
  ఇందిరాసాగర్
- వేప శాస్త్రీయ నామము
  అజా రక్తా ఇండికా
- తల్లిపాలలో ఉండే విటమిన్
  ఎ
- పశ్చిమంగా ప్రవహించే నది
  తపతి
- మొక్కల నుండి వచ్చు ఆహారంలో వుండని విటమిన్
  విటమిన్ 'డి'
- చంపారన్ సత్యాగ్రహ ముఖ్యాంశం?
  నీలిమందు
- భారతదేశంలో ఎవరికాలంలో మొదటిసారిగా రైలు మార్గం వేశారు?
  డల్హౌసీ
- మోతీలాల్ నెహ్రూ స్థాపించిన పార్టీ?
  స్వరాజ్ పార్టీ
- వృక్షాయుర్వేదం గ్రంథాన్ని వర్గీకరణను ప్రతిపాదించింది?
  పరాశరుడు
- చౌరీచౌరా సంఘటన?
  1922
- హిమాలయ పర్వత రాజ్యంగా పేర్గాంచింది.
  నేపాల్
- 'విటమిన్ సి' లోపం వల్ల కలిగే వ్యాధి
  స్కర్వి
- కేంద్రంలో ఎగువ సభ
  రాజ్యసభ
- 'త్రిషష్టి సలక పురుష చరిత' అనే గ్రంథాన్ని రచించిన జైన పండితుడు ఎవరు?
  హేమచంద్రుడు
- గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించినది?
  1920
- కిందివాటిలో వైరస్ వ్యాధి కానిదేది?
  మానవుడు – క్షయ
- నల్లజాతివారి హక్కుల కొరకు గాంధీజీ ఈ దేశంలో పోరాడాడు?
  దక్షిణాఫ్రికా
- కిందివాటిలో బౌద్ధమత సంగీతి జరగని ప్రదేశం ఏది?
  సారానాథ్

## రక్తపోటు.. మధుమేహం సరేసరి

ఈ మధ్యకాలంలో వయసుతో సంబంధం లేకుండా మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. మలివయసులో ఈ సమస్యలు అధికం. యుక్తవయసు నుంచీ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించటం ద్వారా వీటిని సాధ్యమైనంత వరకూ దరిజేరకుండా చూసుకోవచ్చు గానీ అన్నిసార్లూ వీటిని పూర్తిగా తప్పించుకోలేకపోవచ్చు. వీటిని నిర్లక్ష్యం చేస్తే గుండెజబ్బులు, పక్షవాతం వంటి రకరకాల సమస్యలు వెంటాడతాయి. కాబట్టి తరచూ పరీక్షలు చేయించుకుంటూ, చికిత్స కొనసాగిస్తూ వీటిని కచ్చితంగా అదుపులో ఉంచుకోవాలి. అలాగే మలివయసులో ఎదురయ్యే మరో పెద్ద సమస్య క్యాన్సర్. స్త్రీలలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు, పురుషుల్లో ప్రోస్టేటు గ్రంథి క్యాన్సర్ల వంటివి ఎక్కువ. వూపిరితిత్తులు, పెద్దపేగు క్యాన్సర్ల వంటివి ఇద్దరిలోనూ కనబడుతుంటాయి. కాబట్టి ఒంట్లో ఎక్కడైనా గడ్డలు రావటం, వీడకుండా దగ్గు వేధించటం, మలవిసర్జన అలవాట్లు మారిపోవటం, రక్తం కనబడటం, బరువు తగ్గిపోవటం, పుండ్లు మానకపోవటం వంటి లక్షణాలేవైనా కనబడితే వాటిని ఏమాత్రం నిర్లక్ష్యం చెయ్యకుండా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. యుక్తవయసు నుంచీ పండ్లు, ఆకుకూరలు,




కూరగాయల వంటి సహసిద్ధమైన ఆహారం ఎక్కువగా తీసుకోవటం, బరువు పెరగకుండా చూసుకోవటం, నిత్యం వ్యాయామం చెయ్యటం వీటితో క్యాన్సర్తో సహా చాలా రుగ్మతలు, వ్యాధులు దరిజేరకుండా వృద్ధాప్యాన్ని హాయిగా ఆస్వాదించే అవకాశం ఉంటుందని గుర్తించాలి.

## కళ్లు కనిపించవు..

వృద్ధాప్యానికి చేరుతున్న కొద్దీ కంటిచూపు తగ్గుతుంది. చాలా సందర్భాల్లో శస్త్రచికిత్స అనివార్యమవుతుంది.. ఈ విషయాన్ని గుర్తించుకొని, 35–40 ఏళ్ల నుంచీ దృష్టి పరీక్షలు చేయించుకుని అవసరమైతే కళ్ల అద్దాలు తీసుకోవటం మంచిది. ఒక వయసుకు రాగానే కంటిలోని కార్నియా పొర దళసరిగా తయారై, శుక్లాలు రావటం కూడా సహజం. దీనికి ఇప్పుడు శుక్లాన్ని తొలగించి కంటిలోనే లెన్సును అమర్చే సమర్థమైన సర్జరీ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా.. వయసుతో పాటు కంటిలో నీటికాసులు పెరగటం, దృష్టికి కీలకమైన మాక్యులా పొరక్షీణించటం, మధుమేహం ఉంటే దాని కారణంగా రెటీనా పొర మీద రక్తం కమ్మటం వంటి రకరకాల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. సమస్యేమంటే ఈ సమస్యలు కొంత తీవ్రమైనవి, వీటి వల్ల దృష్టి దెబ్బతినే అవకాశాలు చాలా ఎక్కువ. వీటికి ముందస్తు సంకేతాలు కూడా ఏమీ ఉండవు. వీటిని ముందే గుర్తిస్తే కచ్చితంగా నియంత్రణలో ఉంచుకోవటం ద్వారా చూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. కాబట్టి ఒక వయసు వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా



తరచూ కంటి పరీక్ష, అదీ 'సంపూర్ణ నేత్ర పరీక్ష' చేయించుకుంటూ ఉండటం ఉత్తమం. ఈ పరీక్ష కోసం కంటిలో చుక్కల మందు వేసి, కనుపాప పెద్దదైన తర్వాత పరికరాలతో లోపలంతా క్షుణ్ణంగా పరీక్షిస్తారు. ఈ పరీక్షే ముఖ్యమని గుర్తించాలి.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి




**ప్రజాపక్షం/కోదాడ:** ప్రభుత్వాలు ఎన్ని మారిన ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్టీయు జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఆర్‌సి వెంటనే ప్రకటించి నగదు రహిత వైద్య సేవలు అందించాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటిని చెల్లించి 317 జీవో బాధితులు అందరికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన బాధ్యతలను ఉపాధ్యాయుల నుండి తప్పించాలని కోరారు. ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్టీయు నాయకులు బంధం వెంకటేశ్వర్లు, బొలిశెట్టి వెంకటేశ్వర్లు, రూప్లా నాయక్, బూర వెంకటేశ్వర్లు, గురువారెడ్డి, చేపూరి నర్సింహరావు, గుండు ఆదినారాయణ, బెజవాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్వీపర్ల సమస్యలను పరిష్కరించండి

సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి




**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమ్యలను పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు, స్కావెంజర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు సిహెచ్ సీతామహాలక్ష్మి డిమాండ్ చేశారు. స్వీపర్లు, స్కావెంజర్ల సమావేశం ఆదివారం మీరాబీ అధ్యక్షతన స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ వేతనాలు సరిగ్గా రావడం లేదని, కొన్ని పాఠశాలల్లో సగం వేతనం ఫినాయిల్, ఇతర మెటీరియల్ కొనుగోలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు మినహాయించుకుంటున్నారని ఆరోపించారు. పిల్లల సంఖ్యకు సరిపడ వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రామ పంచాయతీ స్వీపర్లకు ఏడాది కాలంగా వేతనాలు చెల్లించడం లేదని బాకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీతామహాలక్ష్మి డిమాండ్ చేశారు. 30 మంది విద్యార్థులు ఉంటే మూడు వేలు, 30 నుంచి 100 మంది ఉంటే ఆరువేలు, 100 నుంచి 250 ఉంటే ఎనిమిది వేలు, 500 మంది ఉంటే 12వేలు, ఆపై ఉంటే 15వేలు, 20వేలు ఇవ్వాలని నిబంధనలో ఉన్న ప్రధానోపాధ్యాయులు అమలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో ఛైర్మన్లను ఏర్పాటు చేశారని రాజకీయాలు అడ్డుపెట్టుకుని కొంత మంది స్వీపర్లను తొలగించాలని చూస్తున్నారని ఆమె తెలిపారు. స్వీపర్ల వేతనాలు బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని లేని పక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఆదిలక్ష్మి, దేవా, గౌస్, పుల్లారావు, సుజాత, రామస్వామి, ముంతాజ్, అన్నపూర్ణ, రాణి పాల్గొన్నారు.

## బిటిపిఎస్ నిర్మాణానికి సిపిఐ కృషి

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు :** భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం సిపిఐ ఎనలేని కృషి చేసిందని, దీనిని ఎప్పుడు ఈ ప్రాంత ప్రజలు మరచిపోకూడదు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య అన్నారు. ఆదివారం దయం భీమరాజు కృష్ణ అధ్యక్షత జరిగిన పార్టీ సమావేశానికి ముఖ్య అతిథి గా బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం రెండు పంటలు పండే పంటలని ఈ ప్రాంత రైతులు ఇవ్వనని ఆందోళన వ్యక్తం చేయగా, సిపిఐ పార్టీ రైతులను నచ్చచెప్పి వారిని ఒప్పించి ముఖ్యమంత్రి దగ్గరికి తీసుకెళ్లి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఒప్పించిందన్నారు. నేడు బిటీపీఎస్ నిర్మాణం జరిగి కరెంటు ఉత్పత్తి అవుతుందంటే అది సిపిఐ పుణ్యమేనని దీనిని ఈ ప్రాంత ప్రజలు, రైతులు మరచిపోకూడదని వారు గుర్తు చేశారు. అనేక మంది నాయకులు మేమే తీసుకొచ్చాం.. మేమే అన్ని ఇప్పించామని మాయ మాటలు చెబుతున్నారని వారి మాటలు నమ్మవద్దని, అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల పక్షాన, రైతుల పక్షాన, కార్మిక ,కర్షక వర్గాలకు అండగా నిలిచేది సిపిఐ పార్టీని దీనిని విస్మరించరాదన్నారు. పార్టీ పుట్టి వంద సంవత్సరాల అయిన సందర్భంగా డిసెంబర్ 26 నుండి పార్టీ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మాతృ సంస్థలో పులిగిల్లి రమేష్, గ్రామ పంచాయతీ మాజీ సిపిఎం వార్డు మెంబర్ చీడం బాబురావు సిపిఐలో చేరారు. సిపిఐలో గతంలో పనిచేసి బయటకు వెళ్లిపోయిన పులిగల రమేష్ శాఖా సమావేశంలో మాతృ సంస్థ అయిన సిపిఐలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య సమక్షంలో పార్టీలో చేరారు. వీరితోపాటు గ్రామ ప్రజలు 20 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డిపుల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి కామిశెట్టి రామారావు, ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్ మాట్లాడారు. అనంతరం 11 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి : రాములు

**ప్రజాపక్షం/వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ సుతారి, భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘము జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ థంబ్ సిస్టం రద్దు చేయాలన్నారు. మెడికల్ టెస్టుల పేరుతో కార్మిక సంక్షేమ నిధి వృథాచేస్తున్నారని, సంక్షేమ నిధిలో ఉన్న డబ్బులను కార్మికులకు బెనిఫిట్స్ కింద అందేలా చూడాలన్నారు. 55 ఏండ్లు నిండిన కార్మికులకు 5వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, సహజమరణానికి 5 లక్షలు, ఆక్సిడెంట్ డెత్ కు 10 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తోట వెంకటేశం, రామతీర్థపు రవి, ముఖ్య రమేష్, బండారు దేవయ్య, సంకు దేవా, పోశెట్టి, రాజన్న దేవరాజ్, తదితర కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



## హక్కుల రక్షణకు పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య

**ప్రజాపక్షం/తుర్కయాంజల్ :** కార్మిక హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తుర్కయంజాల్ కూడలిలో ఎఐటియుసిఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఓరుగంటి యాదయ్య హాజరూ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడటానికి, కార్మికుల జీవితాల్లో వెలుగు నింపటానికి 1920 అక్టోబర్ 31 ఎఐటియుసి ఆవిర్భవించిందన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో నలిగిపోతున్న కార్మికులకు ఎఐటియుసి ఒక దిక్సూచి లాగా పార్టీలకు అతీతంగా ఏర్పడ్డదన్నారు. స్వతంత్రం రాకముందే అనేక కార్మిక చట్టాలను సాధించుకోవడంతోపాటు, స్వతంత్ర పోరాటంలో కార్మిక వర్గాన్ని చైతన్యపరచి తెల్ల దొరలకు వ్యతిరేకంగా చేసిన పోరాటం, త్యాగాలు మరువలేని తెలిపారు. స్వతంత్ర అనంతరం కార్మిక చట్టాలను రూపొందించడంలో, పోరాటాలు చేయడంలో కీలక భూమిక పోషించిందన్నారు, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను నేరుగా ర్చడమే కాకుండా, కార్మికులకు హక్కులకు లేకుండా చేయడం కోసం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలను మరింత దుర్భరం చేశారన్నారు. అనేక రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను, కనీస సౌకర్యాలను అమలు పరచకుండా కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరుస్తున్నారన్నారు. కార్మిక దోపిడికి వ్యతిరేకంగా కార్మిక వర్గమంతా కలిసి ఐక్య పోరాటాలు చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శివకుమార్, సుందరమ్మ, కృష్ణయ్య, గురువయ్య, కొండల్, నీలా, కొట్యా నాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు




## అర్థరహిత విమర్శలు మానుకోవాలి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** స్ట్రక్చర్ సమావేశంలో చర్చించిన అంశాలపై కొంత మంది యూనియన్ నాయకులు అవగాహన లేకుండా ఎఐటియుసి యూనియన్‌పై అర్థరహితమైన విమర్శలను చేయడం సరికాదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం స్ట్రక్చర్ సమావేశంలో చర్చించిన అంశాలపై కొంతమంది నాయకులు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో అసలు స్ట్రక్చర్ సమావేశాలే జరగలేదని, అప్పుడు ఈ నాయకులు ఎక్కడ ఉన్నారని, ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటిని పరిష్కరించే విధంగా ఎఐటియుసి ప్రయత్నం చేస్తుందని స్పష్టం చేశారు. స్ట్రక్చర్ సమావేశంలో యాజమాన్యం అంగీకరించిన పలు అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, శ్రీనివాస్, రాంచందర్, మురళీచౌదరి, నవీన్ రెడ్డి, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.




## అర్హులైన కార్మికులకు సంక్షేమ పథకాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం/తిర్యాణి :** అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని, వారు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం మండల కేంద్రంలోని కుమురం భీం కమ్యూనిటీ హాల్‌లో మండల అధ్యక్షుడు కిన్నక జంగు పటేల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, సంక్షేమ, సలహా బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం భవన నిర్మాణంలో ప్రభుత్వం కడుతున్న ఒక శాతం సెస్సును 2 శాతంకు పెంచాలన్నారు. 60 ఏళ్ళు వయస్సు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులకు రాష్ట్రస్థాయి సలహా బోర్డులో సభ్యులుగా నియమించాలని, గతంలో పెండింగ్ లో ఉన్న పెన్షన్, ఇతర బెనిఫిట్ బకాయిలను వెంటనే ఇవ్వాలని, పాండిచ్చేరి ప్రభుత్వం ఇస్తున్న తరహాలో దసరా కానుకగా రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల అడ్డాల వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ప్రమాదంలో మరణించిన భవన నిర్మాణ కార్మిక కుటుంబానికి రూ. 10 లక్షలు, సహజ మరణం పొందితే రూ.5 లక్షలు, పెండ్లి కానుక ఒక లక్షకు పెంచాలని, పిల్లల చదువుకు స్కాలర్షిప్ ఇవ్వాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో నిర్మాణ కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగం మొగిలి, మండలం కార్యదర్శి దేవేందర్, నాయకులు వేంకటేశం చారి, సత్తయ్య, కార్మికులు హరీష్, శంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# మరోసారి.. రైతుల ‘ఢిల్లీ చలో’ కవాతు

**ఫిబ్రవరి 13న నిలిచిన ర్యాలీ..**

**డిసెంబరు 6న పున: ప్రారంభిస్తున్న రైతునేతలు**



**చండీగఢ్ :** సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కనీస మద్దతు ధర సహా తమ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వంపై రైతుల సంఘటిత శక్తి సమరశంఖం పూరించింది.నిరసనకారుల మొదటి సమూహానికి నేతృత్వం వహించనున్నరైతు నాయకులు డిసెంబరు 6న దేశరాజధాని ఢిల్లీకి కాలినడకన ర్యాలీ కవాతును ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని పంజాబ్ రైతుల నాయకుడు శర్వణ్‌సింగ్ పాంథర్ ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. 293 రోజులుగా శంభుఖన్నూరి వద్ద రైతుల నిరసన సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరపకపోవడంపై పాంథర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీకి రైతుల మార్చ్‌ను భద్రతా దళాలు నిలిపివేసిన తర్వాత పంజాబ్, హర్యానా రాష్ట్రాల మధ్య శంభుఖన్నూరి సరిహద్దు పాయింట్ల వద్ద సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎంనాన్ పొలిటికల్ రైతు సంఘం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) బ్యానర్ల కింద రైతులంతా శిబిరాలను ఏర్పాటుచేసుకుని నిరసన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. రైతుల కాలినడక ప్రదర్శన కవాతు శంభు నుంచి దేశ రాజధాని ఢిల్లీవైపు నిర్వహించనున్న రైతుల మొట్టమొదటి ప్రదర్శన కవాతు సమూహాని(జాతా)కి సత్నామ్ సింగ్ పన్నూ, సురిందర్ సింగ్ చౌతాలా, సుర్జీత్ సింగ్ ఫుల్, బల్జీందర్ సింగ్ నాయకత్వం వహిస్తారని శర్వణ్‌సింగ్ పాంథర్ తమ కార్యచరణ ప్రణాళికను వివరించారు. ఆ సమూహం ప్రశాంత ధోరణిలో ఢిల్లీకి నిత్యావసర సరుకులను తీసుకెళుతోందని తెలిపారు. ఈ తొలిగ్రూప్ రైతులు ఢిల్లీ కి వారి మార్చ్‌ను మోహ్రా గ్రెయిన్ మార్కెట్, ఖాన్పూర్ జట్టన్, హర్యానాలోని పిప్లి మీదుగా సాగించి అంబాల సిటీ సెంటర్‌లోని జగ్గీ వద్ద ముగిస్తారని చెప్పారు. ప్రతీరోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రైతులు కాలినడక కవాతు ర్యాలీ నిర్వహించి రాత్రి వేళ రోడ్లపైనే గడుపుతారని తెలియజేశారు. మొదటి గ్రూప్‌లోని రైతుల సంఖ్యను తర్వాత పంచుకుంటారని చెప్పారు.ఫిబ్రవరి18నుంచిరైతులు తమ నిరసనను ప్రదర్శిస్తున్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమ ప్రతినిధులతో ఎలాంటి చర్చలు జరపకపోవడంశోచనీయమని పాంథర్ మండిపడ్డారు. తమతో చర్చలు జరుపకుండా కేంద్ర ప్రభుత్వం తప్పించుకు తిరుగుతోందని ఆయన ధ్వజమెత్తారు. కాంట్రాక్ట్ వ్యవసాయం తమకు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదనేది తమ డిమాండ్ అని ఆయన తెలియజేశారు. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి కేంద్ర మంత్రులు ముగ్గురు అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద్ రాయ్‌తో నియమించిన కమిటీ రైతుల ప్రతినిధి బృందంతో ఫిబ్రవరి 18న చర్చలు జరిపారని, మొక్కజొన్న, పప్పులు, పత్తిని 5సంవత్సరాల పాటు కనీస మద్దతు ధర ప్రాతిపదికన ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేస్తాయన్న కేంద్రం ప్రతిపాదనను తిరస్కరించినట్లు చెప్పారు. రైతుల నాయకుడు గుర్మనీత్ సింగ్ మంగత్ విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 6న రైతుల ప్రదర్శన కవాతు ప్రారంభం కాగానే, కేరళ, ఉత్తరాఖండ్, తమిళనాడు రైతుల కమిటీలు వారి వారి రాష్ట్ర అసెంబ్లీల వైపునకు ప్రదర్శనలు నిర్వహించనున్నారని చెప్పారు. అదే సమయంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ తన ఆమరణ నిరాహార దీక్షను ఖన్నూరి పాయింట్ వద్ద కొనసాగిస్తాడని తెలియజేశారు. రైతులు కనీస మద్దతు ధర కోరుతూ ఫిబ్రవరి 13నుంచి శంభుఖన్నూరి సరిహద్దు పాయింట్లవద్ద ఏర్పాటుచేసిన శిబిరాలలో నిరసన చేపడుతున్న విషయం తెలిసిందే. దేశ రాజధాని ఢిల్లీవైపు రైతులు ఫిబ్రవరి 13న, ఫిబ్రవరి 21న ర్యాలీని నిర్వహిస్తుండగా దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దులోనే భద్రతా బలగాలు వారిని నిలిపివేయడంతో అక్కడే రైతులు నిరసన ప్రారంభించారు. 293రోజుల పాటు నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# ఒంటరిగానే బరిలోకి...

**ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కీలక ప్రకటన**




**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం తమ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోదని అన్నారు. ఆదివారం మీడియా సమావేశంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. ఢిల్లీలో తాము ఏ పార్టీతో ఎలాంటి పొత్తు పెట్టుకోబోమని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. కాగా, తనపై స్పిరిట్‌తో దాడి చేయడంపై అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. దేశ రాజధానిలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై మండిపడ్డారు. ‘నేను (లా అండ్ ఆర్డర్) సమస్యను లేవనెత్తిన తర్వాత అమిత్ షా ఏదైనా చర్య తీసుకుంటారని ఊహించా. కానీ, దానికి బదులుగా పాదయాత్రలో నాపై దాడి జరిగింది. నాపై లిక్విడ విసిరారు. నాకు హాని జరుగలేదు. అయితే అది హాని కలిగించేదే’ అని అన్నారు. గత 35 రోజుల్లో ఇది నాపై జరిగిన మూడో దాడి అని అన్నారు. మరోవైపు ప్రజా భద్రత, నేర సమస్యలను మాత్రమే తాము లేవనెత్తామని కేజ్రీవాల్ తెలిపారు. ‘మీకు వీలైతే, గ్యాంగ్‌స్టర్‌లను అరెస్టు చేయండి. దానికి బదులుగా మమ్మల్ని ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు?’ అని ప్రశ్నించారు. ఆప్ ఎమ్మెల్యే నరేష్ బల్యాన్‌ను శనివారం అరెస్టు చేశారని, ఆయన చేసిన నేరమల్లా గ్యాంగ్‌స్టర్ల బాధితుడు కావడమేనని కేజ్రీవాల్ చెప్పారు. గ్యాంగ్‌స్టర్ల నంచి డబ్బులు డిమాండ్ చేస్తూ ఆయనకు బెదిరింపులు వచ్చాయని, ఆయన అనేకసార్లు ఫిర్యాదులు కూడా చేశారని తెలిపారు. కాగా, కేజ్రీవాల్ గ్రేటర్ కైలాస్ ఏరియాలో పాదయాత్ర చేస్తుండగా ద్రావకంతో దాడి జరిగన విషయాన్ని ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న సౌరభ్ భరద్వాజ్ ధ్రువీకరించారు. ఆ ద్రావకం స్పిరిట్ అని చెప్పారు. కేజ్రీవాల్‌కు హాని చేసే ఉద్దేశంతోనే ఈదాడి జరిగిందన్నారు. దాడికి యత్నించిన వ్యక్తి చేతిలోని ద్రావకం స్పిరిట్ వాసన వచ్చిందని, అతని మరో చేతిలో అగ్గిపెట్టె ఉందని వివరించారు.

# రైతుల మీద నిజమైన ప్రేమ ఉంటే సంపూర్ణ రుణమాఫీ చేయాలి

**మాజీమంత్రి టి.హరీశ్ రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిఎం రేవంత్ రెడ్డికి రైతుల మీద నిజమైన ప్రేమ ఉంటే, నిజమైన ప్రజాపాలనే అయితే సంపూర్ణ రుణమాఫీతో పాటు, వరంగల్ డిక్లరేషన్ తూచా తప్పకుండా అమలు చేయాలని మాజీమంత్రి టి.హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన అన్నిరంగాల్లో విఫలమైందని హరీశ్ రావు ట్వీట్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు, అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. తాము మంచి ఆర్థిక వృద్ధితో రాష్ట్రాన్ని అప్పగిస్తే, నీ రాక తర్వాత ఆశించిన మేరకు ఆర్థిక వృద్ధి రేటు పెరగలేదన్నారు. వృద్ధిరేటు పెంచే సత్తా లేదు, సంపద పెంచలేక, ప్రజలకు పంచలేక నోటికి వచ్చినట్లు విమర్శిస్తున్నాడ న్నారు. రూ.7లక్షలకోట్ల అప్పు అని ఏడాది కాలం నుంచి చెప్పిన అబద్ధం మళ్లీ మళ్లీ చెబుతు న్నారని విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేస్తే గోబెల్స్ ప్రచారం అంటారని, గోబెల్స్‌ను మించిన రేబెల్స్ ప్రచారం నీది అంటూ ఎద్దేవా చేశారు. అప్పులు బహిరంగ రహస్యమేనని, గణాంకాలన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉంటాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న మొత్తం అప్పు రూ.4,26,499 కోట్లు అని అసెంబ్లీ వేదికగా లెక్కలతో సహ

# ఆస్తుల వివరాలు అందజేయండి

**రాష్ట్ర ప్రభుత్వాలకు వక్ఫ్ (సవరణ) బిల్లును పరిశీలించిన పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి**



**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) బిల్లును పరిశీలించిన పార్లమెంటరీ కమిటీ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలను సచార్ కమిటీ ప్రకారం వారు అనధికారిక పద్ధతిలో ఆక్రమించిన ఆస్తుల వాస్తవికత, నవీకరించబడిన వివరాలను (అప్‌డేట్స్) అందజేయాలని కోరింది. ఈ విషయాన్ని ఇక్కడ అధికారవర్గాలు తెలియజేశాయి. తదుపరి బడ్జెట్ సమావేశాల చివరి రోజువరకూ పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని లోక్‌సభ పొడిగించింది. ఈ నేపథ్యంలో వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం వక్ఫ్ బోర్డులు కోరిన ఆస్తుల వివరాలను కూడా రాష్ట్రాల నుండి సేకరించింది. 2013సంవత్సరంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వ హయాంలోఅమలులోకి వచ్చిన సవరణ సెక్షన్ 40 ప్రస్తుత చట్టంలో పొందుపరిచబడిన అత్యంత తీవ్రమైన వివాదాస్పద లక్షణాలలో ఒకటి. ఎందుకంటే ఈ సవరణ వక్ఫ్‌బోర్డులకు ఏదైనా ఆస్తి వక్ఫ్‌కు సంబంధించినదా? కాదా? అనే అధికారాన్ని ఇచ్చింది. ప్రతిపాదిత చట్టం మతపరమైన విషయాలలో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించినందున వ్యతిరే క పార్టీలు, వివిధ ముస్లిం సమూహాల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రస్తుత చట్టంలో ఇతర మార్పులు చేస్తూనే ఈ అధికారాన్ని అరికట్టడానికి ప్రయత్నించింది.రాష్ట్ర ప్రభుత్వ అధికారిక సంస్థలలో అనధికారిక ఆక్రమణలో ఉన్నారని ఆరోపించిన వక్ఫ్ పిఆర్‌పై సచార్ కమిటీ చేసిన అంశాలపై పార్లమెంటరీ ప్యానెల్ తాజా నిర్ణయం తీసుకుందని ఆ వర్గాలు వెల్లడించాయి. 2005 2006 సంవత్సరంలో వివిధ రాష్ట్ర బోర్డులు అనధికార ఆక్రమణపై సచార్‌కమిటీకి సమాచారం అందించాయి. పార్లమెంటరీ ప్యానెల్ కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రాల సమాచారాన్ని సేకరిస్తోంది. ఢిల్లీలో 316 ఆస్తులు, రాజస్థాన్‌లో 60 ఆస్తులు, కర్నాటకలో 42 ఆస్తులు ఆతరహావి ఉన్నాయని 2005 2006 లో బిజెపి ఎంపి నేతృత్వంలోని జగదాంబికా పాల్‌కు సచార్ కమిటీ నివేదించిందని ఆ అధికార వర్గాలు తెలిపాయి. వారిలో 53మంది మధ్యప్రదేశ్‌లో ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో 60మంది,53మంది ఒడిశాలో ఉన్నారు. అయితే కమిటీ ఈ అన్ని 6 రాష్ట్రాల నుంచి నవీకరణలను (అప్‌డేట్స్) కోరింది. పార్లమెంటరీ ప్యానెల్ అనేక ఇతర రాష్ట్రాల సంబంధిత సమాచారం సైతం సమాచారిన్ని పొందిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ‘పై రాష్ట్రాల ముఖ్యమంత్రులు దయతో సచార్ కమిటీ నివేదికలోని ఈ సమాచారానికి సంబంధించిన వాస్తవికతపై వివరంగా దర్యాప్తు చేయవచ్చు. అంతేకాకుండా ఈ కమిటీని వివరంగా నవీకరించవచ్చు’ అని కమ్యూనికేషన్‌ను ఉటంకిస్తూ ఒక సమాచారం తెలియజేసింది. సచార్ కమిటీ తన జాబితా సమగ్రంగా లేదని పేర్కొన్నందున, ప్రభుత్వ సంస్థలు ఏదైనా ఆస్తి వివాదాలలో చిక్కుకున్నవాటికి సంబంధించి, యాజమాన్యానికి సంబంధిత కేసులు లేదా స్వాధీనానికి సంబంధించిన కేసులలో వివరాలు ఏవీ ఉన్నా పంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కమిటీ అభ్యర్థించింది. భారతదేశంలోని ముస్లిం సమాజం సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులను అధ్యయనం చేయడానికి యుపిఏ2 ప్రభుత్వం హయాంలో సచార్ కమిటీ నియమించబడింది. ఈ కమిటీ 2006లో తన నివేదికను సమర్పించింది. ఈ సూచికలన్నింటిపై ముస్లిం పేద స్థితిని ఎత్తిచూపుతూ అనేక చర్యలను సచార్ కమిటీ సిఫారసుచేసింది. ఇదిలా ఉంటే వక్ఫ్ (సవరణ) బిల్లుపై జాయింట్ కమిటీ పదవీకాలాన్ని వచ్చే ఏడాది పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల చివరి రోజు వరకూ పొడిగిస్తూ లోక్‌సభ నవంబరు 28న తీర్మానాన్ని ఆమోదించింది. నవంబరు 29న ముగియనున్న దాని పదవీకాలాన్ని పొడిగించాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ముసాయిదా నివేదికతో తాను సిద్ధంగా ఉన్నానని, వక్ఫ్ (సవరణ) బిల్లు పార్లమెంటరీ కమిటీ చైర్మన్ జగదాంబికాపాల్ గతంలో పేర్కొన్నప్పటికీ, మరింత సమయం కావాలని కమిటీ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది.

# వినియోగదారులకు షాక్

**వరుసగా ఐదోసారి సిలిండర్ ధర పెంపు..**




**న్యూఢిల్లీ :** చమురు కంపెనీలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. వాణిజ్య సిలిండర్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధర రూ.16.50 పెరిగింది. పెరిగిన ధరలు ఆదివారం నుంచి అమలులోకి వచ్చాయి. పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1818.50కి పెరిగింది. ధరలు పెరుగడం వరు సగా ఇది ఐదోసారి. అలాగే, ఐదు కిలోల ఎఫ్‌టిఎల్ సిలిండర్ ధరపై రూ.4 వరకు పెంచింది. ఇక గృహ వినియోగ 14.2 కిలోల సిలిండర్ ధరలను మాత్రం పెంచలేదు. గత నెలల ప్రారంభంలో కమర్షియల్ ఎల్‌పిజి గ్యాస్ లిండర్ ధరను రూ.62 పెంచగా.. అక్టోబర్ 1న రూ.48.5 పెరిగి రూ.1,74 0కి చేరింది. ఆగస్టు 1న సిలిండర్‌పై రూ.6.5 పెరిగింది. సెప్టెంబర్ 1న రూ.39 పెరిగింది. ఇప్పటికే పెరిగిన ధరలతో అందరూ ఇబ్బందులకు గుర వుతున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో సిలిండర్ల ధరల పెంపుదలతో ఎల్‌పిజిపై ఆ ధారపడే వాణిజ్య సంస్థలు, చిరువ్యాపారులపై భారీగా ప్రభావం పడే అవ కా శం ఉన్నది. కమర్షియల్ ఎల్‌పిజి ధరలు పెరిగినప్పటికీ డొమెస్టిక్ ఎల్‌పిజి సి లిండర్ ధరలో మార్పులు చేయకపోవడం స్వల్పంగా ఊరటనిచ్చినట్ల య్యిం ది. అంతర్జాతీయ చమురు ధరల ట్రెండ్‌కు అనుగుణంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్) ధరను ఆదివారం 1.45 శాతం పెంచారు. దేశ రాజ ధానిలో ఏవియేషన్ టర్బైన్ ఇంధనం ధర కిలోలీటర్‌కు రూ.1,318.12 పెరిగి రూ.91,856.84కి చేరింది. తాజాగా పెరిగిన ధరలతో కోల్‌కతాలో రూ.192 7, ముంబయిలో రూ.1771, చెన్నైలో రూ.1980, హైదరాబాద్‌లో రూ.206 6 పలుకుతున్నది. ఇక డొమెస్టిక్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.803 ఉం దగా.. ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.603కే అందుబాటులో ఉంది. ముంబయి లో రూ.802.50, చెన్నైలో రూ.818.50, హైదరాబాద్‌లో రూ.855 వద్ద కొనసాగుతున్నది.

# పురంధరేశ్వరి బిజెపిలో చేరకముందే...

# అదానీ, మోడీలకు సంబంధాలు

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ**



**అమరావతి:** అదానీకి, బిజెపికి సంబంధం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఎద్దేవా చేశారు. ఈ మేరకు కె.రామకృష్ణ నేడొక ప్రకటన విడుదల చేశారు. అదానీకి, బిజెపికి సంబంధం లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ఎవరి చెవుల్లోనో పువ్వులు పెట్టేందుకు చేస్తున్న వ్యాఖ్యలులా ఉన్నాయి. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నాటి నుండి అదానీ, మోడీల మధ్య సంబంధ బాంధవ్యాలున్నాయి. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో అదానీ విమానంలో నరేంద్రమోడీ దేశమంతా ప్రచార కార్యక్రమం నిర్వహించారన్నారు. మోడీ ప్రధాని అయిన తరువాత మోడీ విమానంలో అదానీ వెనక కూర్చుని దేశ దేశాలు తిరిగి పలు అగ్రిమెంట్లు చేయించుకున్నారు. ఆస్ట్రేలియా, శ్రీలంకవంటి పలు దేశాల్లో అదానీకి ఒప్పందాలన్నీ మోడీ చేయిస్తున్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక సందర్భంలో కూడా మోడీ, అమిత్‌షాలు అదానీని కాపాడి, ఆయనకు వత్తాసుగా ఉన్నారు. అమెరికా న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టులో అదానీపై కేసు నమోదయింది. సెకి ద్వారా సోలార్ విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నారనీ 4 రాష్ట్రాల్లో అదానీ రూ.2100 కోట్లు లంచాలుగా ముట్టజెప్పినట్లు ఆరోపణలున్నప్పటికీ అదానీపై చర్య తీసుకోలేకపోతున్నారు. పార్లమెంటులో అదానీ అవినీతిపై చర్చ జరపాలని ప్రతిపక్షాలన్నీ పట్టుబడితే, పార్లమెంటును వాయిదా వేస్తున్నారేగాని చర్చకు ముందుకు రావడం లేదు. ఇంత స్పష్టంగా అదానీని మోడీ, బిజెపి కాపాడుతుంటే పురంధరేశ్వరి గారు జగన్ తప్పుచేశాడని చెబుతున్నారు. పురంధరేశ్వరి గారు బిజెపిలో చేరక ముందునుండీ మోడీ, అదానీలకు సంబంధం ఉందనేది సుస్పష్టం. లక్షల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడడానికి అదానీ కారకుడు. అదానీతో చేసుకున్న అక్రమ ఒప్పందాలే అందుకు కారణం. దేశంలోని విమానాశ్రయాలు, పోర్టు లు, లక్షల ఎకరాల భూములు, విద్యుత్ ఒప్పందాల అదానీ కట్టబెట్టేందుకు మోడీ పాత్ర ఉంది. రాష్ట్రాన్ని అదానీకి జగన్మోహన్‌రెడ్డి దోచిపెట్టడం లో మోడీ పాత్ర ఉందనేది బహిరంగ రహస్యం. ప్రపంచమంతా కోడై కూస్తున్నప్పటికీ అదానీకి, బిజెపికి సంబంధం లేదనడం హాస్యాస్పదం. కేం ద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే అదానీని అరెస్టు చేయాలి. అదానీ అవినీతి, అక్రమ ఒప్పందాలను రద్దు చేయాలని, వీటన్నింటిపై సమగ్ర విచారణ జరపాలి అని డిమాండ్ చేశారు.

# సిఎం అభ్యర్థిపై బిజెపిదే నిర్ణయం

**ఎవరైనా బేషరతుగా మద్దతిస్తా : ఏక్‌నాథ్ షిండే**



**ముంబయి :** మహాయుతి ప్రభుత్వంలో శాఖల కేటాయింపుపై తాను మనస్తాపం చెందినట్టు వస్తున్న వార్తలపై ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే పెదవి విప్పారు. బిజెపికి బేషరతుగా తన మద్దతు ఉంటుందని, తాను ఎలాంటి మనస్తాపానికి గురికాలేదని తెలిపారు. ముఖ్యమంత్రి పేరును బిజెపి సోమవారంనాడు నిర్ణయిస్తుందని చెప్పారు. తీవ్ర జ్వరంతో సతారా జిల్లాలోని తన స్వగ్రామంలో ఉన్న షిండే మీడియాతో మాట్లాడుతూ, తన ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉందని, క్రమంగా మెరుగుపడుతోందని చెప్పారు. తీరికలేని ఎన్నికల ప్రచారం కారణంగా కొద్దిపాటి విశ్రాంతికోసం ఇక్కడకు వచ్చానని అన్నారు. 2.5 ఏళ్లుగా సిఎంగా తాను ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని చెప్పారు. తనను కలుసుకునేందుకు ఇక్కడకు కూడా జనం వస్తున్నారని, దీంతో కొంత అస్వస్థతకు గురయ్యానని తెలిపారు. మహాయుతి కూటమిలోని మూడు పార్టీల మధ్య మధ్య అవగాహన ఉందని, ముఖ్యమంత్రి ఎవరనే దానిపై సోమవారంనాడు నిర్ణయం తీసుకుంటారని షిండే చెప్పారు. పార్టీ అధినాయకత్వానికి ఇప్పటికే తాను బేషరతుగా మద్దతు ప్రకటించారని, వారి నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. గత 2.5 సంవత్సరాల్లో తమ ప్రభుత్వం పనితీరు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ వచ్చన్నారు. ఆ కారణంగానే ప్రజలు చారిత్రక తీర్పునిచ్చారని చెప్పారు. షిండే కుమారుడు, లోక్‌సభ సభ్యుడు శ్రీకాంత్ షిండే సిఎం కావచ్చంటూ వస్తున్న ఊహాగానాలపై అడిగినప్పుడు, చర్చలు జరుగుతున్నాయని ఆయన సమాధానమిచ్చారు. గత వారం ఢిల్లీలో అమిత్ షాతో ఒక సమావేశం జరిగిందని, ఇప్పుడు కూటమి భాగస్వాములు కలిసి ప్రభుత్వం ఏర్పాటుపై చర్చలు జరుపుతారని అన్నారు. బిజెపి ఇంత వరకూ లెజిస్లేచర్ పార్టీ నేతను ప్రకటించ లేదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తామంతా పని చేస్తామని, ఎవరి మధ్యా విభేదాలు లేవని చెప్పారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు ఉంటాయన, పదేపదే తన వైఖరిని స్పష్టం చేయాల్సిన పనిలేదని వివరణ ఇచ్చారు.

**సిఎం అభ్యర్థిపై కొనసాగుతున్న ఉత్కంఠ**

మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి పది రోజులు అయినా సిఎం ఎవరు అనేదిపై ఉత్కంఠ కొనసాగూతూనే ఉంది. అయితే డిసెంబరు 5వ తేదీన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేస్తారని మహాయుతి కూటమిలో భాగస్వామ్యపక్షంగా ఉన్న బిజెపి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 5వ తేదీన జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సిఎం, డిప్యూటీ సిఎంలు ప్రమాణం చేయాలా లేదా వీరితో పాటు మంత్రులు కూడా ప్రమాణం చేయాలనే అనే విషయమై కూటమి నేతలు కలిసి కూర్చొని నిర్ణయం తీసుకుంటారని కూటమికి చెందిన ఓ సీనియర్ నాయకుడు చెప్పారు. గతం రెండుసార్లు సిఎంగా పనిచేసిన దేవేంద్ర ఫడ్నవీస్‌కే మరోసారి సిఎం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని బిజెపి వర్గాలు పేర్కొన్నాయి. మహాయుతి కూటమిలో ఉన్న శివసేన, ఎన్‌సిపిలు ఇప్పటికే తమ శాసనసభాపక్ష నేతలుగా ఏక్‌నాథ్‌షిండే, అజిత్‌పవార్‌ను ప్రకటించాయి. కాగా, బిజెపి శాసనసభాపక్ష నేతను ప్రకటించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ఎన్‌సిపి చీఫ్ అజిత్ పవార్ శనివారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిజెపి నేత ఉంటారని చెప్పారు. కూటమిలోని మిగతా రెండు పార్టీల నుంచి డిప్యూటీ సిఎంలు ఉంటారన్నారు. మహారాష్ట్ర ఎన్‌సిపి చీఫ్ సునీల్ టట్కారే పిటిఐతో మాట్లాడుతూ 5వ తేదీన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రకటించారని, కానీ ఇంకా బిజెపి శాసనసభాపక్ష నేతను ఎన్నుకోలేదన్నారు. 2వ తేదీన మధ్యాహ్నం తమ పార్టీ శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటామని బిజెపి సీనియర్ నేత తెలిపారు. అయితే సమావేశం 3 లేదా 4వ తేదీకి వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు.



# జనాభా తగ్గితే సమాజం నశించిపోతుంది

**మోహన్ భగవత్**

**నాగ్‌పూర్:** జనాభా తగ్గుదల ఆందోళనకర అంశమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. జనాభా క్షీణిస్తే సమాజం దానంతట అదే నశించిపోతుందన్నారు. నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన కుటుంబ ప్రాధాన్యత గురించి చెప్పారు. కుటుంబాలు సమాజంలో భాగమన్నారు. ‘‘జనాభా శాస్త్రం ప్రకారం జనాభా పెరుగుదల రేటు 2.1 కన్నా దిగువకు వెళ్తే సమాజం నశిస్తుందన్నారు. దానిని ప్రత్యేకంగా ఎవరూ అంతం చేయాల్సిన అవసరం ఉండదన్నారు. భారత జనాభా విధానం కూడా జననాల రేటు 2.1 కన్నా తక్కువ ఉండకూదని చెబుతుందన్నారు. పైగా మన దేశానికి సంబంధించినంత వరకు ఈ రేటు 3 ఉండాలన్నారు. మ న సమాజం మనుగడకు ఇది అవసరమన్నారు. ప్రతి మహిళ 2.1 రేటులో పిల్లలని కంటేనే జనాభా భర్తీ జరుగుతుందన్నారు. 2.1కి దరిదాపు రేటులో ఉన్న దేశాల్లో భారత్, అర్జెంటీనా, ట్యునీసియా ఉన్నాయన్నారు. దానికన్నా తక్కువ రేటు కలిగిన దేశాల్లో అమెరికా, బ్రెజిల్, మెక్సికో, చైనా, జపాన్, దక్షిణ కొరియా ఉన్నాయన్నారు.

# సంభాల్‌లోని షాహీ జమా మసీదును సందర్శించిన జ్యుడీషియల్ కమిషన్





**సంభాల్ (యుపి) :**కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆదివారం జ్యుడీషియల్ కమిషన్ సభ్యులు ఇక్కడి షాహీ జమా మసీదును, మొఘల్ కాలంనాటి మసీదులో కోర్టు ఆదేశాల మేరకు సర్వేనిర్వహిస్తున్న సమయంలో హింసచెలరేగిన ప్రాంతాలను సందర్శించారు. నవంబరు 24వ తేదీన హింసాకాండ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ముగ్గురు సభ్యులతో కూడిన జ్యుడీషియల్ కమిషన్‌లో ప్యానెల్ హెడ్ రిటైర్డ్ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ అరోరా, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి అరవింద్ కుమార్ జైన్ ఇద్దరు సభ్యులుగా ఉన్నారు.ప్యానెల్‌లో ఉన్నటువంటి మూడవ సభ్యుడు మాజీ ఐపిఎస్ అధికారి అమిత్ మోహన్ ప్రసాద్ ఆదివారం నాటి జ్యుడీషియల్ కమిషన్ పర్యటనలో లేరు. అయితే ఆదివారం ఉదయం వేళల్లో పర్యటన సందర్భంగా జ్యుడీషియల్ కమిషన్ సభ్యులు మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించలేదు. వారివెంట మొరాదాబాద్ డివిజనల్ కమిషనర్ ఆంజనేయ కుమార్ సింగ్, డిఐజి మునిరాజ్ జి తోపాటు సంభాల్ జిల్లా మెజిస్ట్రేట్ రాజేంద్ర పెన్సియా, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ క్రిషన్ కుమార్ ఉన్నారు. అనంతరం మొరాదాబాద్ డివిజనల్ కమిషనర్ ఆంజనేయ కుమార్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ ఈరోజు విచారణ కమిషనర్ చైర్పర్సన్‌తో పాటు మరో సభ్యుడు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఆ ప్రదేశాన్ని సందర్శించడమే మా ప్రాథమిక ఉద్దేశం. నిర్మాణప్రాంతం, అక్కడ ఉన్న కొంతమంది వ్యక్తులతో మాట్లాడటం జరిగింది. బృందం మళ్లీ సందర్శిస్తుంది. మరోసారి తిరిగిరావడం ఖాయం’ అని మొరాదాబాద్ డివిజన్ కమిషనర్ మీడియాకు చెప్పారు. ఇక్కడ పరిస్థితి క్రమంగా సాధారణ స్థితికివస్తున్నదని, దానిని నిశితంగా పరిశీలిస్తున్నామని ఆంజనేయ కుమార్ సింగ్ చెప్పారు.ప్రస్తుతానికి జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాలు డిసెంబరు 10వరకూ అమలులో ఉంటాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆ తర్వాత ఎటువంటి ఆంక్షలు ఉండవన్నారు. తాము సాక్ష్యాలను సేకరించే పనిలో ఉన్నామని, హింసాకాండకు కారకులైన 400మందిని ఇప్పటి వరకు గుర్తించామని ఆయన తెలియజేశారు.మసీదు సెక్రటరీ మసూద్ ఫరూఖీ మాట్లాడుతూ జ్యుడీషియల్ కమిషన్ బృందం మమ్ములను ఏమీ అడగలేదని చెప్పారు. జమా మసీదును, సంఘటన జరిగిన స్థలాన్ని చూడటానికి మాత్రమే వచ్చినట్లు వారు చెప్పారని ఫరూఖీ వివరించారు. స్టేట్‌మెంట్లను తర్వాత తీసుకుంటామని వారు చెప్పారని తెలియజేశారు. సంభాల్‌లో కోర్టు ఆర్డర్ మేరకు సర్వే జరుగుతోన్న సమయంలో నవంబరు 24వ తేదీన హింస చెలరేగిన విషయం విదితమే. ఈ హింసాకాండలో నలుగురు మృతిచెందగా, అనేకమంది గాయపడ్డ సంగతి తెలిసిందే.

केनरा बैंक Canara Bank Together We Can

**ఖమ్మం శాఖ**
ఇం.నం. 1-7-70/71, మధు కాంప్లెక్స్, జూబ్లీపుర, గాంధీ చౌక్, ఖమ్మం -507003

**వాహనం వేలం అమ్మకం ప్రకటన**
కెనరా బ్యాంకుచే వేలం వేయబడే దిగువ తెలిపిన వాహనం కొనుగోలు కొరకు ప్రజల నుండి ఆఫర్లు కోరబడుచున్నవి.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తాకట్టుపెట్టిన/ఛార్జ్ చేయబడిన దిగువ తెలిపిన వాహనం పైన తెలిపిన చిరునామా వద్ద **18-12-2024న ఉ. 11.00 గం.ల నుండి మ. 12.00 గం.ల వరకు "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ ఏమి ఉన్నది"** మరియు **"ఏదైతే అది పద్ధతి"** లో బహిరంగ వేలం వేయబడుతుంది అని రుణ గ్రహీత(లు) మరియు గ్యారంటారు(ల)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియచేయబడుచున్నది.

| క్ర. నం. | రుణగ్రహీత పేరు | వాహనం /మోడల్ వివరణ | రిజిస్ట్రేషన్ నం. | రిజర్వు ధర (రూ.లలో) |
|---|---|---|---|---|
| 1 | శ్రీ పి. అశోక్ కుమార్ | TVS KING DS BSIII 08/2014 AUTO RICKSHAW | TS 04 UA 2179 | రూ. 13,000/- |
| 2 | శ్రీ జంగం మోహన్ రావు | TVS KING DS BSIII 07/2014 AUTO RICKSHAW | TS 04 UA 1746 | రూ. 13,000/- |
| 3 | శ్రీ వుండేటి గణేష్ | TVS KING DS BSIII-07/2014 AUTO RICKSHAW | TS 04 UA 1229 | రూ. 13,000/- |
| 4 | శ్రీ గంధం వేణుగోపాల్ | TVS KING DS BSIII 10/2014 AUTO RICKSHAW | TS 04 UA 3545 | రూ. 13,000/- |
| 5 | మెస్సర్స్ అశోక్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ | టాటా ఏస్ పేస్‌లిఫ్ట్ HT BSIC 11/2016 | TS 04 UB 8600 | రూ. 98,000/- |
| 6 | మెస్సర్స్ హేమంత్ ట్రావెల్స్ మామిళ్ళగూడెం శాఖ | టాటా ఇండికా V2 LS BSIII 02/2016 | TS 04 UB 2839 | రూ. 40,000/- |

1) ఆఫర్ లెటర్ మరియు రిజర్వు ధర(కృతార్థులు కాని బిడ్డర్లకు వాపసు చేయబడును) లో 10 % బయానాతో కెనరా బ్యాంకు పేర D. D. రూపంలో సీల్డ్ కొటేషన్‌లు కోరబడుచున్నవి. 2) వేలం తేది & సమయం: శాఖ ఆవరణలో **18-12-2024న ఉ. 11.00 గం.ల నుండి మ. 12.00 గం.ల వరకు. 3)** కొటేషన్ల దాఖలుకు చివరి తేది: **17-12-2024న సా. 5.00 గం.ల వరకు. 4)** కృతార్థుడయిన బిడ్డరు ఆఫర్ మొత్తాన్ని నగదు/D.D. రూపంలో అదే రోజున అనగా **18-12-2024న** చెల్లించవలెను. లేనిచో, బయానా మొత్తం కోల్పోతారు మరియు ఎట్టి పరిస్థితులలో వాపసు చేయబడదు. **5)** సీల్డ్ కొటేషన్‌లు దాఖలు చేసే ముందు వాహనం తనిఖీ చేసి తమంత తాము సంతృప్తిపడేందుకు బిడ్డర్లు బాధ్యత వహించవలసి ఉంటుంది. **6)** కాగోరు బిడ్డర్లు బిడ్డు దరఖాస్తుతో KYC డాక్యుమెంట్లను దాఖలు చేయవలెను. **7)** ఎట్టి కారణం తెలియచేయకుండా వేలం వేయుటకు/రద్దు చేయుటకు లేదా షరతులు మరియు నిబంధనలు మార్చు చేయుటకు అధీకృత అధికారి హక్కు కలిగి ఉన్నారు.
**గమనిక:** ఆసక్తి గల బిడ్డరు వాహనమునకు బకాయి ఉన్న గ్యారేజీ పనులు, మరమ్మతు చార్జీలు మొదలగు వాటిని భరించవలెను. తదుపరి వివరాలకు **చీఫ్ మేనేజర్, 9448117115** పై సంప్రదించగలరు.

**తేది: 27-11-2024**
**ప్రదేశం: హనుమకొండ**
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# సాహితీ విహారి

# అణ్ణా సాఠేది దళితులపక్షం

ప్రముఖ మరాఠీ రచయిత, కవి అసలు పేరు తుకారం భౌరావ్ సాఠే అయినప్పటికీ, అణ్ణా భావు సాఠేగా సుపరిచితుడు. దళితవాదిగా, సంఘసంస్కర్తగా గొప్ప పేరు తెచ్చుకున్నాడు. ఆయన కథల్లో ఆద్యంతం కమ్యూనిస్టు భావనలు, అంబేద్కర్ ఆలోచనా విధానాలు పాఠకులను పలకరిస్తునే ఉంటాయి. జన్మతఃగా దళితుడు కాబట్టి, దళితవాడల కష్టజీవులు పడే వేదన తెలుసు. శ్రమజీవి పడుతున్న కష్టాల విలువ తెలుసు. వారి కన్నీళ్లు చెప్పే ఎన్నో అనుభవాలు సాఠే అర్థం చేసుకున్నంత గొప్పగా మరే రచయితా అర్థం చేసుకోలేడేమో! సాఠే 35 నవలలు, 13 చిన్న కథల సంకలనాలతోపాటు వాస్తవికతకు అద్దం పట్టే కొన్ని నాటకాలు కూడా రాశాడు. వీధి నాటకాలు, ప్రయాణ కథనం, పాటలు, లావణీలు (మరాఠీ జానపద నాటక రంగానికి గణనీయంగా దోహదపడిన నృత్య రూపం) కూడా రాశాడు. ఈ రచనలు మహారాష్ట్రలో తుఫాను సృష్టించాయి. 1950వ దశకం చివరిలో సమైక్య మహారాష్ట్ర కోసం జరిగిన ఉద్యమం కోసం ఎన్నో పాటలు రాశాడు. సంయుక్త మహారాష్ట్రచా చల్వాల్ (సమైక్య మహారాష్ట్ర ఉద్యమం) నడిపాడు. దీనికి మరాఠీ కార్మిక వర్గంతో పాటు కుల, రాజకీయ ప్రముఖులు కూడా సహకారం అందించేలా వారిని ఒప్పించగలిగాడు. 1940, 50 దశకాల్లో, ముంబయిలో ఆయన మిల్లు కార్మికులు, పారిశ్రామిక వర్కర్లతో కలిసి పోరాటాలు చేశాడు. గ్రామీణ మహారాష్ట్రలో విస్తృతంగా పర్యటించాడు. విగా, లాల్ భవతా కళా పథక్ (ఎర్ర జెండా సాంస్కృతిక దళం) కార్యకర్తగా వ్యవసాయ కార్మికులు, రైతుల డిమాండ్లకు మద్దతునిచ్చాడు. సమకాలీన మహారాష్ట్రలో కుల వ్యతిరేక, వర్గ వ్యతిరేక భావజాలం, ఉద్యమాలకు సాఠే మేధోపరమైన కృషి దోహదపడింది. సాహిత్యం కేవలం కొన్ని కులాలు లేదా వర్గాలకు మాత్రమే పరిమితమైన రోజుల్లో దళితుడైన సాఠే ఓ ఉప్పెనలా దూసుకొచ్చాడు. స్ఫూర్తిదాయకమైన తన రచనలతో అవినీతిపై సమర శంఖారావం పూరించాడు. అయితే, ఆయన తన రచనలు ఎప్పుడూ ఒక క్రమపద్ధతిలో ఉంచలేదు. వాటిని దాచే ప్రయత్నం చేయలేదు. ఎక్కువ సమయం సామాజిక సేవలో,రాజకీయ రంగంలో వెచ్చించాల్సి వచ్చేది కాబట్టి సాఠేకు తన ముద్రిత రచనలను భద్రం చేసే అవకాశం కూడా లభించలేదు. అయితే, ప్రజలే ఆ పని చేశారు. అందుకే, అతని సాహిత్యంలో ఎంతోకొంత ఇప్పటికీ మనకు అందుబాటులో ఉంది. దళితుడి బతుకులు దయనీయంగా ఉండవచ్చుగానీ, మనుగడ సంకల్పం మాత్రం అద్భుతమని సాఠే అంటాడు. అద్భుతమైన, వీరోచితమైన దళితుడి జీవితం ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందని ఆయన అనేక సందర్భాల్లో పేర్కొన్నాడు. 'దళితుడు ఎందుకు దయనీయంగా కనిపిస్తున్నాడో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజంలోని ప్రతి అంశం దళితుడితోనే ముడిపడి ఉంటుంది. దళితుడి శక్తితోనే నడుస్తుంది. ఈ భూమి దళితులు, కార్మికుల చేతుల్లో భద్రంగా ఉంది. ఈ దళితుడి జీవితం పర్వత రాతి శిఖరాల నుంచి తాజా వసంతం లాంటిది. దగ్గరగా వెళ్లండి. చూడండి. రాయండి' అంటాడు సాఠే. 'ఈ ప్రపంచం మీ చేతుల్లో ఉంది. ఈ విషయాన్ని వారికి తెలియజేయండి. వారి జీవితాలను మెరుగుపరచడానికి కృషి చేయండి.




**అణ్ణా భావు సాఠే.. దళిత రచయిత. శ్రామిక వర్గాల్లో ఆలోచనాపరుడిగా, మహారాష్ట్ర ప్రముఖ రచయితల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. కులం, వర్గాలను వ్యతిరేకించే ఆలోచనల సహజ కలయికకు అతని రచనలే ఉదాహరణ. 1960 దశకాల్లో అతని రచన దళిత సాచంస్కాతిక, సామాజిక ఉద్యమానికి, ముఖ్యంగా మహారాష్ట్రలో అధునాతన సృజనాత్మకతకు ప్రేరణగా నిలిచింది. అతని రచనలు దళిత ఆత్మగౌరవ ఉద్యమాలకు పునాదులు వేశాయి. మహారాష్ట్ర సమకాలీన దళిత సాహిత్య, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలలో అతని రచనలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. దళితఆత్మగౌరవ పతాక సాఠే. అంటరాని సమాజంలో దైనందిన జీవితాన్ని, అక్కడి స్థితిగతులను అర్థం చేసుకోవడానికి అతని రచనలు ఉపయోగపడతాయి. నిజానికి అవే ప్రత్యేక సాధనాలు కూడా. ఒక్క మాటలో చెప్పాలంటే మహారాష్ట్రలో దళిత సాహిత్యానికి, ఉద్యమాల బాటకు అతనే మార్గదర్శకుడు.**

ఇది చేయాలంటే రచయిత తన ప్రజలతో కలిసి జీవించాలి. ప్రజలతో కలిసి జీవించే కళాకారుడికి ప్రజలు అండ గా నిలుస్తారు. ప్రజలకు వెన్నుపోటు పొడిచిన రచయిత్రి సాహిత్యం తనకు వెన్నుపోటు పొడిచినట్లు తెలుస్తుంది. ప్రతి కళాకారుడికి తెలిసినట్లుగా, కళ అనేది ప్రపంచాన్ని గుచ్చుకునే మరియు అన్ని పురాణాలను కాల్చివేసే మూ డవ కన్ను లాంటిది. ఈ కన్ను ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి, ఎల్లప్పుడూ ప్రజల కోసం చూడాలి' అంటూ దళితులకు హితబోధ కూడా చేశాడు. తన కథల గురించి ఉపోద్ఘాతం రాస్తూ, 'నేను చూసి.. అనుభవించిన జీవితాన్నే రాస్తున్నాను. ఫాంటసీ రెక్కలపై ఎగరడానికి నే ను పక్షిని కాను. నేను కప్పను. నేలకు దగ్గరగా ఉన్నాను. 'బర్బరియా' చెవి కోసినప్పుడు నేను చీకటిలో కూర్చొని చూస్తున్నాను. సుల్తాన్, ఖోమ్కియా, నేను అమరావతి జైలులో ఉన్నాం. అందరం ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాం. హింసను అనుభవించాం. ముకుల్ ములాణీ ఇప్పటికీ నన్ను మామా అని పిలుస్తాడు. కోపంతో గాడిదను తిన్న తుకా ఇంకా బతికే ఉంది. నా పాత్రలన్నీ నిజమైనవి. సజీవమైనవి' అని తేల్చిచెప్పాడు.

## ఆ తొమ్మిది కథలు.. ఆణిముత్యాలు..

మెహక్ హైదరాబాదీ అనువదించిన, అణ్ణా భావూ సాఠే రచించిన కొన్ని కథలను నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఓ సంకలనంగా ప్రచురించింది. అందులో తొమ్మిది కథలు ఉన్నాయి. అన్నీ ఆణిముత్యాలే. 'బర్బాఘా' తాను చేయని తప్పుకు గ్రామ బహిష్కరణకు గురైతే, 'సుల్తాన్' కేవలం భోజనం కోసం పోరాటం చేయాల్సి వస్తుంది. చివరికి జైల్లోనూ అదే పరిస్థితి. బాడీ షేమింగ్ అని ఇప్పుడు చెప్పుకుంటున్న అనాకారితనాన్ని వెక్కించే తత్వం ఎప్పటి నుంచో మన సమాజంలో ఉంది. 'భోమక్యా' ఇదే తరహా అవమానాలు ఎదుర్కొంటాడు. చివరికి జైల్లో కట్టుకోవడానికి దుస్తుల కోసం వేడికోలు... అవి చాలా పొట్టివి కావడంతో నానా ఇబ్బందులు పడడం, చివరికి తోటి ఖైదీలు కొత్త చొట్కా, నిక్కరును కత్తిరించేయడం వంటి ఘటనలతో ఈ కథ సాగిపోతుంది. అనాకారిగా ఉన్నకారణంగానే అతనిపై దొంగతనాన్ని మోపి జైలుకు పంపడం సామమాజిక పరిస్థితులకు అద్దం పడుతుంది. మార్కెట్‌లో మాంసం అమ్ముతూ, ఇద్దరు పిల్లలు మహమ్మద్, అమీర్‌లను పెంచిపెద్ద చచేసిన మకుల్ ములాణీది ఎలాంటి పెద్దగా సమస్యలు లేని కుటుంబమే. కానీ, హఠాత్తుగా ఇద్దరు కొడుకులు ఉద్యోగాలు పోగొట్టుకోవడం, కుటుంబ బాధ్యత మొత్తం మకుల్‌పై పడడంతో పరిస్థితులు తారుమారవతాయి. చివరికి తండ్రినే కొడతాడు అమీర్. కుటుంబంలో ఘర్షణ.. పోలీసులు వచ్చి మొత్తం కుటుంబాన్ని అదుపులోకి తీసుకుంటారు. అప్పటి వరకూ వినోదం చూసిన బస్తీ జనమంతా, మకుల్ మంచివాడని కితాబునిస్తారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. వ్యక్తి స్వార్థం ఏ స్థాయిలో ఉంటుందో వివరించే కథ 'మకుల్ ములాణీ'. మద్యం వ్యాపారుల మాయలోపడి, జీవితాలను నాశనం చేసుకున్న లీల, బలి దంపతులు, వారితోనే ఉండే సుభద్ర, ఉమ దంపతుల కథ ఇది. హాయిగా సాగుతున్న వారి జీవితంలో మద్యం వ్యాపారి ఝింగిర్య రూపంలో ఉపద్రవం ముంచుకొస్తుంది. క్వారీలో పని చేస్తూ, హాయిగా జీవితాన్ని వెళ్లదీస్తున్న ఈ కుటుంబాలను మద్యం ఏ విధంగా ఛిద్రం చేసింది? చివరికి వారి జీవితాలు ఏ విధంగా విషాదాంతమయ్యాయన్నది అద్భుతంగా సాఠే అద్భుతంగా వివరిస్తాడు. 'రెండు (నర) దున్నల ఢీ' కథలో మనుషుల మధ్య ఈర్ష్యాద్వేషాలను కళ్లకు కట్టినట్టు వర్ణించాడు. పశువులు పెంచే మోతబరులు సుకర్ణ, బాబాలాల్ మధ్య నెలకొన్న పోరు చివరికి ఇరువైపులా ఎంత నష్టాన్ని కలిగించింది... ఎంతటి విషాదాన్ని మిగిల్చిందీ ఈ కథలో వివరిస్తాడు. సుకర్ణ, బాబాలాల్ దున్నల భీకరమైన పోరు ఫలితంగా స్థానికులకు ఎంతో ఉపయోగపడే వంతెన కూలిపోతుంది. దున్నలు రెండూ కిందపడి చనిపోతాయి. అప్పటికీ అవి పోరాడుతున్నట్టే కనిపపించడం మానవుల్లోని ఈర్ష్యాద్వేషాలకు ప్రతీకగా నిలుస్తుంది. క్వారీ మూసివేయడంతో ఏ పని చేయాలో తెలియని పరిస్థితుల్లో, శవాల వద్ద బంగారం దొరకడాన్ని గమనించి, అదే వృత్తిగా మార్చేకున్న భీము డి కథ 'శ్మశాన బంగారం'. ఓ శవం నుంచి బంగారం కోసం చేసే ప్రయత్నంలో



వేళ్లు పోగొట్టుకున్న తర్వాత క్వారీని తిరిగి తెరిచినట్టు సమాచారం అందుతుంది. కానీ, ఏం లాభం. భీముడు ఇప్పుడు క్వారీలో పనిచేసే స్థితిలో లేడు. కూతురు లాడీ మీద వల్లమాలిన ప్రేమ కురిపించే సంపత్, తన మొండి వైఖరితో ఇబ్బందుల్లో పడిన వైనాన్ని 'లాడీ' కథలో వివరించాడు సాఠే. భార్య గంగూబాయిని దారుణంగా కొట్టే సంపత్, ఆమె పళ్లు ఊడిపోవనికి కారణమవుతాడు. అల్లుడు పరసా సమతా కూడా అలాంటివాడేనని భయపడతాడు. కానీ, ఒక కథ అనేక మలుపులు తిరిగిన తర్వాత అల్లుడి మం చితనం తెలిసినా, అది కూడా అర్థం చేసుకోలేని సంపత్ పాత్ర సమాజంలో కనిపించే సగటు జీవికి దర్పణం. 1942లో భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో అష్టీ–చిమూర్ సత్యాగ్రహంలో రచయిత సాఠే కూడా అరెస్టయ్యాడు. అమరావతి జైలులో శిక్ష అనుభవించాడు. ఆ అనుభవాలతో జైలు జీవితాలను చకగా వర్ణించారు 'గాయం' కథలో. అరెస్టయిన ఓ ఉపాధ్యాయుడికి 40 ఏళ్ల శిక్ష పడడంతో, భార్య భవిష్యత్తు కోసం అతను తీసుకున్న నిర్ణయమే ఈ కథలో ప్రధానాంశం. గురూజీ తీసుకున్న ఆ నిర్ణయం... దాని పర్యవసానాలను రచయిత ఆవిష్కరించిన తీరు అద్భుతం.

**అణ్ణా భావూ సాఠే కథలు**
**(అనువాదం: మెహక్ హైదరాబాదీ)**
**ప్రచురణ :**

అరుదైన ఫోటో



భార్య అలెక్సాండ్రా వెలిగోర్‌స్కాయతో ప్రముఖ రష్యన్ రచయిత లియోనిడ్ ఆండ్రియేవ్ (1871–1919). 20వ శతాబ్దపు అత్యంత ప్రభావంతులైన రచయితల్లో ఒకడైన ఆండ్రియేవ్, పలు నాటకాలు రాశాడు. అప్పట్లో ఒక గొప్ప కళగా వెలిగిన 'స్టోరీ టెల్లింగ్' (కథలను ఆకట్టుకునే విధంగా చెప్పడం)లో పేరుప్రఖ్యాతులు సంపాదించాడు. భావవ్యక్తీకరణ వాదాన్ని రష్యా సాహిత్యంలో ప్రచారం చేసిన ఘతన ఆయనకే దక్కుతుంది. ఆండ్రియేవ్, అలెక్సాండ్రా అపురూపమైన ఫొటో ఇప్పుడు మాస్కోలోని 'స్టేట్ మ్యూజియం ఆఫ్ హిస్టరీ' భద్రంగా ఉంది.

## చదువులేదు... కానీ రచనల్లో మేటి!



'కోస్లీ' భాషలో రచనలుచేసి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన 'లోక్ కవి రత్న' హల్దార్ నాగ్ లక్షలాది మందికి మార్గదర్శకుడు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆయన మూడో తరగతితోనే చదువుకు స్వస్తి పలికాడు. చదువు రాకపోయినా, తన భావాలను కవితా రూపంలో చెప్పేవాడు. నాగ్ రచనలపై కొంతమంది పిహెచ్‌డి చేస్తున్నారంటే అవి ఏ స్థాయిలో సమాజాన్ని ప్రభావితం చేయగలుగుతున్నాయో అర్థం ఊహించుకోవచ్చు. అతని కవితలు ఎక్కువగా సమాజానికి, ప్రకృతికి సంబంధించినవే. కనీస సౌకర్యాలు కూడా లభించక, చదువుకోలేకపోయినప్పటికీ, స్వయం ప్రతిభతో రచయితగా ఎదిగిన నాగ్‌ను భారత ప్రభుత్వం 2016లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.

## సిరియాలో పురాతన వర్ణమాల ఆనవాళ్లు



సిరియాలో కనీసం 4,400 సంవత్సరాల క్రితం నాటి వర్ణమాల ఆనవాళ్లను పురతత్వ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన వర్ణమాలగా దీనిని వారు అభివర్ణిస్తున్నారు. పశ్చిమ సిరియాలోని పురాతన పట్టణ కేంద్రమైన టెల్ ఉమ్‌ఎల్ మర్రా వద్ద ఉన్న సమాధి నుండి మట్టి పాత్రలను తవ్వితీరు. వీటిని క్రీస్తు పూర్వం 2400 సంవత్సరం నాటివిగా చెప్తున్నారు. వీటిపై చెక్కిన అక్షరాలు, ఇప్పటి వరకూ మనకు తెలిసిన అల్ఫాబెటిక్ స్క్రిప్ట్ కంటే కనీసం 500 సంవత్సరాల ముందు కాలానివిగా భావిస్తున్నారు. ఈ సమాధి కాంస్య యుగం ప్రారంభం నాటిదని తేల్చారు. జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుల బృందం ఈ సమాధిని కనుగొంది. అందులో మట్టి సిలిండర్లపై చెక్కిన పురాతన అక్షరమాలను ఒక రచనగా ఈ బృందం భావిస్తున్నది. అల్ఫాబెటిక్ రైటింగ్ మూలాలు, వ్యాప్తి గురించి ఇప్పటి వరకూ ఉన్న సిద్ధాంతాలను ఈ కొత్త వర్ణమాల సవాలు చేస్తున్నది. ఆ సమాధిలో ఆరు అస్థిపంజరాలు, బంగారు, వెండి నగలు, వంటసామాను, ఈటె మొన, చెక్కుచెదరని కుండలు, ఇతర పాత్రలు కూడా ఉన్నాయి. సిలిండర్లపై ఉన్న రాతను గమనించిన తర్వాత, ప్రారంభ నాగరికత గతంలో అనుకున్నదాని కంటే, మరింత పురాతనమైనదనే నిర్ణయానికి వచ్చారు. అయితే, మరింత విస్తృతమైన అధ్యయనం జరగాల్సి ఉందని అప్పుడే ఒక అభిప్రాయానికి రావచ్చని పేర్కొంటున్నారు. కాగా, సిలిండర్లలో చిల్లులు ఉండడంతో, వాటిని లేబుల్స్‌గా ఉపయోగించి ఉండవచ్చని పరిశోధకులు ఊహించారు. బహుశా సమీపంలో ఉన్న నాళాల కంటెంట్లు లేదా మూలాన్ని అవి సూచిస్తున్నాయని వారి అభిప్రాయం. అయితే, ఆ సిలిండర్లపై ఉన్న వర్ణమాలను చదవడానికి లేదా అనువదించడానికి వీల్లేకుండా ఉన్నాయి. ఇంత వరకూ లభించిన ఏ ఇతర వర్ణమాలతో సరిపోవడం లేదని, కాబట్టి, డీకోడ్ చేయడం ప్రస్తుతానికి అసాధ్యమని పరిశోధకుల బృందం స్పష్టం చేసింది. ఏదిఏమైనా, ఒక కొత్త లిపిని పరిశోధకులు గుర్తించడంతో, మానవ పరిణామక్రమం కాలానికి సంబంధించిన సిద్ధాంతాలను తిరగరాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతున్నది.

## జైపూర్‌లో సాహితీవనం!




జైపూర్‌లో వచ్చే ఏడాది జనవరి 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ, ఐదు రోజులపాటు జరిగే జైపూర్ లిటరరీ ఫెస్టివల్ (జెఎల్‌ఎఫ్) వేలాది మంది సాహితీ ప్రియులను అలరించనుంది. అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ విజేత జెన్నీ ఎర్పెన్‌బెక్, అమెరికా చరిత్రకారుడు, రచయిత స్టెఫెన్ గ్రీన్‌బ్లాట్, ఇటాలియన్–అమెరికన్ నావలిస్టు ఆండ్రె అసిమన్, రాయల్ బయోగ్రాఫర్ టీనా బ్రౌన్ వంటి సుమారు 300 మంది హేమాహేమీలు ఈ సదస్సులో పాల్గొని తమ ఆలోచనలను, అభిప్రాయాలను పంచుకుంటారు. ఆంగ్లంతోపాటు, హిందీ, బెంగాలీ, రాజస్థానీ, కన్నడ, తెలుగు, తమిళం, ఒడియా, సంస్కృతం, అస్సామీస్, మలయాళం, మరాఠీ, పంజాబీ, ఉర్దూ భాషల్లోనూ చర్చాగోష్టులు ఉంటాయి. 18వ జెఎల్‌ఎఫ్‌తోపాటు 11వ జైపూర్ బుక్‌మార్క్ (జెబిఎం)ను కూడా నిర్వహిస్తారు. ఆ బుక్‌మార్కెట్‌లో ప్రపంచ వ్యాప్తంగా వివిధ భాషల్లో ఆణిముత్యాల్లాంటి పుస్తకాలను అమ్మకానికి ఉంచుతారు. సాహితీప్రియులు జైపూర్‌లో కొలుతీరనున్న సాహితీవనంలో విహరించడానికి సిద్ధ పడడమే తరువాయి.

## 'మున్నీరు' అంటే?



'కన్నీరు మున్నీరయ్యారు' అనే పద ప్రయోగాన్ని తరచు చూస్తునే ఉంటాం. ఏదో ఒక సందర్భంలో ఉపయోగించి కూడా ఉంటాం. కన్నీరు అంటే ఏమిటో అందరికీ తెలుసు. మరి 'మున్నీరు' అంటే ఏమిటి? దీని ఉత్పత్త్యర్థంలోకి వెళితే, 'మును', 'నీరు' అనే రెండు పదాలతో ఏర్పడిందని తెలుస్తుంది. 'మును' అంటే మదట అని అర్థం. మునుపు అనే పదం సుపరిచితమే. ఇక నీరు అంటే జలం. రెంటినీ ఒకే పదంగా మారిస్తే, 'ముందు నీరు'గలది అని అర్థం. ముందు నీరుగలది, అనంతమైన నీటికి మూలమైనది సముద్రం. మున్నీరు అంటే సముద్రం. ఎంతో లోతైనది కూడా సముద్రమే. మున్నీరుగా విలపించడం అంటే, అంతులేని బాధతతో కన్నీరు కార్చడం అని అర్థం. 'కన్నీరు మున్నీరుగా ప్రవహించి, ఆమె మనసును తేలిక చేసింది' వంటి వాక్యాలు మనకు తెలిసినవే. మున్నీరు పదంతో కొన్ని సామెతలు కూడా ఉన్నాయి. 'మున్నీరుకు మేఘాలు అంటుకుంటాయి' అనేది వీటిలో ఒకటి. సముద్రం మీద మేఘాలు ఏర్పడడాన్ని సూచిస్తూ, ఏదైనా అనంతమైన విషయానికి మరొకటి వచ్చి చేరడం అనే భావనను ఈ సామెత తెలియచేస్తుంది. మున్నీరు అనే పదానికి 'అవర్ణము' 'అబ్ధి', 'అంబుధి', 'ఉదధి', 'జలనిధి', 'పయోనిధి', 'ఆర్ణవము', 'సింధువు', 'నీరాకరము', 'రత్నాకరము', 'సాగరము', 'పారావారము', 'కడలి', 'వారాశి' వంటి పర్యాయపదాలు కూడా ఉన్నాయి.

## మహనీయుల కృషిలో.....

మహనీయుల కృషిలో
మహోన్నత ఆశయసాధనలో
వెలిసినదీ సంఘం
మహామహులు కృష్ణ అయ్యరు
భగవతి దేశాయి చిన్నపరెడ్డి
చిరకాల స్వప్నం
గొప్పనైనా న్యాయవాదుల
అవిరళ కృషి ఫలితం

న్యాయవాదుల హక్కులకిది
రక్షణ ఛత్రం
సామాజిక పురోగతిని
కోరు చక్కని సూత్రం
న్యాయవాదుల సమస్యలపై స్పందిస్తూ
పరిష్కారాలకు ప్రతిధ్వనిస్తూ
ఐక్యతను సాధిస్తూ
పిడికిలెత్తి పోరాడటమే

అంకిత ధర్మం
ప్రగతి పతాకమెత్తి
అరుణ కిరణమై
చీకటి చీల్చడమే
అంతిమ ధ్యేయం
ప్రజా సంక్షేమం
ప్రజల హక్కుల కోసం స
మర శంఖం పూరించడమే

సంఘ పరమ లక్ష్యంజన
జాగృతి కోరి
ఘనమైన ఉద్యమాలు నిర్మిస్తూ
న్యాయవాద సదస్సులు చేపట్టి
చైతన్యం బాట పట్టి
బహుముఖాలుగా జ్ఞానాన్ని విస్తరిస్తూ
సాగడమే సంఘ ఆశయం
అసమానతను ప్రశ్నిస్తూ

సమగ్ర భవితను ఆశిస్తూ
సమ సమాజ స్థాపన సాధనలో
ముందుకు సాగడమే
సంఘ ఆశ్వసనం
వర్ధిల్లాలి వర్ధిల్లాలి
ఐఎల్ సంఘం వర్ధిల్లాలి
సాధించాలి సాధించాలి
ఐఎల్ సంఘ ఆశయాలు సాధించాలి
ఐఎల్ తెలంగాణ రాష్ట్ర
ద్వితీయ మహాసభల
శుభాభినందనలతో ..!

**– సుధీర్ వలుస**

## ఈ వారం కవితలు

## జోహార్లు బాల మల్లేష్ కు జోహార్లు

పేదల గుడిసెల కోసం
ఉద్యమాలు పోరాటాలు చేసి
సాధించిన ఫలితాలు
ఎలా మరవగలం మిత్రమా !
మనం కలిసి చేసిన ఉద్యమాలు
నీవు నడియాడిన రోడ్లు మన తోటి స్నేహితులు బాల మల్లేష్ ఎక్కడంటే ఏ మీటింగ్‌కు
వెళ్ళావని చెప్పాలి నేస్తమా !

విద్యార్థి దశ నుంచే పోరాట పటిమ ఉద్యమ
స్ఫూర్తి విద్యార్థి యువజన కార్మిక కర్షక
సమస్యలపై మీకున్న పట్టు ఇప్పుడు
ఎవరికి ఉపయోగం మిత్రమా!
నీవు ధర్నాలు రాస్తారోకోలు ప్రవేశించగానే
పోలీసుల లాఠీలే సలాం చేసేవి
నీ సమకాలికులకు నీవే స్ఫూర్తి
మీ హావభావాలు చలాకీతనం

నవ్వుతూ నవ్విస్తూ ఉపన్యాస ధోరణి
ఎంతో మందిని ఆకర్షించేది
కాలి నడకన పోయే మానవుడు
ఆకాశంలో ప్రయాణం చేస్తున్నాడని
శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక వైద్య రంగాలలో
ఎంతో ప్రగతి సాధించామని

అమెరికాలో చీమ చిట్టుక్కుమన్న
క్షణాలలో ప్రపంచమంతా తెలుస్తుందని ఎవో
ఎవేవో గొప్ప మాటల మూటలు
పొగాకు మద్యం గంజాయి ప్రాణాంతక
వ్యాధులు ఏ అలవాట్లు లేనోళ్ళకు వ్యాధి
దాడి చేయడం ఆరోగ్యం క్షీణించడం గుండె
నొప్పి రావడం మనందరికి దూరం చేయడం
ఊహించలేకపోయాం
విధి ఎంత విచిత్రం
ఎంతో భవిష్యత్తు ఉన్నోడు
కనబడకుండా పోవడం
ఎన్నాళ్ళు బతికామని కాదు
ఏమి సాధించామన్నది ముఖ్యం

ఎంతో మంది మిత్రులను ఇంకెంతోమంది
అభిమానులను సంపాదించిన
మీ జన్మ ధన్యం
రంగారెడ్డి జిల్లాలో మీరు చేసిన ఉద్యమాలు
పోరాటాలు నిర్వహించిన మీటింగ్‌లు



అపూర్వం అద్భుతం మీరు మాతో గడిపిన
రోజులు గంటలు క్షణాలు మరువలేని

మరుపురాని మధురానుభూతులు
మీ నవ్వు మా మనస్సులలో
మెదులుతున్న ఇంకిపోని సంతకం
మీరు రేపటి తరానికి ఆదర్శనీయులు
మార్గదర్శకులు
జోహార్లు బాల మల్లేష్ జోహార్లు
మీరు కన్న సమసమాజం సోషలిజం
మార్క్సిజం లెనినిజం సామ్యవాదం
సాధించడమే
మీకు అర్పించే అసలు సిసలైన
ఎర్రెర్రని విప్లవాత్మకమైన నివాళులు

**విజయ భాస్కర్,**
**9290826988**

## అమరుడు 'శ్రీకాంత్'

త్యాగాల ఘనుడు
ఉద్యమాల సూరీడు
పరాక్రమాల సేనుడు
ఆ అమరచరితార్థుడే
వీర తెలంగాణ రణభేరి
కా!కాసోజు శ్రీకాంతచారి

తెలంగాణ సాధన కోసం
రగల్ జెండై ఎగిరినవాడు
పరపీడన విముక్తి కోసం
జంగ్ సైరనై మోగినవాడు
దుష్టపాలన అంతం కోసం
ధిక్కార స్వరమెత్తినవాడు

మంటలు చుట్టుముట్టి
తనువును దహించినా
జైతెలంగాణ నినాదాన్ని
అసలే విరమించనివాడు
మలిదశ మహోద్యమంలో

మృత్యువును హత్తుకున్న
తొలి అమర చరితార్థుడు
కాసోజు శ్రీకాంతుడు
త్వరగా అస్తమిస్తేనేం!



డిసెంబర్ 3 వర్ధంతి

సకల జనుల పెదాలపై
స్వేచ్ఛపాటై పల్లవిస్తాడు

వినీల ఆకాశ వీధిలో
స్ఫూర్తి రేడై ప్రకాశిస్తాడు
తూరుపు కనుమలలో
కీర్తి సూరీడై ప్రభవిస్తాడు
తెలంగాణ కాంతి ధార
కాసోజు శ్రీకాంతాచారికి
సకల జనుల నివాళులు

**కోడిగూటి తిరుపతి**
**9573929493**

# రోడ్ల వెంట ధాన్యం ఆరబోత ...

తఫాను హెచ్చరికతో రైతు గుండె పరుగు



ప్రజాపక్షం/వైరా:గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు ఉంచారు. అయితే గత రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అన్నదాతల్లో ఆందోళన ప్రారంభమైంది. ప్రస్తుతం ఫెంగల్ తుఫాన్ అన్నదాతలను టెన్షన్ పెడుతుంది. ఇప్పటికే ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో అక్కడక్కడ చిరు జల్లులు కూడా పడుతుఆన్నాయి. ఆదివారం వాతావరణం ఒక్కసారిగా పూర్తిగా మారిపోవడంతో ధాన్యం రాశుల వద్ద ఉన్న అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం ఇదే సమయంలో వచ్చిన తుఫాన్ వర్షానికి ధాన్యం తడిసి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయిన సందర్భం లేకపోలేదు. వరి కోతలు ముమ్మరంగా జరుగుతుండటంతో పంట పొలాల వద్ద రోడ్ల ప్రక్కన కొనుగోలు కేంద్రాల్లో భారీగా నిల్వలు ఉన్నాయి. ఫెంగల్ తుఫాన్ ప్రభావం కొనసాగితే పెద్ద ఎత్తున రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో ధాన్యం రాశులపై పరదాలు కప్పగా మరికొన్ని చోట్ల ధాన్యం రోడ్ల ప్రక్కన కళ్ళల్లో ఆరబోసే ఉన్నాయి. అయితే మార్కెట్‌యార్డ్ వద్ద కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యానికి పట్టాల కొరత వెంటాడుతుంది. పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు మార్కెట్‌యార్డ్‌కు రావడం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోయడంతో రైతులకు సరిపోని తార్పలార్లు అందుబాటులో లేవనే వాదన వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఫెంగల్ తుఫాన్ ప్రభావం రైతులపై ఏ విధంగా చూపుతుందో ఏ విధంగా ఉంటుందో అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



## పాల్వంచ కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో కలెక్టర్ సందర్శన

ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:పాల్వంచ కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని కలియ తిరుగుతూ మరింత అభివృద్ధి చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయని అన్నారు. ఫారెస్ట్, కేటీపీఎస్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా వెదురు బొంగులతో కట్టడాలు చేయాలని సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో టూరిజం, ఫారెస్ట్, కేటీపీఎస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాలు, పరిశుభ్రత కార్యక్రమం



కౌన్సిలర్ మాదినేని సునీత

ప్రజాపక్షం/వైరా:వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా వార్డులోశుభ్రత పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ల వెంబడి ఉన్న చెత్త నిల్వలను తొలగించడంతో పాటు పలు కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కౌన్సిలర్ సునీత మాట్లాడుతూ మన చుట్టూ పరిసరాలను మన ఇంటి పరిసరాలను డ్రైన్‌లు శుభ్రంగా ఉంచుకోవాలని మన పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంటే మనం బాగుంటాము, మనం ఆరోగ్యంగా ఉంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాపక్షం/పెనుబలి:ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన పడిగల సత్యనారాయణ (47) ఆదివారం బహిర్ భూమికి కుప్పనకుంట్ల చెరువు వద్దకి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. మృతుడు వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో కుప్పన కుంట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ధాన్యం కేంద్రాలుగా క్రీడా ప్రాంగణాలు

ప్రజాపక్షం/కల్లూరు :కల్లూరు మండల పరిధిలోని పుల్లయ్య బంజర, కొర్లగూడెం, ముగ్గు వెంకటాపురం, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి తదితర గ్రామాలలో గత 20 రోజుల నుంచి స్థలం కొరత, కల్లాలు లేక కష్టాలతో రైతులు క్రీడా ప్రాంగణాలను ధాన్యా కేంద్రాలుగా మార్చుకొని వినియోగించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో మరికొన్ని ఊరికి దూరంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను ధాన్య కేంద్రాలుగా మార్చుకొని వినియోగించుకోవడం వలన వాటిల్లో క్రీడలు నిలిచిపోయాయి. క్రీడా ప్రాంగణాలను కల్లాలుగా వినియోగించుకుంటూ తమ అవసరాలను తీర్చుకుంటున్నారు.




## కల్లూరులో కమ్మ వన సమారాధన

ప్రజాపక్షం/కల్లూరు:కల్లూరు లోని చంద్రు పట్ల రహదారిలో ఉన్న మామిడి తోటలో ఆదివారం కమ్మ సామాజిక వర్గంకు సంబంధించిన వారు నాట్యం, నృత్యం, ఆటపాట లకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. అనంతరం కమ్మ సామాజిక వర్గానికి సంబంధించిన సమస్యలు పరిచయ వేదిక పలకరింపులు లాంటివి జరిగాయి. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు సామాజిక వర్గ పెద్దలు, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి, కట్ట అజయ్ కుమార్, తోటకూర శేషగిరిరావు, కాకర్ల రంగారావు, ఏనుగు సత్యంబాబు, పోట్రు కిరణ్, కాటమనేని రమేష్, శ్రీనివాసరావు, రామారావు, పాలెపు రామారావు, బోబోలు లక్ష్మణరావు, చావా వెంకటేశ్వరరావు తదితర పెద్దలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/ఏన్కూరు:ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా ఆదివారం స్థానిక గురుకుల విద్యాలయంలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, పునరుత్పాదక ఇంధన వనరుల అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ నోటిఫికేషన్లు జారీ చేసి ఉద్యోగుల కల్పన చేసిందని అన్నారు. అమ్మ ఆదర్శ పథకం ద్వారా పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన జరుగుతుందని తెలిపారు. మెస్‌చార్జీలు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటిపి సునీల్, స్వర్ణ నరేంద్రకుమార్, మేడా ధర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, పటాన్ మజీద్‌ఖాన్, ప్రేలప్రోలు వర శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ కార్యకర్త రామారావు మృతి:పలువురి నివాళి



ప్రజాపక్షం/ఖమ్మం: సిపిఐ సీనియర్ కార్యకర్త తాళ్లూరి రా మారావు (65) ఆదివారం మృతి చెందారు. ఆయన గత కొ ంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తల్లాడ మ ండలం పిన పాక గ్రామానికి చెందిన తాళ్లూరి రామారావు బ తుకు దెరువు కోసం ఖమ్మం వచ్చి లక్ష్మినగర్ కాలనీలో ని వాసం ఉంటున్నారు. సిపిఐ నాయకులు నల్ల మోతు పిచ్చయ్య అనుచరుడిగా రామారావు పార్టీ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తుదిశ్వాస వరకు ఎర్ర జెండా నీడన జీవించారు. ఈ ఏడాది కూడా సిపిఐ శత వసంతాల సందర్భంగా పార్టీ సభ్యునిగా చేరారు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు రామారావు ఇంటికి వెళ్లి మృతదేహంపై అరుణపతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామారావు మృతితో కమ్యూనిస్టు పార్టీ ఒక నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిందన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు మద్దోజు శ్రావణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్, ప్రజా సంఘాల నాయకులు స్వర్ణ రాయప్ప, నర్సింహారావు తదితరులున్నారు.

## మణుగూరులో గ్రావెల్ రోడ్డు శంకుస్థాపన



ప్రజా పక్షం/మణుగూరు రూరల్:మణుగూరు మండలం గుట్ట మల్లారం రైతు వేదిక వరకు గ్రావెల్ రోడ్ కు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం శంకుస్థాపన చేశారు. రైతు పండుగ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ రోడ్లు, భవనాల శాఖ రైతు వేదిక వరకు గ్రావెల్ రోడ్ పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పాయం ఆదేశాల మేరకు చెప్పిన 24 గంటల్లోనే నూతన గ్రావెల్ రోడ్డుకి శ్రీకారం చుట్టారు. గ్రావెల్ రోడ్డు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని చెబుతూ రైతు వేదికకు వెళ్లే మార్గానికి గ్రావెల్ రోడ్డు వేయిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అగ్రికల్చర్ ఎడితాతారావు, ఎమార్వో రాఘవ రెడ్డి, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు లక్ష్మణరావు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా పాలన విజయోత్సవ ‘2కె రన్’



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం అయిన సందర్భంగా ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ప్రజా పాలన విజయోత్సవ 2కె రన్ నిర్వహించడం జరిగిందని జిల్లా యువజన క్రీడల శాఖాధికారి సునీల్ రెడ్డి తెలిపారు. ఆదివారం సర్దార్ పటేల్ మైదానం నుంచి నిర్వహించిన 2కె రన్‌ను జిల్లా యువజన క్రీడల శాఖాధికారి సునీల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జెడ్పి సెంటర్ వరకు నిర్వహించిన 2కె రన్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా అవగాహన కల్పిస్తూ 2కె రన్ నిర్వహించినట్లు తెలిపారు. నిత్యం తమ దైనందిన జీవితంలో ఎన్నో ఒత్తిళ్లకు గురై ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించడం పట్ల ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఎల్లప్పుడు ధృడంగా, ఆరోగ్యంగా ఉండేలా వ్యాయామాలు, ఆహార నియమాలు పాటిస్తూ వ్యక్తిగత శ్రద్ధవహిస్తూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

## పౌర హక్కుల నేత శంకరన్న మృతి



ప్రజాపక్షం/ఖమ్మం: పౌర హక్కుల సంఘం నాయకుడు, ప్రముఖ న్యాయవాది చల్లా శంకర్ (60) ఖమ్మంలో ఆదివారం హఠాన్మరణం చెందారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం నిద్రలేచిన శంకర్ మెడికల్ షాపుకు వచ్చి మందులు తీసుకుని ఆటో ఎక్కి ఇంటికి వెళ్లగానే కుప్పకూలాడని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారన్నారు. న్యాయవాద వృత్తిలో చల్లా శంకర్‌కు మంచి పేరుంది. ముఖ్యంగా పౌర హక్కుల సంఘం నేతగా ఆయన పలు కేసులను వాదించడమే గాక ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలిచారు. తన ఇంటినే పౌర హక్కుల సంఘం కార్యాలయంగా మార్చి పలువురికి అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. లూనాపై తిరుగుతూ నిర్బంధ కాలంలోనూ రాజ్యానికి భయపడకుండా విప్లవ పార్టీ కార్యకర్తల కేసులను ఆయన వాదించేవారు. శంకర్ భౌతికాయాన్ని పలువురు న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు.

**పలువురి సంతాపం :**శంకర్ మృతి పట్ల పలువురు న్యాయవాదులు, న్యాయవాద సంఘాలు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి చింతనిప్పు వెంకట్, న్యాయవాద ప్రముఖులు కొల్లి సత్యనారాయణ, బిచ్చాల తిరుమలరావు తదితరులు సంతాపం ప్రకటించి నివాళులర్పించారు.

## పాడి పశువుల పెంపకానికి చేయూత : కలెక్టర్




ప్రజాపక్షం/బూర్గంపాడు:పాడి పశువుల పెంపకానికి మరింత చేయూతను అందిస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెంలో పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయల జాతీయ సేవా పథకంలో భాగంగా పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల పెంపకం అనేది కొంచెం కష్టమైన పని అయినప్పటికీ దాని ద్వారా లాభాలను అర్జించవచ్చని తెలిపారు. మేత వేయటం పాలు పితకడం వంటి చాకిరీ ఉండేదని అన్నారు. ప్రస్తుతం పరిస్థితుల దృష్ట్యా ఎక్కువ మంది పాడి రైతులు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రభుత్వ పరంగా పాడి రైతులకు ఎన్నో రకాల ప్రోత్సహాలను అందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్లకు, మేత పెంపకానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. కొంత అవగాహన రాహిత్యంతో రైతులు వీటిని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని అన్నారు. ఏదైనా మనం సాధించాలంటే అది సొంత ఊరిలోనే సాధించేలా ఆలోచనలు చేయాలని తెలిపారు. గ్రామాల్లో స్థలాలు, గోపాల మిత్రులు అందుబాటులో ఉంటే అక్కడ పశువైద్యశాల ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాడి రైతులకు అనేక సబ్సిడీ పథకాలను ప్రభుత్వం వర్తింపు చేస్తుందన్నారు. జిల్లాలో పాడి సందపను పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పాడి రైతులు పశువులకు సంక్రమించే వివిధ రకాల జబ్బుల విషయంలో వెంటనే పని కట్టి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్సలందరించాలన్నారు. పాడి పశువులకు ప్రస్తుతం మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, గ్రామాల్లో వాటిని మరింత విస్తరింపజేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. పశు వైద్య శిబిరాల నిర్వహణతో మరింత అవగాహన కలుగుతుందని వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడి రైతులు ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేట్ డీన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి పురేందర్, పశుగాణాభివృద్ధి అధికారి డాక్టర్ కిషోర్, సహాయ సంచాలకులు సత్యప్రసాద్, రవీంద్రనాథ్ ఠాగూర్, యూనివర్సిటీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరికీ ఎయిడ్స్‌పై అవగాహన

* డాక్టర్ సిహెచ్. కిరణ్ కుమార్

ప్రజాపక్షం/పెనుబలి:ప్రతి ఒక్కరు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని లంకాసాగర్ పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. కిరణ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రమైన జట్పీఎస్ఎస్ పెనుబల్లి నుండి వీఎం. బంజర్ రింగ్ రోడ్ వరకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి, ఎయిడ్స్ గురించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీహెచ్. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ పై అపోహలు వద్దు.. అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా పెనుబల్లి మండలంలో రింగ్ రోడ్డు, జన సమూహ ప్రాంతంలో, ఆటో, ట్రక్ డ్రైవర్స్ కు ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లంకాసాగర్ పీహెచ్‌సి సిబ్బంది హెచ్ఈఓ శ్రీనివాస్ పీహెచ్ఎన్. సుగుణ దేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆరోగ్య పర్యవేక్షకులు బి. నాగేశ్వరావు, ఎంఈఓ, ఎంపిహెచ్‌ఏ కరీముల్లా, రవి, ఎఎన్‌ఎంలు మంగతాయారు, నాగమణి, బేగం, రాణి, కృష్ణ కుమారి, ఆశాలు పాల్గొన్నారు.




## నిబద్ధత గల కమ్యూనిస్టు:పోటు ప్రసాద్



ప్రజాపక్షం/ఖమ్మం : పోటు ప్రసాద్ మరణంతో ఒక అభ్యుదయ వాదిని, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని ప్రజాపక్షం ఎడిషన్ ఇ ంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల మృతి చెందిన పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఆదివారం స్టాఫ్ రిపోర్టర్ కె. ప్రసాదరావు అధ్యక్షతన ప్రజాపక్షం ఖమ్మం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఏ నుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం విశాలాంధ్ర పత్రిక స బ్ కమిటీ కన్వీనర్‌గా పనిచేశారని ఆయన తెలిపారు. అభ్యుదయ భా వాలు కలిగిన ప్రసాద్ వామపక్ష సాహిత్యానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చేవారన్నారు. స్వతహాగా అధ్యయనం చేసే ప్రసాద్ ప్రజాపక్షం పత్రికకు ప లు విధాలుగా దన్నుగా నిలిచారన్నారు. ఆయన మరణం పత్రికకు, వామపక్ష సాహిత్యానికి తీరని లోటని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకటనల విభాగం బాధ్యులు టికె ప్రసన్నన్, మధిర, వైరా, పా లేరు ఆర్‌సి ఇంచార్జిలు కె. శ్రీనివాస్, పి. కృష్ణర్జున్‌రావు, బి. అశోక్, సీనియర్ జర్నలిస్టు యాసా నర్సింహారావు, సబ్ ఎడిటర్ పింగళి రాంబాబు, ఆపరేటర్ గద్దం రామారావు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కులం, మతం పేరుతో విభజన రేఖ

కుల, మత కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనడం నేరం

జన భోజనాలకు భారీ జన స్పందన



ప్రజాపక్షం/ఖమ్మం : కులం, మతం పేరుతో కొందరు స్వార్థపరులు జనం మధ్య విభజన రేఖ గీస్తున్నారని వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఆరోపించారు. స్వార్థం కోసమే కులాలను, మతాలను ప్రేరేపిస్తున్నారని కులం పేరుతో జరుగుతున్న వన భోజనాలను ప్రజలు తిరస్కరించారని వారు పిలుపునిచ్చారు. కుల రహిత మత రహిత భోజనాలను ప్రోత్సహిస్తూ కులాలు, మతాలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని పెంపొందించేందుకు సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ స్వర్శ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో జరిగిన జన భోజనాలకు జనం నుంచి భారీ స్పందన లభించింది. ఆదివారం బల్లేపల్లి సమీపంలోని మామిడితోటలో జరిగిన కార్యక్రమం సందర్భంగా ఏర్పాటైన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య కుల, మత వైరుధ్యాలను పెంచి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు చైతన్యవంతమైతే రాజకీయ నేతల ఆటలు సాగవని కులం మత్తులో జనాన్ని ఉంచేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఒకప్పుడు సామూహికంగా వన భోజనాలను నిర్వహించే వారని కాని ఇప్పుడు ఆ స్థానే కుల భోజనాలు వస్తున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు కుల, మత కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని పలువురు వక్తలు ప్రశ్నించారు. ప్రజలను చైతన్యపర్చాల్సిన ప్రజాప్రతినిధులు ఇటువంటి వాటిని ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. ప్రజలు ఐక్యతను ప్రదర్శించి ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రోత్సహించాలన్నారు. ఖమ్మం లాంటి చైతన్యవంతమైన జిల్లాలో కుల పోకడలు భవిష్యత్తులో ప్రమాదకరంగా మారతాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, స్వర్శ అధ్యయన వేదిక బాధ్యులు స్వర్శ భాస్కర్, విద్యావంతుల వేదిక నాయకులు అంబటి నాగయ్య, మాజీ మావోయిస్టు జంపన్న ప్రసంగించగా ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ఆ వుల వెంకటేశ్వర్లు, సివై పుల్లయ్య, అశోక్, సిహెచ్ శిరోమణి, ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, శోభ, కె. శ్రీనివాస్, మంగతాయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## మిస్టరీగా మారిన దంపతుల హత్య

ప్రజాపక్షం/ఖమ్మం: నేలకొండపల్లి మండల కేంద్రంలో జరిగిన దంపతుల హత్య ఆ తర్వాత పరిణామాలు ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా చెత్తకుండీలో దొరికిన ఫోన్. ఆ ఫోన్ నుంచి వెళ్లిన కాల్స్ ఇప్పుడు ఇబ్బందిపెడుతున్నాయి. ఈనెల 26 రా త్రి నేలకొండపల్లి కొత్త బస్టాండ్ సమీపంలో గల యర్రా వెంకటరమణ, కృష్ణకుమారి దంపతులు దారుణ హత్య కు గురయ్యారు. ఎవరు చేశారు, ఎందుకుచేశారనే దానిపై భిన్న కథనాలువినిపిస్తున్నాయి. ఈహత్య తర్వాత నేలకొండపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో గల చెత్తకుండీలో ఓ ఫోన్ పోలీసులకు లభ్యమైంది. సిసి ఫుటేజ్ ప్రకారం బుల్లెట్ మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తి ఆ ఫోన్‌ను చెత్తకుండీలో పడేసినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. కాని ఆ వ్యక్తి ఎవరనేది స్పష్టం కాలేదు. అయితే ఆ ఫోన్ ఆధారంగా కొంత మందిని పోలీసులు విచారిస్తున్నారు. ఆ కాల్ అందుకున్న పలువురిని ఖమ్మం రూరల్ పోలీసులు పిలిపించి విచారిస్తున్నారు. ఇది మొత్తం అత్యంత పకడ్బందీగా ఎవరికి దొరకని రీతిలో హత్య చేశారన్నది స్పష్టమవుతుంది. యర్రా వెంకటరమణ తన ఇంట్లో కొంత భాగాన్ని అద్దెకిస్తాడు. బయట ఉన్న టూలెట్ బోర్డు చూసి హత్యకు వారం రోజుల ముందు ఇద్దరు ముసుగు వేసుకున్న మహిళలు వచ్చి ఇంటిని కిరాయికి మాట్లాడుకుని నాలుగువేలు అడ్వాన్స్ ఇచ్చారు. ఆ తర్వాత మంగళవారం రాత్రి వారు తిరిగి ఒక సంచి, ఒక బ్యాగుతో వచ్చారు. సామాన్లు లేకపోవడంతో వెంకటరమణ దంపతులు వారికి భోజనం పెట్టారని భోజనం చేసే సమయంలోనూ వారు ముసుగు తీయలేదని తెలుస్తుంది. ఇంటి చుట్టూ కారం చల్లారు. ఆ దంపతులపైన కూడా కారం చల్లారు.వృద్ధ దంపతులు హత్య తర్వాత నగదు కానీ ఏ ఇతర సామాన్లు దోచుకోలేదని పోలీసులు తెలిపారు. వెంకటరమణ, కృష్ణకుమారి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో ఉంటుండగా కుమార్తె జగ్గయ్యపేటలో నివసిస్తుంది. దోపిడీ దొంగలైతే ఆస్తి దోచుకెళ్లకుండా ఇంత పకడ్బందీగా వారం ముందు వచ్చి నాలుగు వేలు అడ్వాన్స్ ఇచ్చి ఈ హత్యకు పాల్పడతారా అన్నది ఆలోచించాల్సిన విషయం. ఆస్తి తగాదాలు, కుటుంబ సభ్యుల మధ్య విబేధాలు ఉంటే తప్ప ఇటువంటి ముందస్తు ప్రణాళికతో హత్యలు జరగవన్న చర్చ సాగుతుంది. ఓ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. అతని ద్వారా కీలక సమాచారం లభ్యమయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది.

# సిఎంఆర్‌ఎఫ్‌లో కొత్త రికార్డు

ఏడాదిలోనే రూ.830 కోట్ల సాయం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఔదార్యం
1.66 లక్షల కుటుంబాలకు ప్రభుత్వ సాయం
పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు పునర్జన్మ
గతంలో సిఎంఆర్‌ఎఫ్‌లో జరిగిన అవకతవకలకు చెక్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం, అత్యవసర వైద్య చికిత్స అవసరమైతే సాయం అందించటంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త రికార్డు నెలకొల్పారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే దాదాపు రూ.830 కోట్లు సిఎంఆర్‌ఎఫ్ నిధులు విడుదల చేశారు. రాష్ట్రంలోని 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు సిఎంఆర్‌ఎఫ్‌తో లబ్ధి పొందాయి. 2018 నుంచి 2023 వరకు ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం సిఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2400 కోట్ల సాయం అందించింది. అప్పటి ప్రభుత్వం సగటున ఏడాదికి రూ.480 కోట్లు ఖర్చు పెడితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క ఏడాదిలోనే రూ.830 కోట్లు సాయం అందించి, సరికొత్త రికార్డు నెలకొల్పారు. ప్రజలకు ఆపదలు వచ్చినా, విపత్తులు సంభవించినా ఆదుకునేందుకు నేనున్నానంటూ సిఎంఆర్‌ఎఫ్ ద్వారా అభయ హస్తం అందిస్తున్నారు. ఈ ఏడాది ఇచ్చిన రూ.810 కోట్లలో రూ.590 కోట్లు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించడం విశేషం.

**పేద కుటుంబాలకు ఖరీదైన వైద్యం..**

ఆరోగ్య శ్రీ పరిధిలో లేని చికిత్సలు, ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు ఖరీదైన వైద్యం అవసరమైతే ప్రజా ప్రతినిధుల సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ సాయం అందిస్తుంది. కొన్ని వ్యాధులకు జిల్లా స్థాయిలో అవసరమైన వైద్య చికిత్స సదుపాయం అందుబాటులో లేక హైదరాబాద్‌లోని పెద్ద ఆసుపత్రులను ఆశ్రయిస్తారు. ఖరీదైన వైద్యం చేయించుకునే స్తోమత లేక ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో ముందుగానే సిఎం సహాయ నిధిని ఆశ్రయిస్తారు. అటువంటి సందర్భాల్లో నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రి, నిలోఫర్, ఈఎన్‌టి, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో చికిత్సలకు అయ్యే అంచనా ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

**ఈ ఏడాదిలో 13 వేల మందికి రూ.240 కోట్ల ఎల్‌ఓసిల జారీ..**

సిఎం సహాయ నిధి నుంచి సంబంధిత ఆసుపత్రికి ఎల్‌ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) జారీ చేస్తుంది. ఈ ఏడాదిలోనే 13 వేల మందికి ఎల్‌ఓసిలు జారీ చేశారు. సుమారు రూ. 240 కోట్ల ఎల్‌ఓసిలు మంజూరు చేశారు. ఇందులో అత్యధికంగా చిన్న పిల్లలకు అవసరమయ్యే ఆపరేషన్లు, చికిత్సలకు కేటాయించారు. ప్రాణాపాయంలో ఎవరున్నా సరే, వైద్య చికిత్స అత్యవసరమని గుర్తించిన ప్రజా ప్రభుత్వం ఎల్‌ఓసిల జారీని వేగవంతం చేసింది. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే ఎల్‌ఓసి ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ఒక్కరోజు కూడా ఆలస్యం చేయవద్దని, ఆదివారంతో పాటు సెలవు దినాల్లో కూడా ఎల్‌ఓసిలు క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం విశేషం.

**దళారుల ప్రమేయానికి అడ్డుకట్ట – ఆన్‌లైన్‌లో ఎల్‌ఓసిల విడుదల..**

గత ప్రభుత్వ హయాంలో సిఎంఆర్‌ఎఫ్ నిధులకు కూడా అవినీతి చీడ పట్టుకుంది. పేదల పేరిట మెడికల్ బిల్లులు సృష్టించి నిధులను దిగమింగే దందా వెలుగులోకి వచ్చింది. పారదర్శకంగా సిఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులను కూడా ఆన్‌లైన్‌లోకి తెవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసింది. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా దరఖాస్తుదారులే తమ సిఎంఆర్‌ఎఫ్ సాయం ఏ దశలో ఉందో, ఎప్పటికప్పుడు స్టేటస్‌ను తెలుసుకునేలా ఆన్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. గతంలో కొందరు ప్రజాప్రతినిధుల కార్యాలయాల్లో పని చేసిన సిబ్బంది సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు తమ ఖాతాల్లో వేసుకున్నారు. అటువంటి లొసుగులకు అడ్డుకట్ట వేసేందుకు ఏకంగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కులపై లబ్ధిదారుల పేర్లతో పాటు వారి బ్యాంక్ ఖాతా నెంబర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముద్రిస్తోంది. ఆసుపత్రుల వెరిఫికేషన్ ప్రక్రియను కఠినతరం చేసి, దొంగ బిల్లులతో సిఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేయడాన్ని నిరోధించింది.

**ఆ పిల్లలకు పునర్జన్మ..**

పుట్టుకతోనే ఈఎన్‌టి (మూగ, చెవుడు) సమస్యలతో పుట్టే పిల్లలకు 6 ఏండ్లలోపల శస్త్రచికిత్సలు చేయించాల్సి ఉంటుంది. అవసరమైన వినికిడి పరికరాలు అమర్చాల్సి ఉంటుంది. లేకుంటే వారు జీవితాంతం మూగవారిగా ఉండిపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ ఆపరేషన్ల ఖరీదు లక్షల్లో ఉండడంతో పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఆపరేషన్లు చేయించుకోలేకపోతున్నారు. అలాంటి పిల్లలు జీవితాంతం చెవులు వినపడక, మాటలు రాని అభాగ్యులుగా ఉంటున్నారని తొలి సమీక్ష సమావేశాల్లోనే వైద్యారోగ్య శాఖ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి తెలంగాణలో భవిష్యత్తు తరాల్లో చెవిటి, మూగ పిల్లలు ఉండకూడదని, అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఎంత ఖర్చయినా ప్రభుత్వమే అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఎల్‌ఓసిలు ఇచ్చి అటువంటి పిల్లలను ఆదుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌ఓసి ఇచ్చి ఆపరేషన్లు చేయించారు.

## తృతీయ జ్యూవెలరీ అధినేత అరెస్టు

సెలబ్రిటీలకు రూ.100 కోట్లు టోకరా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన బంగారు నగల దుకాణంలో భాగస్వామిని చేస్తానంటూ నమ్మించి పలువురు సెలబ్రిటీల నుంచి రూ.100 కోట్లు వసూలు చేసి ఎగనామం పెట్టిన తృతీయ జ్యూవెలరీ అధినేత కాంతీదత్‌ను హైదరాబాద్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాంతీదత్ కొన్ని సంవత్సరాల నుంచి జూబ్లీహిల్స్‌లో తృతీయ జ్యూవెలరీ పేరుతో బంగారు నగల షోరూంని నిర్వహిస్తున్నాడు. తన నగల షోరూంకు వచ్చే సెలబ్రిటీలతో స్నేహం పెంచుకున్నాడు. తన బంగారు నగల వ్యాపారంలో భాగస్వామం కల్పిస్తానని పలువరు సెటబ్రిటీలను నమ్మించాడు. ఈ క్రమంలోనే మహిళా వ్యాపారవేత్త శ్రీజారెడ్డి, పరిణితి చోప్రా, హిరోహిన్ సమంత, కీర్తి సురేష్,డిజైనర్ శిల్పారెడ్డిలతో పాటు పలువురు ప్రముఖుల నుంచి రూ.100 కోట్లు వసూలు చేశారు. తన వ్యాపారంలో వీరందరికి భాగస్వామ్యం కల్పిస్తున్నానని నమ్మించి ఫోర్జరీ సంతకాలతో వారికి షేర్ ఉన్నట్లు నమ్మించాడు. ఇది నిజమేనని నమ్మిన బాధితులు ఆరు నెలలుగా తమకు రావాల్సిన ఆదాయం రాకపోవడంతో కాంతీదత్‌ను నిలదీశారు. రెపోమాపో లాభాలు వస్తాయని నమ్మిస్తూ వచ్చాడు. అనుమానం వచ్చిన బాధితురాలు శ్రీజారెడ్డి కాంతీదత్ నిర్వహిస్తున్న తృతీయ జ్యూవెలరీ ఆర్థిక కార్యకలాపాలపై ఆరా తీయగా ఆశ్చర్యకర విషయాలు బయటపడ్డాయి. తమకు ఇచ్చిన భాగస్వామ్య పత్రాలు ఫోర్జరీవని,తాను మోసపోయానని గ్రహించిన శ్రీజారెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆదివారం కాంతీదత్‌ను అరెస్టు చేశారు. ఈ విషయం తెలియగానే కాంతీదత్ బంగారు నగల వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన మరికొంత మంది సెలబ్రిటీలు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కు క్యూ కట్టారు. వారి నుంచి కూడా ఫిర్యాదులు స్వీకరించారు. కాంతీదత్ ఎంత మంది బాధితులను ముంచాడు అనే విషయాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇతని చేతిలో ఎవరైనా మోసపోయి ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.

## రూ.8.14 కోట్ల స్టాక్ ట్రేడింగ్ చీటింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్టాక్ ట్రేడింగ్ చీటింగ్ కేసులో ఇద్దరు నిందితులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి రాహుల్ డాంగి (21), రాహుల్ భోయ్ (25)లు ఆన్‌లైన్‌లో స్టాక్ ట్రేడింగ్ పేరుతో పలువురు వ్యాపారులను మోసగించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారిని కూడా స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టమని నమ్మించడంతో అతను మూడు నెలల వ్యవధిలో రూ8.14 కోట్లను వారి ఖాతాలోకి బదిలీ చేశాడు. ఆ తరువాత లాభాలు రాకపోడంతో ఆరా తీయగా మోసపోయానని గ్రహించి టిజిసిఎస్‌బి అధికారులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసుల రాజస్థాన్‌లో ఉన్న రాహుల్ డాంగి, రాముల్ భోయ్‌లను అరెస్టు చేశారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** మండలపరిధిలోని జిల్లెలగ్రామంలో దార సాయమ్మ మరణించింది. విషయం తెలుసుకున్న మాజీసర్పంచ్ జిల్లెలరాములు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, మృతురాలిభర్త దారజంగయ్యకు రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి కుటుంబానికి అన్నివిధాల అందుబాటులో ఉంటామని భోరసానిచ్చారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ కొమ్మగౌనిరవిగౌడ్, గ్రామకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, దేవాలయవైస్‌చైర్మన్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సిసెల్ గ్రామ అధ్యక్షుడు గుమ్మకొండమహేందర్, యువజనకాంగ్రెస్ అధ్యక్షుడు ఎముక శ్రీహరి, కుర్వసంఘం అధ్యక్షుడు చిక్కొండబీరయ్య,నాయకులు పెరుమాళ్ల శ్రీశైలం, మొక్తాలబాల్‌జంగయ్య, డొక్కా జంగయ్య, సత్యనారాయణగౌడ్, నాపబీరయ్య, కొమ్మగౌనివెంకటయ్యగౌడ్, తోటపల్లి నర్సింహ్మా, తోటపల్లి కృష్ణ, చిక్కొండ శ్రీశైలం, బాలరాజు, ఆంజనేయులు, శ్రీను, గుమ్మకొండ నిరంజన్,గుమ్మకొండ ఎట్టయ్య, ఎముక జంగయ్య, వెంకటయ్య, మల్లేష్, శివ పాల్గొన్నారు.



## జాతీయసేవాపథకంలో భాగంగా పశువైద్యశిబిరాలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పివి నరసింహారావు పశువైద్య విశ్వ విద్యాలయం పశువైద్య కళాశాల రాజేంద్రనగర్, పశువైద్య పశు సంవర్ధకశాఖ, విజయడెయిరీ ఆధ్వర్యంలో కుప్పగండ్ల, తెల్లపలుగుతండ, యంగంపల్లి, కుర్మిద్ద గ్రామాలలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈశిబిరాలకు పశువైద్య కళాశాల ఆసోసియేట్ డిన్‌డాక్టర్ ఉదయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఈశిబిరాల్లో ఎదకురాని పశువులకు, చూడినిల్వని పశువులకు, గర్భకోశవ్యాధులున్న పశువులకు, దీర్ఘకాల వ్యాధులున్న పశువులకు శస్త్రచికిత్సలు అవసరమైన పశువులకు నిపుణులైన అధ్యాపకులచే పరీక్షించి చికిత్సలు చేస్తారని తెలియజేశారు. ఈప్రాంతంలో ఎక్కువగా ఉన్న బాహ్యపరాన్న జీవులబెడద ఎక్కువగా ఉంది దీనివలన పశువులు నీరసించి వ్యాధులబారినపడే అవకాశం ఉందని తెలిపారు. బాహ్యపరాన్న జీవులను నియంత్రించినట్లయితే పశువులలో ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. బాహ్యపరాన్న జీవుల నియంత్రణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈశిబిరాల్లో 367 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 72 పశువులకు ఇతర అనారోగ్యాలకు చికిత్సలు , రక్తపరీక్షలు, పేడపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాపశువైద్య పశుసంవర్ధకఅధికారి డాక్టర్ జివి రమేష్, ఎన్ఎస్ఎస్ ఇంచార్జీ డాక్టర్ రమణ, కెసిఎస్‌రెడ్డి, డాక్టర్ రాజేష్, నాగరాజు,శివ,శ్యామ్, పశువైద్య కళాశాల అధ్యాపకులు, డెయిరి సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## భగవద్గీత కంఠస్థ పోటీలలో మక్తల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం / మక్తల్ :** విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలకు ఎంపికైన మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి హరికుమార్ జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలలో మక్తల్ విద్యార్థుల ప్రతిభ పాలమూరు జిల్లా కేంద్రం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలలో మక్తల్ విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చి గెలుపొంది బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు అందరిని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త పి. ప్రాణేశాచారి, విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి వి. భీంరెడ్డి, పట్టణ అధ్యక్షులు వాకిటి భీమన్న, పట్టణ కార్యదర్శి మల్లికార్జునరావు, భజరంగదళ్ , ప్రఖండ ప్రముఖ్ బి. రాహుల్ , నాగరాజు, నరేష్ కుమార్ , మూర్తి, అక్షయ్ , శ్రీనివాసులు, రవీందర్ రెడ్డి, మల్లయ్య, సురేష్ కుమార్ , రాఘవేందర్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## నల్లమలలో సీతక్క సుడిగాలి పర్యటన



**ప్రజాపక్షం/అచ్చంపేట :** రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క అమ్రాబాద్ అడవిలో శనివారం సాయంత్రం నుండి ఆదివారం వరకు సుడిగాలి పర్యటన నిర్వహించారు. శనివారం మహబూబ్‌నగర్‌నుండి వచ్చిన మంత్రి అచ్చంపేటలో పలు దేవాలయాలను సందర్శించి కార్తీకదీపోత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం శ్రీశైలంలో ఉండి ఆదివారం ఉదయం భ్రమరాంభమల్లిఖార్జునస్వామి దర్శనం చేసుకున్నారు. దేవాలయ సిబ్బందితో మాట్లాడి పూర్ణాకుంభం అందుకున్నారు. ఉదయం శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్‌కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉద్యోగులతో చర్చించారు. ఉద్యోగులతోపాటు విద్యుత్‌శాఖ అధికారులుమాట్లాడుతూ తమకు బదిలీలుకావడంలేదని మరికొన్ని సమస్యలను మంత్రిదృష్టికి తీసుకువచ్చారు. మంత్రివారితో మాట్లాడుతూ తమపరిధిలో ఉన్నవి చేస్తున్నట్లుగా మిగతావి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళుతున్నట్లు తెలిపారు. దోమలపెంటనుండి మల్లెలతీర్థంకు వెళ్లి అక్కడ చెంచు కుటుంబాలను పరామర్శించారు. సార్లపల్లి అనే చెంచుపెంటలో చెంచు కుటుంబాలకు దుప్పట్లు, పిల్లలకు దుస్తులు పంపిణీచేశారు. అనంతరం అప్పాపూర్‌వెళ్లి అక్కడ చెంచులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. అప్పాపూర్‌లోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని బోజన కార్యక్రమం చేశారు. లింగాల మండలంలోని బౌరాపురంలోని భ్రమరాంభదేవాలయాన్ని దర్శించుకొని ఫర్హాబాద్ వ్యూపాయింట్‌సందర్శించి అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈప్రాంతాన్ని టూరిజంహాబ్‌గా చేయాలని అధికారులకు సూచించారు. టూరిజం హాబ్‌చేయడంలో తలెత్తె సమస్యలను తెలుసుకొనిఅటవీ కేంద్రఅటవీశాఖ అధికారులతో మాట్లాడి టూరిజంహాబ్ తయారుచేస్తామని తెలిపారు. ఫర్హాబాద్‌నుండి కన్యతండావచ్చి ఇరిగేషన్‌శాఖ కార్యక్రమాలు ప్రారంభించారు. కన్యతండానుంచి ఐనోల్ గ్రామానికి రోడ్డుశంకుస్థాపన చేశారు. ఐనోల్‌నుండి ఉప్పునుంతలకు వెళ్లేరోడ్డుకు శంకుస్థాపన చేశారు. అక్కడ విలేకరులతో మాట్లాడుతూ నల్లమలను అన్నిరకాలుగా ఆదుకుంటామని నల్లమల చెంచులకు భరోసా కల్పిస్తున్నట్లుగా తెలిపారు. ఇటీవల చెంచులపైదాడిచేసిన ఫారెస్టు అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆమెహెచ్చరించారు. అటవీశాఖ అధికారులు చెంచులపైదాడి చేయడం ఆమె ఖండించారు. భవిష్యత్తులో చెంచులపైదాడిచేస్తే వారిపై చర్యలతోపాటు ఉద్యోగంనుంచి తొలగిస్తామని ఆమె హెచ్చరించారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇదిమూడోసారి తమ పర్యటన అని ఇప్పటివరకు పలు సమస్యలు తమదృష్టికి వచ్చాయని వాటిని అంచెలవారిగా పూర్తిచేయనున్నట్లు ఆమెతెలిపారు. మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి కావడంతో అచ్చంపేట సిడిపిఓ లక్ష్మి మంత్రిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ , కాంగ్రెస్‌నాయకులతోపాటు అచ్చంపేట ఎసిడిపివో కమల, సూపర్‌వైజర్లు సువర్ణ, అమృతమ్మ పాల్గొన్నారు.

## టిజిపిఎస్‌సి చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి)చైర్మన్‌గా సీనియర్ ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సంబంధిత దస్త్రంపై గవర్నర్ జిష్ణుదేవర్మ సంతకం చేశారు. ప్రస్తుతం టిజిపిఎస్‌సి ఛైర్మన్‌గా పనిచేస్తున్న మాజీ డిజిపి మహేందర్‌రెడ్డి డిసెంబర్ 2న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో తదుపరి ఛైర్మన్గా ప్రస్తుతం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న వెంకటేశాన్ని ప్రభుత్వం నియమించింది. బుర్రా వెంకటేశం టిజిపిఎస్‌సి ఛైర్మన్‌గా నేడోరేపో తీసుకోనున్నారు.



## ఘనంగా పోలీస్ కృష్ణయ్య వర్ధంతి

**ప్రజాపక్షం / మద్దూర్ :** మలిదశ తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మద్దూరు మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ కృష్ణయ్య జయంతిని , వర్ధంతిని అధికారికంగా ప్రకటించాలని ప్రతి పోలీస్ స్టేషన్‌లో కిష్టయ్య చిత్రపటాన్ని పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య గోపాల్ , రాములు, నర్సిములు, సాయిలు, మహిపాల్ , భీమ్సేన్ , బాలచందర్ గౌడ్ , చందు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువుల కోసం దరఖాస్తులు

**ప్రజాపక్షం / నారాయణపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అల్ప సంఖ్యాక వర్గాల వారు విదేశాలలో పై చదువుల నిమిత్తం సిఎం ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం ద్వారా పోస్ట్ గ్రాజువెట్ డాక్టరల్ స్టడీస్ కొరకు మెరికా, ఆస్ట్రేలియా, లండన్ , కెనడా, ఫ్రాన్స్ , జర్మనీ, జపాన్ , న్యూజిలాండ్ , సౌత్ కొరిఇయా, సింగపూర్ దేశాలలో చదువులటకు అర్హత గల అబ్యర్థుల నుండి దరఖాస్తులు కోరారు. ఆగస్టు 1/8/24 నుండి డిసెంబర్ 31/12/24 కాలంలో అడ్మిషన్ తీసుకున్న అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్ సైట్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సమర్పించిన దరఖాస్తు జతపత్రాలు జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి, నారాయణపేట, కార్యాలయంలో సమర్పించాలన్నారు. విఇద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉండాలన్నారు. ఈ పథకం కింద ఎంపిక చేయబడిందన్నారు. ప్రతి విద్యార్థికి స్కాలర్ షిప్ , ఆర్థిక సహాయం కింద రూ. 20లక్షలు రెండు విడతలలో చెల్లించబడుతాయన్నారు. ఒక విమానం ప్రయాణం చార్జీ రూ. 60వేలు మించకుండా చెల్లించబడను. దరఖాస్తులు ఆన్ లైన్ తేదీ 1/12/24 నుండి 31/12/24 సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సమర్పించిన దరఖాస్తు జతపత్రాలు జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి, నారాయణపేట కార్యాలయంలో 20/1/25 లోగా సమర్పించాలన్నారు. వివరాలకు జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి, నారాయణపేట, కలెక్టరేట్ కాంప్లెక్స్ సంప్రదించాలన్నారు.

## వ్యాసరచన పోటీలు

**ప్రజాపక్షం / మద్దూర్ :** ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాల్లో నేడు విద్యా దినోత్సవంలో అన్ని ప్రభుత్వ , ప్రైవేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పై నిర్వహించడం జరిఇగింది. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతి ఎస్. సింధుజ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠసాల రేనివాట్ల, రెండవ బహుమతి శశాంక్ సాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దూర్ , మూడో బహుమతి ఎం. మౌనిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెర్ల తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలకిష్టప్ప, మద్దూరు మండల పిఆర్టీయూ సంఘం అధ్యక్షులు భాస్కర్ , వివిధ పాఠశాలల ఉపాదాయులు రాజునాయక్ , అనిల్ కుమార్ , నర్సిములు, మహ్మద్ ఇబ్రహీం, రవి, శ్రీనివాస్ , మద్వేష్ కుమార్ పాల్గొన్నారు.

**వీపనగండ్ల...**

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా విద్యాశాఖలో నిర్వహిస్తున్న కార్యక్రమాలలో వీపనగండ్ల మండల పరిధిలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 8 ఉన్నత పాఠశాలలు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నర్సింహ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని విద్యార్థుల్లో ఉన్నటువంటి సృజనాత్మకత నైపుణ్యాలు పెంపొందిస్తుందని ఆయన అన్నారు. ఈ పోటీ పరీక్షలల్లో మొదటి విజేతగా జయవర్ధన్ జడ్పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల వీపనగండ్ల నిలిచారు. రెండవ విజేతగా శ్రీవల్లి జడ్పీహెచ్ఎస్ తుంకుంట మూడవ విజేతగా ఆర్షియా కేజిబిఇవి వీపనగండ్ల విజేతలుగా నిలిచారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఆనంద్ రెడ్డి, శ్రీనివాసులు , చంద్రారెడ్డి, శ్రీనివాసులు, రాధా , సిఆర్పి వెంకటేష్ , నాగరాజు, శేఖర్ పాల్గొన్నారు.

## వికలాంగులకు ప్రభుత్వం అండగా నిలవాలి

**ప్రజాపక్షం/మదనాపురం :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం వికలాంగుల సమస్యలను పరిష్కరించి అండగా నిలవాలని ఎన్పీఆర్డి రాష్ట్ర నాయకులు కోటకొండ చెన్నయ్య తెలిపారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం సాయంత్రం జిల్లా కమిటీ సభ్యులతో వనపర్తి జిల్లా ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు వికలాంగులకు ఇచ్చిన హామీలను నీరు గార్చడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షులు ప్రభుస్వామి, కార్యదర్శి నర్సింహ, శ్యాం , సురేందర్ రెడ్డి, తిరుపతిగౌడ్ , బంగారయ్య, నాగమ్మ , లక్ష్మి , చిన్న, గట్టన్న, చీర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండుగ విజయవంతం

ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** కనీవినీ ఎరుగని రీతిలో రైతు పండుగకు పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చి సభను విజయవంతం చేసినట్లు డిసిసి అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గద్వాల్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు, రాష్ట్ర మంత్రి వర్యులు, ఎమ్మెల్యేలు. రైతు పండుగ సభకు రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. సభకు లక్ష మంది వస్తారనుకుంటే దానికి రెట్టింపు స్థాయిలో రైతాంగం సభకు హాజరవడం మా పట్ల రైతాంగానికి ఉన్న విశ్వసనీయత కు నిదర్శనమని అన్నారు. ప్రతిపక్షాలు మాపట ఎన్ని కుట్రపూరిత ప్రచారాలు చేసిన ప్రజానీకం ఆ ప్రచారాన్ని నమ్మలేదన్నారు. గత ముఖ్యమంత్రులు ఎవ్వరూ కూడా పాలమూరు జిల్లాను పట్టించుకున్న పాపాన పోలేదని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సంవత్సరానికి రూ.20 వేల కోట్లు 5 ఏళ్ల పాటు కేటాయిస్తామని ప్రకటించడం జిల్లా ప్రజలందరూ గర్వించాల్సిన అంశమని అన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సభను ఉద్దేశించి రైతులకు బెదిరించే సభగా అభివర్ణించడం సిగ్గుచేటన్నారు. నిన్నటి సభతో నిరంజన్ రెడ్డి కి మతిభ్రమించిందనారు. జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి పై మరోసారి నిరంజన్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరునీ అన్నారు. ముఖ్యమంత్రి జిల్లాకు లక్ష కోట్లు కేటాయిస్తామన్న ప్రకటనను స్వాగతించాల్సింది పోయి విమర్శించడం సహేతుకం కాదన్నారు. పాలమూరు కంటే ఒక సంవత్సరం తర్వాత ప్రారంభమైన కాళేశ్వరం పూర్తయింది కానీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న 14 అసెంబ్లీ సీట్లలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ ప్రాంత ప్రజలు గెలిపించిన విషయాన్ని బిఆర్ఎస్ పార్టీని మట్టి కరిపించిన సంగతి ఆ పార్టీ నాయకులు గుర్తించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పాలమూరు అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారని ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కృతనిచ్చేయంతో ఉన్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామల రూప రేఖలు మారుతాయి టిపిపిసి ఉపాధ్యక్షులు, టిజి ఎంఎఫ్ సి చైర్మన్ కొత్వాల్ జిల్లాకు ఏడాదికి రూ.20 వేల కోట్ల కేటాయింపుతో ఉమ్మడి జిల్లాలోని గ్రామాల రూప రేఖలు మారుతాయని, పేదరికం రూప రేఖలు మారుతాయని, పేదరికం పోతుందని టిపిసిసి ఉపాధ్యక్షులు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. రైతు పండుగ సభ చరిత్రలో నలిచిపోతుందని అన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్న సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహ రెడ్డి, డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు జహీర్ అక్తర్, సిరాజ్ ఖాద్రీ, రాములు యాదవ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆల్ ఇండియా లాన్ టెన్నిస్ పోటీల్లో తెలంగాణకు బంగారు పథకం

**ప్రజాపక్షం / నారాయణపేట :** బెంగళూరులో జరిగిన 25వ ఆల్ ఇండియా నేషనల్ పోలీస్ లాన్ టెన్నిస్ డబుల్స్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుండి మల్టి జోన్ 1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి , నారాయణపేట జిల్లా అడిషనల్ ఎస్పీ ఎండి. రియాజ్ హుల్ హక్‌లు లాన్ టెన్నిస్ ఫైనల్ లో స్వర్ణ ప థకం సాధించారు. 50 ప్లేస్ లో తెలంగాణ జట్టుకు ఆంధ్రప్రదేశ్ జట్టుతో పోటీ పడగా ఫైనల్ విజయం సాధించారు.

## బాలమల్లేష్ మృతి సిపిఐకి తీరనిలోటు




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** సిపిఐరాష్ట్ర సహాయకార్యదర్శి బాలమల్లేష్ మృతి సిపిఐపార్టీకి తీరనిలోటు అని సిపిఐనాయకులు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాదగ్గర కామ్రేడ్ బాలమల్లేష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్రసమితిసభ్యులు హెచ్.ఆనంద్‌జి, వార్లవెంకటయ్యలు మాట్లాడుతూ, పార్టీలో ఏపని అప్పజెప్పిన వీరసైనికుడిగా పనిని స్వీకరించి పూర్తిచేసేవారన్నారు. అన్ని వామపక్ష పార్టీలను , మేధావులను, సామాజిక కార్యకర్తలను సమన్వయంచేసే విషయంలో అలుపెరగకుండా కృషిచేశారు. బాలమల్లేష్ తన జీవితం మొత్తం పార్టీకే అంకితంచేశారన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా ప్రధానకార్యదర్శి శివశంకర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ , మహిళాసంఘం జిల్లా అధ్యక్షురాలు కందూరి వెంకటమ్మ, ఎఐకెఎస్ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణాజి, బికెఎంయు జిల్లా అధ్యక్షులు రవీందర్, సిపిఐనాయకులు కపిలవాయిగోపిచారి, కొత్తరామస్వామి, కొట్రశేఖర్, వాదాల కృష్ణయ్య, మల్లమ్మ, రాఘవులు పాల్గొన్నారు.

**దళిత హక్కుల పోరాట సమితి దిగ్భ్రాంతి**

సిపిఐరాష్ట్ర సహాయ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బాలమల్లేష్ అకాలమరణంపట్ల దళితహక్కుల పోరాటసమితి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేసింది. ఆదివారం తాడూరు మండలకేంద్రంలో ఆఫీస్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ముభరత్ మాట్లాడుతూ విద్యార్థిదశ నుండి వామపక్ష ఉద్యమాలవైపు మరలితుదిశ్వాసవిడిచే వరకు వివిధ హోదాలలో బాధ్యతలు రాష్ట్రస్థాయిలో ఆయన అనేకసేవలు పార్టీకి ప్రజాసంఘాలకు అందించారు. ఆయన గుండెపోటుతో మృతిచెందడం సిపిఐ ఉద్యమానికి ప్రజాసంఘాలకు తీరనిలోటని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఆశయసాధనకోసం ముందుకుసాగడం ప్రజాసంఘాలను విస్తరింపచేయడం, పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం తద్వారా ప్రజాసమస్యల పరిష్కారంకోసం సమరశీల పోరాటాలను ఉధృతంచేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు లక్ష్మయ్య, కృష్ణయ్య, నాగరాజు,శివుడు, ఆంజనేయులు, అరవింద్, బహుగుణ, వెంకటయ్య, కేశవులు, రాములు, సుల్తాన్ పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు సస్పెండ్, ప్రిన్సిపాల్‌కు నోటీసులు

**ప్రజాపక్షం/ నిడమనూరు:** నిడమనూర్ మోడల్ స్కూల్ లో విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు డి ఆంజనేయులు టిజిటి (సోషల్) ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి బి.భిక్షపతి శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు, అదేవిధంగా విద్యార్థినీల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించిన నిడమానూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు, విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు ఉత్తర్వులు అమలులో ఉన్న సమయంలో హెడ్ వాటర్స్‌ను వదిలి వెళ్ళవద్దని, సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడిన నాటినుండి క్రమశిక్షణ చర్యలు ముగిసే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని జిల్లా విద్యాధికారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అలరించిన ఘంటసాల పాటల పోటీలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** గానం అనేది ప్రతి హృదయాన్ని కదలించే ప్రతిభ అని జిల్లా కెమిస్ట్రి అండ్ డ్రగ్స్ అసోసియేషన్ అధ్యక్షులు యామా ప్రభాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో శ్రీ జ్ఞాన సరస్వతి సంస్కృతిక కళావేదిక జిల్లా అధ్యక్షులు బుర్రి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండా రమేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిసిన పాటల పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినీ సంగీత ప్రపంచానికి మార్గదర్శకుడు గంఠసాల అని అన్నారు. అనంతరం గంటసాల 102 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుండి 70 మంది గాయకులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 4న బహుమతులను ప్రధానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎండి హమీద్ ఖాన్, న్యాయనిర్ణేతలు కల్లూరి నాగయ్య, దేవులపల్లి ప్రశాంతి, కవిత పాల్గొన్నారు.

## సర్వీస్ రోడ్డులో కూల్చివేతలు



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మించనున్న నేపథ్యంలో పట్టణం ఇరువైపుల సర్వీస్ రోడ్డులో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు నిర్ణయించిన కొలతల లోపల ఉన్న కట్టడాలను అధికారులు కూల్చివేతల కార్యక్రమాన్ని చేపట్టారు. గత మూడు రోజులుగా కూల్చివేతల కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. అంతకు ముందు భవనాల యజమానులకు అధికారులు తమ కట్టడాలను కూల్చివేసుకోవాలను సూచనలు చేయడం జరిగింది. కూల్చివేయని కట్టడాలను యంత్రాల ద్వారా కూల్చివేస్తూ వస్తున్నారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం కోసం వాహనాల రాకపోకలను నిలిపి వేసి సర్వీస్ రోడ్డు వెంట రాకపోకలను కొనసాగిస్తారు.

## ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ర్యాలీ




**ప్రజాపక్షం / గద్వాల :** జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆదివారం అనంతరం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో డిఎంహెచ్ఓ సిద్దప్ప, డిఎల్ఎస్ఏ సెక్రెటరీ జడ్జి గంటా కవిత తో కలసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుండి పాత డి.ఎం.హెచ్.ఓ కార్యాలయం వరకు వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కాలేజి విద్యార్థులు, ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి గురించి అవగాహణ కల్పించే నినాదాలు ఇస్తూ ర్యాలీని నిర్వహించారు. అనంతరం జడ్జి గంటా కవిత, డిఎంహెచ్ఓలు మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ వ్యాధి పరిమితిని తగ్గించుటలో ఎన్జీవోల సేవలు ఉన్నతమైనవి అని అన్నారు. అనంతరం డిఎంహెచ్ఓ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరెండెంట్ ,ఆర్ఎంఓల చేతుల మీదుగా ఎన్జీవో,హెల్త్ వర్కర్లకి అప్రిసియేషన్ సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ ప్రోగ్రా ఆఫీసర్లు డా.రాజు, డా.నవీన్‌కుమార్ రెడ్డి,జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు,మెడికల్ సూపరెండెంట్ డా.వినోద్, ఆర్.ఎం.ఓ డా.ప్రియాంక,సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి.ఇందిర,అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డా.మాధుర్య,మరియు డా.ఎంజిల్, నర్సింగ్ కాలేజి ప్రిన్సిపల్ తదితరుల పాల్గొన్నారు.

## 4నుంచి పత్తి కొనుగోలు బంద్

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** శ్రీ వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో పత్తి నిలువ చేసుకోవడానికి స్థలం లేనందున 4తేదీ డిసెంబర్ నుంచి 8 తేదీ వరకు సీసీఐ ద్వారి పత్తి కొనుగోలు మందు చేసినట్లు అల్లంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎల్లాస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లో ఉండవెల్లి మండల పరిధిలోని శ్రీ వరసిద్ధి వినాయక కాటన్ మిల్లు లో సీసీ ఐ ద్వారా ప్రభుత్వ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటునకుండా కాటన్ మిల్లులో పత్తిని విలువ లేకుండా నిల్వయున్న పత్తి మొత్తాన్ని జన్నింగ్ చేసి నా అనంతరం మళ్ళీ కొనుగోలు చేస్తామన్నారు. 9వ తేదీ నుంచి మళ్ళీ కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వాళ్ళు పేర్కొన్నారు. టోకెన్లు ఇచ్చేవరకు కొనుగోలు చేయడానికి వెళ్లలేదని టోకెన్లు ఇచ్చే సమయాన్ని కేటాయిస్తామని అందుకు రైతులు సహకరించాలని కోరారు.

## విద్యార్థులకు బహుమతులు



**ప్రజాపక్షం / అయిజ :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా విద్యయే ప్రగతికి తొలిమెట్టు అనే కార్యక్రమం ద్వారా పునరుద్ధింపదగిన శక్తి వనరులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గెలుపొందిన వారిలో 1. వ బహుమతి అమర్‌నాథ్ ( జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల) 2.వ బహుమతి కార్తిక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సింధనూర్ 3.వ బహుమతి శైలజ కస్తూరిబా ఉన్నత పాఠశాల అయిజ, విద్యార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింధనూరు ఎఫ్ ఏసి హెచ్.ఎం భద్రయ్య, తిమ్మప్ప, వెంకటస్వామి పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** విద్యాభివృద్ధినే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇమాంపేట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతుల నిర్వహణతో పాటు విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రభలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పాఠశాలను దత్తత తీసుకోని రూ. 10లక్షల విలువైన సామాగ్రిను విద్యార్థులకు అందజేసినట్లు గుర్తు చేశారు. స్ప్రెడ్ ఇండియా, సువేన్ ఫార్మాసుటికల్ గ్రూప్స్, యువ అన్ స్టాపబుల్ ఆర్గనైజేషన్ వారి ఆర్థిక సాహాయం రూ. 7లక్షలతో పాఠశాలకు ప్రహారీగోడ, ఆట స్థలం, ఆట వస్తువులు, కాంపౌండ్ వాల్ గేట్, పాఠశాల లైటింగ్ బోర్డు పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్, జిల్లా విద్యాధికారి అశోక్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన -ప్రజా విజయోత్సవాలలో భాగంగా '2కె రన్'





**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** విద్యారంగంలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని భవిత్ జూనియర్ కళాశాల వద్ద ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన 2కె రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గత సంవత్సర కాలంగా విద్యారంగంలో సాధించిన విజయాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి రామచంద్ర రావు, ప్రిన్సిపాల్ శ్రీరామన్నారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మొదటి రోజు 2కె రన్‌ను ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ భువనగిరి జూనియర్ కళాశాల (బాలుర) నుండి భువనగిరి ఖిల్లా వరకు రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి మట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వము ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతోందని డిసెంబర్ 1 నుండి 9వ తేదీ వరకు జరిగే అన్ని కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి రోజు 2కె రన్ ప్రోగ్రాం చాలా విజయవంతంగా నిర్వహించామని ఇదే స్ఫూర్తితో జిల్లా అధికారులు వారి వారి షెడ్యూల్స్ ప్రకారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలని తెలియజేస్తూ ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమీషనర్ రామాంజనేయ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి కే.ధనంజనేయులు, హెరిటేజ్ కమిటీ సభ్యులు వెంకట్ రెడ్డి, అంజయ్య, దిడ్డి బాలాజీ, జిల్లా అధికారులు మరియు సిబ్బంది, నవభారత్ యువజన సంఘం నాయకులు కరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెసిడెన్సియల్ పాఠశాలల తనిఖీలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** జిల్లాలోని ఇమాంపేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్, కెజిబివి సూర్యాపేట, నేరేడుచర్ల మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బాలుర, కోదాడ, తుంగతుర్తి రెసిడెన్సీయల్ పాఠశాలను ఆదివారం తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ వెంకటేష్ తనిఖీ చేశారు. పాఠశాలల్లోని వంట గదులు, హాస్టల్ భవనం, కూరగాయలు, నిల్వ ఉన్న వంట సామాగ్రిని పరిశీలించారు. మెను ప్రకారం విద్యార్థులకు సుచి, రుచికరమైన ఆహారం అందించాలన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని విధుల్లో ఉండే ఎఎన్ఎం ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సంక్షేమ శాఖల అధికారులు జనార్ధన్, శ్రవణ్ కుమార్, పూలన్, మండల విద్యాధికారులు సలీం షరీఫ్, చత్రు నాయక్, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## బావిలో పడి సమీకృత బాలుర వసతి విద్యార్థి మృతి



**ప్రజాపక్షం/అనంతగిరి:** బావిలో పడి సమీకృత బాలుర వసతి గృహ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం శాంతినగర్ గ్రామ సమీకృత బాలుర వసతిగృహంలో గుగులోతు తిరుమలేష్ (15) పదవ తరగతి విద్యార్థి, అదే హాస్టల్‌లో ట్యూషన్ ట్యూటర్‌గా పనిచేస్తున్న బత్తిని వీరబాబు అనే వ్యక్తి తన సొంత పొలంలో టేలంలో తొలగించడానికి తీసుకెళ్లాడనే ఆరోపణలున్నాయి. ఆ బాలుడు చెట్లు తొలగిస్తున్న సమయంలో కాలుజారీ బావిలో పడి ఊపిరాడక విద్యార్థి తిరుమలేష్ మృతి చెందాడని తెలిపారు. విద్యార్థి సొంత గ్రామం చింతల పాలెం మండలం నక్కా గ్రామవాసి అని తెలిపారు. దీంతో పోలీసులు, రిస్కటీం వారు అక్కడకు చేరుకుని బావిలో మృతి చెందిన విద్యార్థి మృతదేహన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ట్యూషన్ మాస్టర్ బత్తిని వీరబాబు పరారీలో ఉన్నాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 3 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపాలిటి పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో ఈ నెల 3 నుంచి 9 వరకు విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ తెలిపారు. ఈనెల 3 నుంచి 9 వరకు ఆరు రోజుల పాటు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, తెలంగాణ అమరవీరుల స్థూపం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, జాతీయ నాయకుల విగ్రహాలను విద్యుద్దీపాలతో అలంకరించనున్నట్లు తెలిపారు. పట్టణంలో 2కె రన్, మున్సిపల్ పనులు, మహిళాశక్తి యూనిట్ల ప్రారంభోత్సవం, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, పట్టణ ప్రముఖులు, ప్రముఖ నాయకులతో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలి, చెత్తాచెదారం తొలగింపు, ముగ్గుల పోటీలు, మున్సిపల్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం, పబ్లిక్ టాయ్‌లెట్స్, ప్రభుత్వ పాఠశాలలు, మత, చారిత్రాత్మక కట్టడాల, సంబంధ ప్రార్థన ప్రదేశాల వద్ద స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, భద్రత సామాగ్రి పంపిణి, మహిళా శక్తి కింద స్వయం సహాయక మహిళలకు బ్యాంక్ లింకేజి చెక్కుల పంపిణి, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట శానిటరి ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ శ్వేతలు ఉన్నారు.

## జిల్లా కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ:** పేదలకు, చదువుకునే విద్యార్థులకు సహాయం చేయడంలో కోమటిరెడ్డి బ్రదర్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలు అన్నారు. ఆదివారం ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఎన్‌జి కళాశాలలో నిర్వహిస్తున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్ సీజన్5 క్రికెట్ టోర్నమెంట్ కు వారు ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పేదలకు, పేద విద్యార్థులకు సహాయం చేయడంలో కోమటిరెడ్డి బ్రదర్స్ ముందుంటారని అన్నారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు కేసాని వేణుగోపాల్ రెడ్డి, ఆంగోతు ప్రదీప్ నాయక్, బోనగిరి ప్రభాకర్, ముత్తినేని నాగేశ్వరరావు, జూలకంటి శ్రీనివాస్, ఆలకుంట్ల మోహన్ బాబు,బొజ్జ శంకర్, ఇంతియాజ్, బోగరి ఆనంద్, ఏర్పుల రవి, ఆమేద్, జానయ్య, మధుసూదన్ రెడ్డి, పున్న గణేష్, ఎడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మున్నూరు కాపులు రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మున్నూరు కాపులు రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని మామిడితోటలో నిర్వహించిన కార్తీకమాస వన సమారాధన కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్లేపల్లి వెంకటేశ్వర్లు తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలలో అధిక శాతం జనాభా కలిగిన మున్నూరు కాపులు కాజకీయంగా ఎదగలేకపోవడం వల్ల ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబాటుతనానికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్నూరు కాపులు తమ పిల్లల భవిషత్తు కోసం వారిని బాగా చదివించాలని,ఆ తర్వాత వివిధ వ్యాపార రంగాలలో రాణించే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. ముఖ్యంగా చదువుకున్న మున్నూరు కాపు యువత రాజకీయాల్లో అడుగు పెట్టి అవినీతి, బంధుప్రీతి ఆశ్రితపక్షపాతంతో కునారిల్లిపోతున్న రాజకీయాలను ప్రక్షాళన చేయాలని తద్వారా రాష్ట్రానికి,దేశానికి మంచిపాలకులు వస్తారని దాంతో దేశం సుభిక్షం అవుతుందని అందుకు మున్నూరు కాపులు చొరవ చేయాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మున్నూరుకాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, స్థానిక మంత్రి మున్నూరు కాపుల అభివృద్ధికి చేయూత అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ధూళిపాళ ధనుంజయ్ నాయుడు అధ్యక్షత వహించగా, ధూళిపాళ శ్రీనివాస్ నాయుడు ఆహ్వానితులకు స్వాగతం పలికారు. చదల సత్యనారాయణ,గాలి శ్రీనివాస్ రజనీకాంత్,వూస రఘు,కోలపాటి వెంకటేశ్వర్లు,కె.వి.ఎన్ మూర్తి,బాల వెంకటేశ్వర్లు,దేవిశెట్టి రామూర్తి, రాయల వెంకటేశ్వర్లు,మేకల వెంకటేశ్వర్లు,కొట్టు శేఖర్ పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ప్రశాంతత




**ప్రజాపక్షం/సూర్యాపేట:** పని వత్తిడితో సతమతమయ్యే అధికారులకు క్రీడలు మానసిక ప్రశాంతతను ఇస్తాయని అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా పాండు నాయక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం కుడకుడ రోడ్డులోని మైదానంలో మూడవ సంవత్సరం స్పోర్ట్స్ మీట్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు అధికారుల మధ్య స్నేహాభావాన్ని పెంపొందిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలన ఉత్సవాల్లో తమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పదవీ విరణ పొందిన అధికారులను తిరిగి శాఖలో రెగ్యూలర్ పోస్టులను కేటాయించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో హైద్రాబాద్ ఇంజనీరింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొమ్ము స్వామి, రాష్ట్ర నాయకులు పల్లె పిచ్చయ్య, రామకృష్ణ, సంఘం నాయకులు మల్సూర్, రవి, లింగయ్య, వాజీద్, డిఈలు రమేష్, చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తుకై శ్రమించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వారోత్సవాలలో భాగంగా ఆదివారం మండల విద్యాధికారి పి.ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో పోచంపల్లి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను బహుమతులను ప్రధానం చేసి మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు పాటిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. మండల స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించాలని ఎంఈఓను కోరారు. బహుమతి ప్రధానోత్సవానికి తాను కూడా హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కలెక్టర్ గణిత సబ్జెక్టు పై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిట్టి పోలు విజయలక్ష్మి శ్రీనివాస్, ఎమ్మార్వో మహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డివెంకటరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని పాల్గొన్నారు.

## సిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన అర్జున్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణనకు ప్రభుత్వం సహకరించినందుకుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం బీసీ కులగణనను ఏర్పాటు చేశారని, అదేవిధంగా బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు, గ్రామపంచాయతీల్లో 50శాతం రిజర్వేషన్లు ప్రకటించి బీసీలకు సముచిత స్థానం కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎంను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వట్టె జానయ్య పాల్గొన్నారు.

# అకాల వర్షాలు.. అన్నదాతకు కష్టాలు

### నేలకొరిగిన వరి

### ధాన్యం ఆరక రైతన్నల దిగులు...

### స్తబ్ధుగా ధాన్యం కొనుగోలు...



**ప్రజాపక్షం/ హాలియా :** అకాల వర్షాలు అన్నదాతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అసలే తేమ రాక ధాన్యం ఆరబోతలో అవస్థలు ఎదుర్కొంటున్న అన్నదాతలకు ఈ అకాల వర్షాలు మరింత ఆవేదన కలిగిస్తున్నాయి. సాగర్ ఆయకట్టులో కోతలు చివరిదిశకు చేరుకున్న సమయంలో ఈ అకాల వర్షాలు రైతులకు శాపంగా మారాయి. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాల్లో స్తబ్దత నెలకొనడంతో ఆశించిన మేర ధాన్యం కొనుగోలు జరగడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని పరీక్షించే యంత్రాలు సరిగా పనిచేయక పోవడంతో రైతులు మిల్లులను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకున్న కొందరు మిల్లర్లు రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి అనేక రకాల కొర్రీలు పెట్టి వ్యాపారులకు నచ్చిన రీతిలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇది చాలదన్నట్టు అకాల వర్షాలు రైతులను మరింత ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ధాన్యంలో తేమ శాతాన్ని తెచ్చేందుకు రైతులు రహదారులపై వరి ధాన్యం ఆరబోసి తేమ కోసం పాట్లు పడుతుంటే ఈ అకాల వర్షాలు వారిని మరిన్ని కష్టాల్లోకి నెట్టాయి. మిల్లుల వద్దకు పోయిన ధాన్యానికి మీ ధాన్యంలో పచ్చి గింజ ఉందని, తాలు అధికంగా ఉందని ఉన్న రేటుకు క్వింటాలుకు రూ.500 మేర కోత పెడుతూ ఇబ్బంది పెడుతున్నట్లు రైతులు బహిరంగంగా చెబుతున్న వారి గోడు పట్టించుకునే దిక్కే లేకుండా పోయింది. మరో మూడు రోజులపాటు వర్షాలు ఉన్నాయనే వార్తలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రైతుల గోడు ఆలకించి పౌర సరఫరాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మిల్లుల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని వారికి న్యాయం చేసేలాగా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలి

**ప్రజాపక్షం/గుండాల :** రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మధ్యాహ్నన భోజనానికి సంబంధించి నిధులు పెంచాలని, చాలి చాలని నిధులతో మధ్యాహ్న భోజన పథకాన్ని వెల్లదీస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్ని భోజనానికి నిధులను

## అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి కష్టాలు

హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హయత్ నగర్ డివిజన్‌లో అధికారుల నిర్లక్ష్యంతోనే కాలనీ వాసులకు తాగు నీటి కష్టాలు పెరుగుతున్నాయని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం డివిజన్‌లోని పద్మావతి కాలనీలో పర్యాటించి కాలనీ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో పర్యాటించి సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి సూపర్వైజర్ రమేష్, లైన్‌మెన్ యాదగిరి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/ చంపాపేట:** ఎల్బీనగర్ పాత గ్రామానికి చెందిన సంతోష్ అనారోగ్యం వలన ఓ ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డిని కలిసి తనకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేయాలని విన్నవించారు. దీనికి స్పందించిన రాజశేఖర్‌రెడ్డి రూ.60వేల మంజూరు చేయించి ఆదివారం వార్డు కార్యాలయం లబ్ధిదారుడు సంతోష్‌కు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, గడ్డి అన్నారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమాచారీ, కందికంటి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యతో విద్యార్థులకు భవిష్యత్

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఉన్నత విద్యాను అభ్యసిస్తేనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన మండల స్థాయి పోటీలను హయత్ నగర్ మండల తహశీల్దార్ జానకి, మండల విద్యాధికారి శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు, పాటలతో పాటు చదువుల్లో రాణించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధతో విని క్రమశిక్షణతో మెలగాలని కోరారు. అనంతరం వ్యాసరచనలో గెలుపొందిన విద్యార్థులకు నగదు 5వేల రూపాయలు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దినేష్, హయత్ నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా, వనస్థలిపురం ప్రధానోపాధ్యాయురాలు దుర్గాలత, ఎపిపిసి కమిటీ చైర్మన్ మమత, ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివశంకర్ గౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పక్షాన పోరాడుతాం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్ నగర్:** మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలంలో రూపుదిద్దుకోనున్న ఫ్యూచర్ సిటికై ఏర్పాటు కానున్న 300 ఫీట్ల రోడ్డు కోసం భూములను కోల్పోతున్న రైతులు ఆదివారం కేంద్ర మంత్రివర్యులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డిని వారి నివాసంలో కలిసి తమ ఆవేదనను తెలియజేస్తూ, తమకు అండగా నిలబడాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇష్టం లేకుండా భూసేకరణ చేపట్టే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, రైతులు ఎవరూ కూడా అధైర్య పడొద్దని వారికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, మాదారం రమేష్ గౌడ్, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాలకు ప్రభుత్వం అండ

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: శెట్టిబలిజ కులస్తులను ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఆదివారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీ చత్రపతి శివాజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన గౌడ, శెట్టిబలిజ కులస్తుల కార్తీకమాస వనభోజన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య వచ్చిన తాను అండగా ఉండి పని చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత శెట్టిబలిజ కులస్తులను గత ప్రభుత్వం బీసీ జాబితా నుంచి తొలగించి రిజర్వేషన్లు వర్తించకుండా అన్యాయం చేసిందన్నారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహ యాదవ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, గౌడ శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు పీవివి సత్యనారయణ, పంపన వెంకటేశ్వరరావు, చింతపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడ పిల్లల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ సార వినయ్‌కుమార్ గౌడ్




**ప్రజాపక్షం/కొత్తూరు:** ఆడ పిల్లల ఆత్మరక్షణకు కరాటే విద్య ఎంతో అవసరమని, శారీరకంగా మానసికంగా ఎంతో ఉపయోగపడుతుందని అమ్మ మెమోరియల్ చారిటబుల్ పౌండేషన్ చైర్మెన్ సార వినయ్‌కుమార్ గౌడ్ వివరించారు. ఆదివారం కొత్తూరు మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో కరాటే మాస్టర్ శివకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని సందర్శించి కరాటే కిక్ బాక్సిండ్ బ్యాగు, హ్యాండ్ గ్లౌజ్‌ల సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు కరాటే విద్యను నేర్చుకునేందుకు కృషి చేయాలని, ఆత్మ రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. క్రమశిక్షణతో కరాటే విద్యను నేర్చుకుంటే ఆత్మ రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని, మండల, రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## అవగాహనతోనే వ్యాధుల నిర్మూలన

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు








**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** అవగాహనతోనే వ్యాధుల నిర్మూలన సాధ్యమని, ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డిస్టిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి/ ఎయిడ్స్(ది)సంయుక్తగా మహాత్మ జ్యోతిబాపూలే బిసి హాస్టల్ బాలికలు, మన్సూరాబాద్, ఎల్.బి నగర్‌లో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించాలి కానీ, వ్యాధిగ్రస్తులను కాదన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలందరు ప్రజలలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. హెచ్ఐవి వ్యాధి ఎక్కువ కాకుండా మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాపారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎల్బీనగర్) డాక్టర్ చంద్రశేఖర్, బిసి హాస్టల్ ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్ :** ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎఎన్ఎంలు కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఫరూఖ్‌నగర్‌లోని గాంధీ విగ్రహం వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ కలుషితమైన రక్తం, సూదుల వల్ల ఎయిడ్స్ వ్యాధి వచ్చే అవకాశాలు ఉంటాయని సూచించారు. వ్యాధి వచ్చిన వారితో మాట్లాడటం, కలిసి తిరగడం, కలిసి భోజనం ద్వారా ఎయిడ్స్ రాదని పేర్కొన్నారు. ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించే బాధ్యత ప్రజలందరిపై ఉందని, వ్యాధిపై అవగాహనకు వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో ప్రచారం చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ఎహెచ్‌పి వైద్యాధికారిని ప్రవీణ, హెల్త్ సూపర్ వైజర్లు శ్రీరామ, చంద్రకళ, ల్యాబ్ టెక్నిషియన్ అశోక్, హెల్త్ అసిస్టెంట్ రెడ్యానాయక్, రమేష్, రవికుమార్, మల్లేష్ ఉన్నారు.

## విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు

ప్రొఫెసర్ హరగోపాల్ వినతి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వ విద్యారంగ వ్యవస్థలకు రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని సాయిరాజా పంక్షన్ హాలో డిటిఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జి.చంద్రారెడ్డి ఉద్యోగ విరమణ విద్యా సదస్సుకు ముఖ్యఅతిథిలుగా ప్రొఫెసర్ హరగోపాల్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పోరేట్‌కు ధీటుగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత పాలకుల మాదిరిగా కాకుండా ఇప్పుడైనా విద్యకు బడ్జెట్‌లో భారీ స్థాయిలో నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని, అప్పుడే పేద విద్యార్థులకు న్యాయం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు భవిష్యత్ బంగారుమయమే కావడంతోపాటు జీవితంలో ఉన్న స్థాయికి చేరుకునే అవకాశాలు ఉంటాయని వివరించారు. విద్యతోపాటు పౌష్టిక ఆహారం అంధించేందుకు చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు విద్యకే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, పురుషోత్తంరెడ్డి, అశోక్, మండల విద్యాధికారి మనోహార్ తదితరులు పాల్గొన్నారు.

## అశాస్త్రీయంగా జిల్లాలు, మండలాలు, పంచాయతీల ఏర్పాటు : ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అశాస్త్రీయంగా జిల్లాలు, మండలాలను, గ్రామ పంచాయతీలను గత పాలకులు ఏర్పాటు చేశారని.. పాలన పేరుతో వ్యవస్థల్లో విధ్వంసం సృష్టించారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ నూతనంగా పంచాయతీలు, మండలాలు ఏర్పాటు చేశారని, కానీ మౌళిక సౌకర్యాలు లేక అధికారులు, పాలకులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. కొన్ని పంచాయతీలను బలవంతంగా ఏర్పాటు చేయడంతో ప్రజలు మాకొద్దు అంటూ ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలపై ప్రభుత్వంతో మాట్లాడతానన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నందని నేటికి స్పష్టత ఇవ్వడం లేదని జర్నలిస్టులు ఎమ్మెల్యేను అడుగగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చేది పక్కా అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెర్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నేతలు రఘు, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, చించోడు అనంతం, లింగారెడ్డిగూడ అశోక్, రాయికల్ శ్రీనివాస్ ఉన్నారు.

## 'క్రెడిబుల్ రాన్వే ఫ్యాషన్ వాక్' పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** మన సంస్కృతిని తరువాతి తరానికి తెలియజేసేందుకు కృషి చేయాలని తెలంగాణ ఫిలిం డైరెక్టర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీ కస్తూరి శ్రీనివాస్ అన్నారు. మిర్యాల ఉప్పు మాడల్ అండ్ యాడ్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే 'క్రెడిబుల్ రాన్వే ఫ్యాషన్ వాక్' ఫ్యాషన్ షోకు సంబంధించిన పోస్టర్‌ను కస్తూరి శ్రీనివాస్‌తో పాటు బిఎంసి ప్రొడక్షన్ ప్రొడ్యూసర్ విజయకుమార్, మ్యూజిక్ డైరెక్టర్ రమణ ఓగేటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అనిల్ కుమార్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు మాడల్స్ అండ్ డిజైనర్స్, మేక్ ఓవర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** నిరుద్యోగ ఔత్సాహిక యువతకు ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను జిఎంఆర్ ఏరో అకాడమీ, ఎటిఎఫ్ఎస్, బిగ్ బ్రదర్ సంస్థలు సంయుక్తంగా కలిసి ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు బిగ్ బ్రదర్ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్ వ్యవస్థాపకులు సయ్యద్ అస్కరి, ఎటిఎఫ్ఎస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి రాహుల్ పులుపూడి తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ విమానయాన రంగ అవసరాలకు అనుగుణంగా పటిష్ఠమైన శిక్షణా కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. విమానాశ్రయంలో సర్టిఫికేషన్, ఎయిర్‌లైన్ అండ్ కార్గో ఆపరేషన్స్ (సిఎసిఒ), కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ (సిసిఎస్ఇ), కార్పొరేట్ రెడినెస్ ప్రోగ్రామ్ సర్టిఫికేషన్ (సిసిఆర్‌పి) వంటి కోర్సుల్లో అభ్యర్థుల విద్యార్హతలను బట్టి శిక్షణను ఇంగ్లీష్ బోధనలో మూడు నెలలపాటు అందిస్తామని వివరించారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం, విమానయానరంగంలో ఉద్యోగ, ఉపాధి కల్పనకు సహకరిస్తామని తెలిపారు. ఉవివరాలకు 7093116004 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా కూచిపూడి నాట్య శిక్షణా ముగింపు వేడుకలు

**ప్రజాపక్షం/ ఖైరతాబాద్:** ముప్పై రోజుల సైద్ధాంతిక కూచిపూడి నాట్యశిక్షణా శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన ఈ ముగింపు వేడుకలో గత అక్టోబర్ 27 నుంచి 30 రోజుల పాటు తాము నేర్చుకొన్న వివిధ అంశాలపై విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం నాట్య గురువులు కోకా విజయలక్ష్మి, జి.రవి కూచిపూడి మధుమతి కులకర్ణిని సన్మానించారు. కార్యక్రమంలో మా ఆకాడమీ అధ్యక్షులు సంగనభట్ల నరసయ్య, నృత్య గురువు డా.పంతుల ఇందిరా హేమ, సభ్యులు సిహెచ్‌నారాయణమూర్తి పాల్గొన్నారు.



## బాలమల్లేష్ మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య







**ప్రజాపక్షం/నార్సింగి:** బాలమల్లేష్ మృతి ప్రజాఉద్యమాలకు తీరనిలోటని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ కేంద్రంలో బాలమల్లేష్ చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. ఈసందర్భంగా జంగయ్య మాట్లాడుతూ బాలమల్లేష్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శిగా పనిచేశారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. ఆయన మృతితో సిపిఐ అంకితభావం కలిగిన నాయకుడిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, యాదగిరి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శిలు దత్తునాయక్, సత్యనారాయణ, గిరిజన సమైక్య జిల్లా ప్రధానకార్యదర్శి శివప్రచండ, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, వివిధ సిపిఐ మండలాల కార్యదర్శిలు నర్రగిరి, పల్నాటి యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, సుధీర్, జంగయ్య, శ్రీను, సత్తిరెడ్డి, మహిళా సంఘం నాయకురాలు మంజుల పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తెలంగాణ వ్యవసాయ కార్మిక పంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎన్.బాల మల్లేష్ గుండెపోటుతో మరణించడం బాధకరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆదివారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల మల్లేష్ మృతి సిపిఐకి, బికెఎంయుకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నందిగామ మండల కార్యదర్శి గడ్డం జంగయ్య, చౌదరిగూడ మండల కార్యదర్శి భాగాళ్ల నరసింహ్మా, వ్యవసాయ కార్మిక సంఘం షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షులు ఎం.కృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, ఉపాధ్యక్షులు రాజు నాయక్, ఏఐటియుసి ఫరూఖ్‌నగర్ మండల కార్యదర్శి చంద్రబాబులు ఉన్నారు.

**తుర్కయాంజల్:** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాలమల్లేష్ మరణం సిపిఐకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. ఆదివారం తూర్కయంజాల్ కూడలిలో బాలమల్లేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓరుగంటి మాట్లాడుతూ బాల మల్లేష్ విద్యార్థి ఉద్యమం నుంచి పని చేస్తూ అంచెలంచాలుగా ఎదుగుతూ సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎదిగారన్నారు. జిల్లాలో అనేక భూసమస్యలపై పేద ప్రజల ఇండ్లు, ఇళ్ల స్థలాల సమస్యల పైన అలుపెరుగని పోరాటాలు చేసారన్నారు. కార్యక్రమంలో కొండిగారి శివ కుమార్, అల్లిమ్మదీన్, ఇదులకంటి అనురాధ, వట్టి విజయా, సుందరమ్మా, శ్రీకాంత్, శ్రీనివాస్, పూల యాదయ్య రాజు, నాగేశ్వర్, పాల్గొన్నారు

**రాజేంద్ర నగర్ :** రాజేంద్ర నగర్ ఎన్ఐఆర్‌డి కమాన్ అంబేడ్కర్ చౌరస్తాలో బాలమల్లేష్ చిత్రపటానికి నియోజకవర్గ సిపిఐ నాయకులు బండి నరసింహ్మా పూల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బండి నరసింహ్మా మాట్లాడుతూ బాలమల్లేష్ మృతి ప్రజాసంఘాలకు తీరని లోటన్నారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె.ఆనంద్‌గౌడ్, రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె.విజయనందంగౌడ్, జె.సదానందం గౌడ్, మహేష్, సాయికిరణ్, వినోద్ యాదవ్ పాల్గొన్నారు.

### బాల మల్లేష్ మృతి బాధాకరం

పుస్తకాల నర్సింగ్‌రావు

రాజేంద్ర నగర్ నియోజకవర్గ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బుద్వేల్‌లోని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో బాలమల్లేష్ చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు పూలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ బాలమల్లేష్ మృతి బాదాకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాజేంద్ర నగర్ మండల సహాయకార్యదర్శి జె.విజయనందంగౌడ్, జైపాల్‌రెడ్డి, సయ్యద్‌అఫ్సర్, రియాజ్, మల్లేష్, జె.ఆనంద్‌గౌడ్, జె. సదానందంగౌడ్, బి.నర్సింహా, జి.సత్యం పాల్గొన్నారు.







## విజయోత్సవాలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలోని మండల పరిధిలో ఉన్న విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెన్యువబుల్ ఎనర్జీ రిసోర్సెస్ అన్న అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలుగా ప్రకటించిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జిల్లా విద్యాశాఖాధికారిణి ఆదివారం బహుమతులను అందజేసారు. సోమవారం మధ్యాహ్నం మల్కాజిగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో మరో సారి జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని డిఇఒ తెలిపారు.

# మహానగరి

## ఆస్పత్రి మరమ్మత్తు పనులు పరిశీలన

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో ఏర్పాటు చేయనున్న ఆరుపడకల ఆస్పత్రి పనులను మేడ్చల్ వి బ్లాక్ అధ్యక్షుడు వేము గోపాల్‌రెడ్డి ఆదివారం పరిశీలించి మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి తుర్కపల్లి గ్రామానికి ఆరుపడకల ఆస్పత్రిని మంజూరు చేశారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఆస్పత్రికి నిధులు మంజూరు చేశారని ఇందుకు గాను సిఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 4న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ఆస్పత్రిని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు వెంకటేష్, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు చంద్రారెడ్డి, పాల్గొన్నారు.

## విశ్వకర్మ, బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి సహకరిస్తా : వివేకానంద్



ప్రజాపక్షం/నిజాంపేట్ : విశ్వకర్మ సంఘానికి విశ్వబ్రహ్మాణులకు నా మద్దతు ఎల్లవేళల ఉంటుందని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ కేపి వివేకానంద్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 125 హెచ్‌బి కాలనీ నల్లగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక వనబోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్‌ఎ కేపి వివేకానంద్ ముఖ్య అతిదిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక వనబోజనాలు ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. 2023 ఎన్నికల్లో నా విజయానికి విశ్వకర్మలు, విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు క్రీయాశీలక పాత్ర పోషించి అత్యధిక మెజార్టీ ఇచ్చారని గుర్తుచేశారు. సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుచుటకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, పాక్స్ డైరక్టర్ శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బిఆర్‌ఎస్ నాయకులు కస్తూరి బాలరాజ్, విశ్వకర్మ సంఘం సభ్యులు శేషాచారీ, అడ్వకేట్ కమలాకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో సిసి రోడ్లు అండర్ డైనేజీలు ఏర్పాటు చేయాలని వినతి



ప్రజాపక్షం/అల్వాల్ : సిసి రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని నార్త్ అల్వాల్ సొసైటీ అసోసియేషన్ సభ్యులు మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అల్వాల్ ప్రాంతంలోని నెలకొన్న సమస్యలు ఇందిరా గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రతను పరిష్కారం చూపాలని అదేవిధంగా ఓల్డ్ ఆల్వాల్ ఇందిరమ్మ విగ్రహం నుండి మంగాపురం కాలనీ వరకు రోడ్డు విస్తరింప చేయాలని బాక్స్ డ్రైనేజీ పనులు అల్వాల్ హిల్స్ రోడ్ నెంబర్ 11 నుండి సిటిజన్ కాలనీ రోడ్ నెంబర్ 3 వరకు నిర్మించాలని అల్వాల్ టెంపుల్ శక్తి గణేష్ నగర్ సాయిబాబా నగర్ ప్రగతిశీల ఎంక్లేవ్ ప్రాంతాలకు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి అల్వాల్ సొసైటీ అసోసియేషన్ సభ్యులు చెప్పిన సమస్య బల్దియ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తానని రానున్న బడ్జెట్ కేటాయింపులో మన ప్రతిపాదనలను ఆమోదం లభిస్తుందని కొన్ని సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్తానని మెట్రో రైల్ మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు అందుబాటులోకి తేవడం కోసం తన ప్రయత్నం చేస్తానని ఇటీవల మెట్రో సాధన సమితి సభ్యులతో కలిసి మెట్రో ఎండి కి వినతి పత్రం అందజేశామని త్వరలో నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

## కాకతీయనగర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా



ప్రజాపక్షం/మల్కాజిగిరి : కాకతీయనగర్ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరుస్తానని వినాయకనగర్ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం కాకతీయనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ కాలనీలో పర్యటించిన సందర్భంగా కాలనీ ప్రతినిధులు తమ ప్రాంతంలో వీక్లీ మార్కెట్ వల్ల రాక పోకల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తీవ్రంగా ఉన్న కుక్కల బెడదను నివారించాలని, గుంతలు పడ్డ రహదార్ల మరమ్మత్తు పనులు పూర్తి చేయించాలని కోరారు. అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడు బాలస్వామి, సెక్రటరీ సీతారమస్వామి, కోశాధికారి రాంబాబు, సలహాదారు రాంచంద్రరావు కమిటి సభ్యులు వెంకట నాయక్, శీను నాయక్, విజయలక్ష్మి , లత, సునీత, రజని, గోపాల్, రవీందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ సేవా బావం కలిగి ఉండాలి

మాజీ ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి



ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రతి ఒక్కరు సేవా బావం కలిగి ఉండాలని మూడుచింతలపల్లి గ్రామపంచాయతి ఉపసర్పంచ్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వంగ వెంకటరమణరెడ్డి అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని శతకోటి హరేరామ హరేకృష్ణ భజన భక్త బృందానికి ఉచితంగా రాగి నీటి బాటిళ్లను అందజేశారు. అలాగే మూడుచింతలపల్లి విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షుడు బాల్‌రాంచారీ, అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వంగ వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛమైన మంచినీటిని రాగి బాటిల్స్‌లో నింపుకుని తాగాలని సూచించారు. సుమారు రూ. 50 వేల విలువ గల రాగీ సీసాలను ఉచితంగా అందజేయడంతో పలువురు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో శివాలయ కమిటి చైర్మన్ మర్యాల వీరేషంగుప్త, మాజీ చైర్మన్ రవి, పూజారులు నందగిరి ఉపేందర్‌రావు, తమ్మళి నాగరాజు, కొమురయ్య, అంజనేయులు, తమ్మళి నర్సింలు, రమేష్, మల్లేష్, సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకు పండుగ

పదేళ్ళ బిఆర్‌ఎస్ పాలనలో కెసిఆర్ కుటుంబమే బాగుపడింది

తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



ప్రజాపక్షం/తాండూరు : రాష్ట్రంలోని ఇందిరమ్మ ప్రభుత్వంతో అన్ని వర్గాలకు పండుగ తెచ్చిందని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా యాలాల మండలంలో పర్యటించిన ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి రాఘవపూర్‌లో మీడియాతో మాట్లాడారు. పదేళ్ళ బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేవలం కల్వకుంట కుటుంబం మాత్రమే బాగుపడిందని, ఇందిరమ్మ రాజ్యం ఏడాది పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని తెలిపారు. 50వేల మంది నిరుద్యోగులకు నియామక పత్రాలను అందించి ఉద్యోగాలు ఇచ్చిన ఘనతన సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రైతు రుణమాఫితో పాటు సన్నరకం వడ్లకు రూ.500లు బోనస్ ఇచ్చి రైతు కళ్ళలో ఆనందం నిపింది కాంగ్రెస్ ప్రభుత్వం తెలిపారు. తాండూరులో పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణం ప్రారంభించి ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి రోడ్డు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. యాలాల మండలంలో రూ.2.75కోట్ల నిధులతో సిసి రోడ్లకు శంఖుస్థాపన చేయడం జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలో విద్య వ్యవస్థలో వస్తున్న మార్పులు చూసి ఓర్వలేక బిఆర్‌ఎస్ నాయకులు గురుకుల పాఠశాలలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పదేళ్ళ కెసిఆర్ పాలనలో జుంటుపల్లి ప్రాజెక్టులో తట్టెడు మట్టి తీయ్యలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టులపై దృష్టి సారించడం జరిగిందని, ఐదేళ్ళలో చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందజేస్తామని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్,వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, యాలాల మండల పార్టీ మాజీ అధ్యక్షులు భీమయ్య తదితర నాయకులు ఉన్నారు.

### గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధియే తమ ధ్యేయమని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆదివారం యాలాల మండల పరిధి కోకట్, రాఘవూర్, కమాల్‌పూర్,నాగాసమందర్, బాణాపూర్, రాస్నం తదితర గ్రామాలలో పర్యాటించిన ఎంఎల్‌ఎ సిసి రోడ్డు నిర్మాణం పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంజిఎన్‌ఆర్ ఈజిఎస్ పథకం కింద మండలానికి మంజూరైన రూ.2.75కోట్ల నిధులతో సిసి రోడ్ల నిర్మాణంతో పాటు అవసమైన పనులను చేపడుతామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గ్రామంలో అభివృద్ధి చేయడమే తమ ధ్యేమని అన్నారు. రైతును రాజుగా చేయడం కోసమే సిఎం రేవంత్ రెడ్డి ఎన్ని ఇబ్బందులు ఎదురైన ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫి చేశారని, ఇది దేశంలో ఓ చరిత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ళ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తమరావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దారాసింగ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బీమయ్య,అక్బర్ బాబ, మాజీ సర్పంచ్‌లు, అధికారులు, నాయకులు పాల్గోన్నారు.

## ప్రభుత్వ భూమిలో కబ్జాలకు శ్రీకారం

దర్గాగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు స్కెచ్



ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని బహుదూర్ పల్లి కబ్జాపై రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాబ్జాల నుండి భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం పరోక్షంగా కబ్జాదారులకు సహకరించడంతో వీలువైన ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. బహదూర్ పల్లి సర్వే నెంబర్ 239 లో ప్రభుత్వ భూములు సులువుగా కబ్జాదారులకు కట్టబెట్టేందుకు సంబంధిత అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఇటీవలే కూల్చివేతల చేపట్టిన ఉన్నతాధికారులు నేడు కబ్జాలు జరుగుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు రెవెన్యూ అధికారుల విధులతో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఎలా ఉన్నప్పటికీ కబ్జాదారుల కోసం ఎంతకైనా తెగించేందుకు సంబంధిత అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఏదో ఒకరకంగా అక్రమార్కులకు ప్రభుత్వ భూములను కట్టబెట్టడం పరిపాటిగా మారుతుంది. ప్రభుత్వ భూములో కొంతమంది నేతల కనుసన్నల్లో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్నారనీ ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల వైఫల్యం వలనే నాయకుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతున్నదని, ఇప్పటి వరకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు ముడుపులు ముట్టిన వెంటనే అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను కబ్జాదారులకు కట్టబెట్టేందుకు అధికారులు విధులు నిర్వహిస్తున్నారా అన్నట్లుగా ఉంది. రెవెన్యూ అధికారుల తీరు, ప్రభుత్వ భూములు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న, రెవెన్యూ అధికారుల తీరు మారడంలేదు క్రింది స్థాయి సిబ్బంది పూర్తిగా కబ్జాదారులకు సహకరించడంతో నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి.

## విఆర్‌ఒ వ్యవస్థను బలోపేతం చేస్తాం

తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : విఆర్‌ఒలను నిర్లాక్ష్యంగా విధుల నుంచి తొలగించి గత ప్రభుత్వం తప్పు చేసిందని ఆ పాలకులు చేసిన తప్పులు బయటపడకూడదని విఆర్‌ఒలను ఇతర శాఖల్లోకి మార్చడం జరిగిందని తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి ఆరోపించారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరిక ఉపేందర్ ఆధ్యక్షతన పూర్వ విఆర్‌ఒల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి ముఖ్య అతిదిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విఆర్‌ఒల వ్యవస్థను బలోపేతం చేస్తామని అన్నారు. వారిని యధావిధిగా విధుల్లోకి తీసుకోవడానికి సిఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని అన్నారు. విఆర్‌ఒలను విధుల్లోకి తీసుకోవడానికి చర్చించినట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖలో ఆదాయం ఎలా పెంచుకోవాలో తాను వివరం గా సిఎం రేవంత్‌కు, ఇతర మంత్రులకు వివరించానని ప్రభుత్వంపై భారం పడకుండా ఒప్పించి గ్రామాలకు, మండలానికి మధ్య వారధిగా ఉండే విధంగా అడిషనల్ ఆర్‌ఐగా విఆర్‌ఒలను విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు పీవి మోహన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.




## బంట్వారం గోదాం, పశువుల సంత ఏర్పాటుకు స్థలం కేటాయింపు



ప్రజాపక్షం/బంట్వారం:బంట్వారం మండల కేంద్రంలో రైతు గోదాం, మేకల సంత ఏర్పాటుకు స్థలంకు కేటాయిస్తూ ఆర్డర్ కాఫీని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేయగా, మండల నాయకులు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కూమర్ చేతుల మీదుగా ఆర్డర్ కాఫీని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మర్పలి మార్కెట్ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, బంట్వారం పిఏసిఎస్ ఉపధ్యక్షులు సుధాకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేంకటేశం, మర్పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు యాదగిరి, ఉన్నారు.

## రోడ్లను శుభ్రం చేసిన చంద్రారెడ్డి



ప్రజాపక్షం/నాగారం : ప్రధాన రహదారులు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండాని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం టెంపుల్ నుండి ఎస్‌వి నగర్ కాలనీ రోడ్డు వరకు గల రోడ్డును మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి శుభ్రం చేసి ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో రోడ్లలో గల రాళ్లు,మట్టి కుప్పలను తొలగించి శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి,వైస్ చైర్మన్,కౌన్సిలర్ సుమిత్రాసురేష్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమం



ప్రజాపక్షం/దమ్మాయిగూడ : ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఓల్డ్ విలేజ్ నుండి పోచమ్మ దేవాలయం వెళ్లే రోడ్డుకిరువైపుల ఉన్న చెత్త,పిచ్చి మొక్కలను తొలగించారు.బహిరంగా ప్రదేశాలలో చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు.ప్రతి ఒక్కరూ ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని చైర్మన్ ప్రణీత తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి,కౌన్సిలర్ రామారం శ్రీహరిగౌడ్, వెంకటేష్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం




ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వృత్తులన్నిటిలో అత్యుత్తమ వృత్తి ఉపాధ్యాయ వృతి ఉపాధ్యాయుడు మరో బహ్మ,అజ్ఞానాందకారాన్ని తొలిగించి బోదన వెలుగు కిరణాలతో విద్యార్థుల జీవితంలో ప్రగతి బాటలు వేసి జీవితపు ఉన్నత శిఖరాలకు అధిరోహింపజేసిన శక్తి ఉపాధ్యాయుల సొంతం. కొంత మంది ఉపాధ్యాములు సమాజ శేయస్సుకు పాటు బడుతుంటారు. అలాంటి వారిలో వికారాబాద్ జిల్లా వాసి ఎండి మోసిన్ ఒకరు. ఆయన జ్ఞాన నంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం విశేషం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ కళామందిరంలో అదివారం విద్యాబోధనే దైవ ప్రార్థనగా భవిస్తున్న ఉపాధ్యాయులకు ఆర్ట్ ఆఫ్ లర్నింగ్ జ్ఞాన నంది ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు నాద మునుల రామారావు, ప్రధాన కార్యదర్శి అభినందించారు. పలువురు ప్రముఖులు ఉపాధ్యాయుడు ఎండి మోసిన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోసిస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో బాగంగా బోధనా ప్రక్రియలో విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు పేద విద్యార్థులకు చేయూతనందిస్తూ, వారిని మంచి మార్గంలో నడిపిస్తూ జ్ఞాన నంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం అభినందనీయం అన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనందున అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ గరువు స్థానానికి ఉన్నా గౌరవాన్ని మరింతాగా ఇనుమడింపజేయాలని హితవు పలికారు.రాష్ట్ర స్థాయిలో తనకు మొట్టమొదటిసారిగా అవార్డు రావడం అదృష్టంగా బావిస్తున్నాను పిల్ల పెంపకం అనేది కుటుంబ సభ్యుల ఎలా ఉంటే పిల్లలు కూడా అలాగే ఉంటారు అన్నారు.

## బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత

అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య



ప్రజాపక్షం/బోడుప్పల్ : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి 302వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు కాబట్టి నేటి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించినప్పుడే భవిష్యత్తులో మన దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ కేటాయింపులు చేయడంతో పాఠశాలల్లో సరైన వసతులు లేక ఉపాధ్యాయులు లేక,పేద మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రోజురోజుకు కార్పొరేట్ విద్యాసంస్థలు గొడుగుల్లా పెరుగుతూ లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ ప్రజల నడ్డి విడుస్తున్నాయన్నారు. చదువుకునే స్థాయి నుంచి చదువును కొనే స్థాయికి నేడు చేరుకోవడం దురదృష్టకరమని, ప్రభుత్వాలు విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్ విద్యా వ్యవస్థను నియంత్రించాలని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు,గరుగుల యాకయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సల్‌బత్తాపూర్‌లో శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంకు

ప్రజాపక్షం/బంట్వారం : మండల పరిధిలో ఉన్న సల్‌బత్తాపూర్ గ్రామం లో 35 యేళ్ళ క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ట్యాంకులో నుంచి నీరు ఇండ్లలోకి పారుతుంది. వాటర్ ట్యాక్ లీకవడంతో నీరు మొత్తం వరదలా మారి ఇండ్ల చుట్టు చేరడంతో ఇళ్ళలోకి తేమ (చెమ్మ) వచ్చి ఇల్లు కూలే ప్రమాదం ఉందని బాధిత ప్రజలు సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ట్యాంకు నుంచి నీరు ఇళ్ళ చేరడమే కాకుండా గ్రామంలో ఉన్న పాఠశాల వరకు వరద నీరు చేరి విద్యార్థులు పాఠశాలకు వేళ్లేందుకు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని స్థానికులు పేర్కోన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కోంటున్నా సమస్య మండల స్థాయి అధికారులకు తెలిపినప్పటికి నెలలు గడిచినా దానికి ఎలాంటి పరిష్కారం మార్గం చూపడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రంగం శిథిలావస్థకు చేరుకున్నా వాటర్ ట్యాంకు నుంచి నీటి తగ్గించి లేదా వేరే ట్యాంకు నుంచి నీళ్లు ప్రజలకు అందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## బాల మల్లేష్ మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

సిపిఐ, సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శులు ఉమా మహేష్, కిలుకాని లక్ష్మణ్‌లు



ప్రజాపక్షం/ కుత్బుల్లాపూర్: సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాల మల్లేష్ ఆకస్మిక మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఐ, సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శులు ఉమా మహేష్, కిలుకాని లక్ష్మణ్‌లు అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాల మల్లేష్ మృతి చెందిన సందర్భంగా ఆదివారం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాలు హమాలీ యూనియన్ అడ్డా వద్ద ఏర్పాటు చేసిన బాల మల్లేష్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల మల్లేష్ విద్యార్థి ఉద్యమం నుంచి యువజన కార్మిక రాష్ట్ర జాతీయ సంఘాలకు నాయకత్వం వహించి అనతి కాలంలోనే పార్టీ రాష్ట్ర సహయ కార్యదర్శిగా జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఎదిగి విద్యార్థి యువజన కార్మిక పేదల పక్షాన పోరాడిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఈ.దేవదానం ఎండి.జాకీర్ హుస్సేన్, కరుణాకర్, భాష, దుర్గానాయక్, వీరేష్, సీపీఐ జిల్లా నాయకులు కె.స్వామి, హరినాథరావు, నర్సింహరెడ్డి, చంద్రకాంత్ , సుంకిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ‘ఎనర్జీ టూ సినర్జీ న్యూ డైరెక్షన్స్ 2025’ అంశంపై ప్రత్యేక శిక్షణ

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: తెలంగాణ గుర్తింపు పోందిన ప్రైవేటు పాఠశాలల యజమాన్యం సంఘం (ట్రస్మా) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సూరారంలోని విఐపి ఫంక్షన్ హాల్‌లో ఎనర్జీ టూ సినర్జీ న్యూ డైరెక్షన్స్ 2025 అనే అంశంపై పాఠశాల యజమాన్యం , హెడ్మాస్టర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు కె. రామేశ్వర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యు డైస్ పస్త్‌తో పాటు ఇతరత్రా ఆన్‌లైన్, ఆపార్, ఎన్‌ఇసి సమస్యలపై సంబంధిత అధికారులతో అనుమానాలు నివృత్తి చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డిఇఒ విజయ కుమారి పాల్గొని ప్రారంభిస్తారన్నారు. రాష్ట్ర ప్లానింగ్ కో ఆర్డినేటర్ మురళీ కృష్ణ, మేడ్చల్ జిల్లా అకాడమిక్ మనిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఎహెచ్‌పిఎస్ రీజినల డైరెక్టర్ కౌశిక్ రెడ్డి, విస్బిల్టి ఆఫ్ లెర్నింగ్ మెంటార్ అండ్ ట్రైనర్ రఘురామ్ , ప్రముఖ సైకోలాజిస్ట్ సుదీర్ సంద్రాలు పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ అందజేస్తారని తెలిపారు.

## గ్యాస్ లీకేజీ అయితే 1906 కాల్ చెయ్యాలి

ఇండియన్ అయిల్ కార్పోరేషన్ లిమిటోడ్, జిల్లా సేల్స్ ఆఫీసర్ కవిత

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : గ్యాస్ లీకైతే 1906 కాల్ చెయ్యాలని ఇండియన్ అయిల్ కార్పోరేషన్ లిమిటెడ్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కవిత తెలిపారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో మన వంట గది మన ఇంటి భద్రత కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి 5సంవత్సరాలకు ఒకసారి తప్పనిసారిగా గ్యాస్ సిలిండర్ పైప్ మార్చాలని సూచించారు. సిలిండర్ కన్నా గ్యాస్ పోయ్యి ఎత్తులో ఉండాలన్నారు. మహిళలకు వంటల పోటీ నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి మహిళసంఘం అధ్యక్షురాలు డికే వసంత రెడ్డి తాండూర్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ విజయలక్ష్మి ,బిజెపి మహిళా మోర్చాశిరిష , గోవర్ధన్ రెడ్డి ,రాజేష్ , గంగమేశ్వర్ , అనిల్ ,వియవర్ధన్, అజయ్ , శ్రీనివాస్‌రెడ్డి , తదితరులు పాల్గోన్నారు.



# క్రీడ

## బ్యాడ్మింటన్‌లో భారత్ తీన్మార్..

### టైటిల్ గెలిచిన సింధు, లక్ష్యసేన్!

సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు దుమ్మురేపారు. ఏకంగా మూడు టైటిళ్లు గెలిచి సత్తా చాటారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భారత స్టార్ల షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్.. సింగిల్స్ టైటిల్స్ సాధించగా.. మహిళల డబుల్స్‌లో గాయత్రి‌ట్రీసా జోడీ విజేతగా నిలిచింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో భారత్‌కు మొత్తం మూడు టైటిళ్లు దక్కాయి.





**సత్తా చాటిన సింధు..**

మహిళల సింగిల్స్ ఫైనల్లో సింధు ఘన విజయం సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మాజీ వరల్డ్ ఛాంపియన్ సింధు 21–14, 21–16తో చైన్నై చెందిన వు లు యుపై విజయం సాధించింది. ఈ మ్యాచ్ అసాంతం ఆధిపత్యం చెలాయించిన సింధు వరుసగా రెండు గేమ్స్ గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది. 2017, 2022 తర్వాత సింధు ఈ టోర్నీ విజేతగా నిలిచి మూడో టైటిల్ కైవసం చేసుకుంది.

**దుమ్మురేపిన లక్ష్యసేన్..**

పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్స్ ఓటమి తర్వాత నిరాశజనక ప్రదర్శన కొనసాగిస్తున్న లక్ష్యసేన్.. ఈ టోర్నీలో మాత్రం విజేతగా నిలిచాడు. ఆదివారమే జరిగిన ఫైనల్లో 21–6, 21–7 తేడాతో సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జేసన్ తేపై విజయం సాధించాడు.

**డబుల్స్ గెలిచిన గోపీచంద్–ట్రీసా**

మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్–ట్రీసా జాలీ జోడీ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీలో టైటిల్ గెలిచిన తొలి భారత మహిళల డబుల్స్ జోడీగా రికార్డ్ సాధించింది. ఫైనల్లో ట్రీసా జాలీ జోడీ 21–18, 21–11 తేడాతో బావో లి జింగ్,లీ కియాన్(చైనా) ద్వయంపై గెలిచింది. ఈ జోడీ 2022లో రన్నరప్‌గా నిలిచింది.

## దూసుకొచ్చిన రాకాసి బౌన్సర్

### యశస్వి జైస్వాల్‌కు తప్పిన ప్రమాదం!



ఆస్ట్రేలియాతో పింక్ బాల్ టెస్ట్‌కు ముందు టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు పెను ప్రమాదం తప్పింది. ఈ మ్యాచ్ నేపథ్యంలో ప్రధాని ఎలెవన్‌తో జరిగిన పింక్ బాల్ సన్నాహక మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్‌పై ఆసీస్ యువ పేసర్ రాకాసి బౌన్సర్లతో దాడి చేశాడు. పెర్త్ టెస్ట్‌లో భారీ సెంచరీతో మ్యాచ్ విన్నర్‌గా నిలిచిన యశస్వి జైస్వాల్‌న్ గాయంతో భారత జట్టుకు దూరం చేయాలనే లక్ష్యంతో ఆసీస్ యువ పేసర్ జాక్ నిస్బేట్ బౌలింగ్ చేశాడు. పదే పదే రాకాసి బౌన్సర్లు విసిరి జైస్వాల్ సహనాన్ని పరీక్షించాడు. జైస్వాల్ ముఖాన్నే టార్గెట్ చేస్తూ బౌన్సర్లు సంధించాడు. ఆసీస్ యువ పేసర్ జాక్ నిస్బేట్‌కు జైస్వాల్ తన బ్యాట్‌తోనే బదులిచ్చాడు. అతని బౌలింగ్‌ను చాకచక్యంగా ఎదుర్కొన్న యశస్వి జైస్వాల్.. బౌండరీలతోనే ధీటుగా బదులిచ్చాడు. జాక్ నిస్బేట్‌కు బౌన్సర్లకు యశస్వి జైస్వాల్ సహనం కోల్పోయాడు. ఈ సన్నాహక మ్యాచ్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసిన జైస్వాల్(59 బంతుల్లో 9 ఫోర్లతో 45) చార్లీ అండర్సన్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాన్‌బెరా వేదికగా జరిగిన రెండు రోజుల ఈ వామప్ మ్యాచ్‌లో తొలి రోజు అయిన శనివారం ఆట వర్షంతో తుడిచిపెట్టుకుపోవడంతో.. ఆదివారం 50 ఓవర్లకు కుదించి మ్యాచ్‌ను కొనసాగించారు



## వేరే జట్టులో ఆ ఫీల్ రాదు: నితీష్‌కుమార్ రెడ్డి

ఐపీఎల్ 2025 మెగా వేలంలో పాల్గొంటే భారీ ధర దక్కేదని జరుగుతున్న ప్రచారంపై టీమిండియా నయా ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి స్పందించాడు. డబ్బు పెద్ద విషయం కాదని, ఈ రోజు కాకపోతే మరో రోజు వస్తుందని తెలిపాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడటం వల్లే తాను టీమిండియాకు ఎంపికయ్యానని గుర్తు చేశాడు. తెలుగు ప్లేయర్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడితేనే తెలుగు వారు ఆనందిస్తారని, మరో జట్టుకు ఆడితే ఆ ఫీలింగ్ రాదని బదులిచ్చాడు.

**రూ.6 కోట్లకే..**

ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు నితీష్ కుమార్ రెడ్డిని సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 6 కోట్లకే రిటైన్ చేసుకున్న విషయం తెలిసిందే. రిటెన్షన్ ఒప్పుకోకుండా మెగా వేలంలోకి వచ్చి ఉంటే ఈ తెలుగు ఆల్‌రౌండర్ కోసం ఫ్రాంచైజీలు ఎగబడేవి. సునాయసంగా అతను రూ. 15 నుంచి 20 కోట్లు పలికేవాడని క్రికెట్ ఎక్స్‌పరట్స్ అంచనా. కానీ నితీష్ కుమార్ రెడ్డి డబ్బుకు ఆశపడకుండా.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో కొనసాగేందుకే మొగ్గు చూపాడు..

# రీల్





## 8వ రోజు పెరిగిన జీబ్రా వసుళ్లు

మన తెలుగు సినిమా దగ్గర ఉన్నటువంటి యంగ్ అండ్ వెర్సటైల్ నటుల్లో తన నటనతో ఎంతగానో మెస్మరైజ్ చేసిన నటుడు సత్యదేవ్ కూడా ఒకరు. మరి సత్యదేవ్ హీరోగా దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ తెరకెక్కించిన ఇంట్రెస్టింగ్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమే జీబ్రా. మరి డీసెంట్ బజ్ నడుమ వచ్చిన ఈ చిత్రాన్ని ఎలాగైనా థియేటర్స్ లోనే తీసుకొని రావాలి మేకర్స్ ముఖ్యంగా హీ రో పట్టుబట్టి ఈ చిత్రాన్ని థియేటర్స్ లో రిలీజ్ కి తీసుకురాగా థియేటర్స్ లో ఈ చిత్రం సాలిడ్ రెస్పాన్స్ ని అందుకుంది అని చెప్పాలి. మరి డే 1 నుంచే మంచి బుకింగ్స్ అండ్ వసూళ్లు అందుకున్న ఈ చిత్రం ఇపుడు మొదటి రోజు కంటే ఎనిమిదవ రోజునే ఎక్కువ వసూళ్లు అందుకున్నట్టుగా చెబుతున్నారు. దీనితో మొత్తం 8 రోజుల్లో ఈ చిత్రం 9.43 కోట్ల గ్రాస్ ని అందుకొని అదరగొట్టింది అని చెప్పాలి. ఇక ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా నటించగా సత్యరాజ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.

## 'రాజాసాబ్' షూటింగ్‌పై మాళవిక క్రేజీ అప్డేట్

కమర్షియల్ డైరెక్టర్ మారుతి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో 'ది రాజా సాబ్' అనే భారీ పాన్ ఇండియా సినిమాని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకి సంబంధించి ఈ మూవీ హీరోయిన్ మాళవిక మోహనన్ ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తైనట్లు ఆమె తెలిపారు. దర్శకుడు మారుతి ఒక్కరోజు కూడా వృథా కాకుండా ఈ సినిమా చిత్రీకరణ చేస్తున్నార ని& అనుకున్న సమయంలో సినిమాను విడుదల చేయా లని టీమ్ పట్టుదలతో ఉన్నారని ఆ మధ్య ఎస్‌కె ఎన్ కూడా తెలిపారు. ఇప్పుడు షూటింగ్ గు రించి హీరోయిన్ మా ళవిక మోహనన్ కూ డా ఈ సినిమా షూ టింగ్ దాదాపు పూర్తైనట్లు చెప్పిం ది. ఇక ఈ మూవీ లో నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కూ డా కీలక పాత్రలు పోషి స్తున్నారు. తమన్ మ్యూ జిక్ అందిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు.





## స్పెషల్ విజువల్స్‌తో పుష్ప–2 'ఫీలింగ్స్' సాంగ్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్ గా దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం పుష్ప 2 కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం నుంచి ఆల్రెడీ వచ్చిన అన్ని పాటలు కూడా భారీ హిట్ అయ్యాయి. అయితే ఈ సినిమా నుంచి వచ్చిన అన్ని పాటలు ఒకెత్తు అయితే ఫీలింగ్స్ అనే సాంగ్ ఇంకో ఎత్తు అని చెప్పాలి. ఈ సాంగ్ రిలీజ్ కాకుండా చిన్న బిట్ వచ్చినపుడే సాలిడ్ బజ్ నమోదు అయ్యిపోయింది. మరి ఎట్టకేలకి ఈ సాంగ్ ని మేకర్స్ విడుదల చేసేసారు. దేవిశ్రీ ప్రసాద్ తన మార్క్ బీట్స్ తో అప్పుడు సామి తర్వాత మళ్ళీ మరో చార్ట్ బస్టర్ డ్యూయెట్ ని అందించాడు అని చెప్పడంలో డౌట్ లేదు. అయితే ఈ సాంగ్ కొంచెం స్పెషల్ అని చెప్పాలి. గతంలో వచ్చిన సాంగ్స్ లో డాన్స్ బిట్ చాలా తక్కువే ఉంది కానీ.. ఈ ఒక్క సాంగ్ లో మాత్రం అల్లు అర్జున్, రష్మికపై దాదాపు వీడియో విజువల్స్ వారి డాన్స్ మూమెంట్స్ ని మేకర్స్ చూపించేసారు. దీనితో ఇది వాటికి మించి స్పెషల్ గా మారింది అని చెప్పాలి. ఇక ఈ సాంగ్ లో అల్లు అర్జున్, రష్మిక మందన్నల ఎనర్జీ అయితే ఇంకో లెవెల్లో ఉందని చెప్పాలి.



## నారాయణ గురు స్ఫూర్తితోనే సమగ్ర కుటుంబ సర్వే

### తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవజాతికి ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు అదే మానవత్వం, సమానత్వమని సందేశం ఇచ్చి.. కేరళ తో పాటు.. యావత్ భారతదేశాన్ని ప్రభావితం చేసిన నారాయణ గురు స్ఫూర్తి తో తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టినట్టు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం కేరళ రాష్ట్రం కొల్లం లోని నారాయణ గురు ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నారాయణ గురు ఇంటర్నేషనల్ లిటరసీ, కల్చరల్ ఫెస్టివల్ లో భాగంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ను ప్రత్యేకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా స్థానికంగా నిర్వహించిన సెమినార్లో ముఖ్యఅతిథిగా పాల్గొని డిప్యూటీ సిఎం ప్రసంగించారు. నారాయణ గురు జీవితాన్ని, బోధనలను స్మరించేందుకు కొల్లం కు చేరుకోవడం తనకు ఒక విలువైన అవకాశం, గొప్ప గౌరవమని డిప్యూటీ సిఎం తెలిపారు. సమానత్వంపై నారాయణ గురుకు ఉన్న ద్రుడమైన అభిప్రాయం, మానవత్వం, సమానత్వం అనే సందేశాలు నేటి కాలంలో ప్రధానంగా మారాయని తెలిపారు. నారాయణ గురు ఒక ఆధ్యాత్మిక నాయకునికి మించిన వారని ఒక సంస్కరణ వాది, తత్వవేత్త, విప్లవకారుడు అని అభివర్ణించారు. కేరళ సమాజంలోని వివిధ కులాల్లో అన్యాయాలను నిర్మూలించడం ద్వారా ఆయన సమాజాన్ని సరికొత్తగా తీర్చిదిద్దారని వివరించారు. అరువిప్పురం శ్రీ శివాలయం స్థాపన ఆయన చేసిన సాధారణ ఆధ్యాత్మిక చర్య కాదు అది కుల వివక్షకు వ్యతిరేకంగా ఒక సాహసోపేతమైన ప్రకటన అని తెలిపారు. ఈ ప్రకటన కేవలం కేరళనే కాదు భారత దేశ మొత్తాన్ని ప్రభావితం చేసింది అన్నారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాల మధ్య ఆలోచనల్లో సారూప్యత ఉందని తెలిపారు. తెలంగాణలో కొమురం భీం, చాకలి ఐలమ్మ నారాయణ గురు తరహాలోని సమానత్వం కోసం తిరుగుబాటు చేశారని వివరించారు. ఈ రెండు ప్రాంతాలు సమానత్వం, న్యాయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి అని తెలిపారు.

## రైతు పండగ సక్సెస్ బిఆర్ఎస్ నేతలకు నిద్రపట్టటంలేదు

### మంత్రి జూపల్లి కృష్ణారావు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహబూబ్‌నగర్‌లో రైతు పండుగ, సిఎం బహిరంగ గ్రాండ్ సక్సెస్ కావడంతో బిఆర్ఎస్ నేతలకు నిద్ర పట్టడం లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఎంఎల్ఎలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి,అనిరుధ్ రెడ్డిలతో కలిసి మంత్రి జూపల్లి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ రైతు అవగాహన సదస్సు, రైతు పండగ, బహిరంగ సభను విజయవంతం చేసిన రాష్ట్ర, ఉమ్మడి జిల్లా అధికార యంత్రాగానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏక కాకంలో రూ. 21 వేల కోట్లు రుణ మాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతు రుణమాఫీ, సన్నాలకు రూ. 500 బోనస్ చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. కాంగ్రెస్ పార్టీనే ప్రజలకు శ్రీరామ రక్ష అని, ఉమ్మడి పాలమూర్ జిల్లా అభివృద్ధికి ఏటా రూ. 20 వేల కోట్లు కేటాయిస్తానన్న సియం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ మెదలు పెట్టిన జిల్లా సాగునీటి ప్రాజెక్టులను గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు.పాలమూరు రైతన్నల సాగునీటి కష్టాలకు బీఆర్ఎస్ తీర్చలేకపోయిందన్నారు. కుర్చీ వేసుకుని ప్రాజెక్ట్ లు పూర్తి చేస్తానన్న కెసిఆర్ పాలమూర్‌కు చుక్క నీరు ఇవ్వలేదని విమర్శించారు.ఎంఎల్ఏయెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..రైతన్నత సంతోషం చూస్తుం గత పదేళ్లలో వారు ఏం కొల్పోయారో అర్థమైందన్నారు.సియం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పు కనపడుతుందన్నారు.గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇస్తుండంతో రైతులు హర్షిస్తున్నారు.ఎంఎల్ఏ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ..బిఆర్ఎస్ నేతలు అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు.పరిశ్రమల ఏర్పాటును అడ్డుకుంటున్నారని విమర్శించారు.ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు తప్పుడు కూతలు కూయడం మానుకోవాలి అన్నారు.

## శక్తులపై పోరాటం

మండిపడ్డారు. ఆదివారం ప్రియాంకాగాంధీ వయనాడ్‌లోని మనంతవాడిలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏర్పాటు చేసిన సంస్థలను నాశనం చేయడానికి తన శక్తినంతా ధారపోస్తున్న కొన్ని శక్తులకు వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. మన దేశ స్ఫూర్తి కోసం, భారత ఆత్మ కోసం తాము పోరాటం సాగిస్తున్నామని చెప్పారు. దేశ ప్రజలకు హక్కుగా సంక్రమించాల్సిన దేశంలోని వనరుల కోసం, అధికారం కోసం పోరాటం చేయాలన్నారు. వయనాడ్‌లో వరదలు సృష్టించిన విలయంలో ప్రజలు తీవ్రంగా నష్టపోయినా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహాయాన్ని అందించట్లేదని మండిపడ్డారు. వయనాడ్ ఎంపిగా అక్కడి ప్రజల అవసరాలు, హక్కుల కోసం పార్లమెంట్‌లో తన గొంతుకను వినిపిస్తానని..వారి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు.కేంద్ర ఏజెన్సీలను ఎన్‌డిఎ ప్రభుత్వం పావులుగా వాడుకుంటూ..ప్రతిపక్షాలను భయపెట్టడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. జులై 30న కొండప్రాంత జిల్లా అయిన వయనాడ్‌లో బీభత్సం సృష్టించిన విషయాన్ని ఆమె గుర్తుచేస్తూ తాను ఎన్నో విషాదాలను చూశానని అన్నారు. దేశంలో ఎక్కడా విషాదాలు జరిగినా అక్కడికి వెళ్లి ప్రజలను పరామర్శిస్తామని, అది తమ వృత్తి అని స్పష్టం చేశారు. అయితే తాను వయనాడ్‌కు వచ్చినప్పుడు చూసిన బాధలు చాలు అదురుదుగా చూస్తామన్నారు. అతి చిన్న ప్రాంతంపై ప్రకృతి కన్నెర్ర చేసిందని, దీంతో అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయని, కొట్టుకుపోయాయన్నారు. కొన్ని కుటుంబాలే గల్లంతయ్యాయని, జీవనోపాధి తుడుచిపెట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధ్వంసాన్ని, బాధలను తాను కళ్లారా చూశానన్నారు. తమకు సహాయం చేసిందని ఎవరూ అని చూడాలి తప్ప ఏ మతం వారు చేశారు, ఏ కులం వారు చేశారో అని అడగకూడదన్నారు. భారతదేశం నిజమైన విలువలకు చిహ్నం వయనాడ్‌నే ఉందన్నారు. మీ అందరి బాధ్యత నాది అని మీరు తెలుసుకుంటారని తాను అనుంకుటున్నానన్నారు. మీ ప్రేమను పూర్తిగా సీరియస్‌గా తీసుకుంటానని, రానున్న ఐదేళ్లలో మీకు మంచి భవిష్యత్తును అందించడానికి పోరడడం తన కర్తవ్యమని స్పష్టం చేశారు. రెండు రోజుల కేరళ పర్యటనలో భాగంగా ప్రియాంక, రాహుల్ గాంధీతో కలిసి శనివారం వయనాడ్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని తిరువంబాడిలోని ముక్కం, నికంబూర్‌లోని కౌలై, వండూరు, కొజికోడ్, మలప్పురం జిల్లాల్లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఆదివారం మనంతవాడి ప్రాంత ప్రజలను కలిసి, వారి బాగోగులు తెలుసుకున్నారు. ఇటీవల వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో ఎంపిగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా విజయం సాధించిన విషయం తెలిసిందే.





## అంతిమ వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి వర్గ సభ్యులు ఇటి నర్సింహ, కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, పల్లా నర్సింహారెడ్డి, నెల్లి కంటి సత్యం, విజయలక్ష్మి, రవీంద్రచారి, పాలమాకులు జంగయ్య, సాయిలు గౌడ్, మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి, సృజన్ కుమార్, స్టాలిన్, అంజయ్య నాయక్, ఏఐవైఎఫ్ కు చెందిన ధర్మేంద్ర, సత్యప్రసాద్, లక్ష్మ ణ్, అణ్వార్, ఏవూరి సోమన్న, పిఓడబ్ల్యు నాయకురాలు సంధ్య, మాస్ లైన్ నుండి రమ, సిపిఐ ఎంఎల్ గోవర్థన్, మేడ్చల్ జిల్లా నేతలు , ప్రజా సంఘాల నేతలు, కళాకారుడు ఉద్యమ నాయకుడు ఏవూరి సోమన్న, ఎమ్మార్పీఎస్ కళాబృందం ఎన్ వై అశోక్ తదితరులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. టిఎన్జీఓ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం,బి.కృష్ణయాదవ్, సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, యువజన సమాఖ్య కార్యదర్శి వెంకటేష్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమవతి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ప్రవీణ్, అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు రాములు, సిపిఐ శాఖ కార్యదర్శి సహదేవ్ రెడ్డి, పార్టీ శ్రేణులు రవి, రాము, ఇమామ్, చంద్రయ్య, కనకయ్య, సుంకిరెడ్డి, చారి, సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.అశోక్, జిల్లా కమిటి సభ్యులు జి. శ్రీనివాస్, జవహర్‌నగర్ కార్యదర్శి టి.శివ నారాయణ తదితరులు బాలమల్లేష్ అంతిమయాత్రలో కన్నీటి వీడ్కోలు పలికారు.

## మా ఏడాది పాలన.. బిజెపి పదేళ్ల పాలనపై చర్చకు సిద్ధం

### బిజెపికి సవాల్ విసిరిన టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** "మా కాంగ్రెస్ ఏడాది పాలనపై..బిజెపి కేంద్రంలో 10 ఏళ్ల పాలనపై చర్చించేందుకు తాము సిద్దంగా ఉన్నాం పదేళ్ల బిజెపి చీకటి పాలనపై వాళ్లకు మేము వేసే సవాల్ కు సిద్ధమా" అని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ బిజెపి నేతలకు ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. బిజెపి విడుదల చేసిన చార్జిషీట్ చూస్తుంటే గురివింద సామెత గుర్తొస్తుంది ఆయన పేర్కొన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగాన్ని రూపుమాపుతామని , నల్ల ధనాన్ని తెచ్చి ప్రతి అకౌంట్ కు 15 లక్షల రూపాయలు వేస్తాం అన్న బిజెపి మాట నిలబెట్టుకుందా అని ప్రశ్నించారు. అలాగే వంద రోజుల్లో అన్ని రకాల ధరలు తగ్గిస్తాం అన్నారని, డాలర్ కు పోటీగా రూపాయి విలువ పెంచుతామని మోహం చాటేశారని అన్నారు. బిజెపి 2014, 2019, 2024 ఎన్నికల్లో ఇచ్చిన జాతీయ స్థాయి మేనిఫెస్టోలను తీస్కొని రండి ...తాము కాంగ్రెస్ 2023 మ్యానిఫెస్టో తీస్కొని వస్తాం..

ఏడాది లో ఏమి చేశామో చెపుతాం..ఎక్కడ, ఎప్పుడు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉంటారో చెప్పండి అని బిజెపి నేతలకు సూటి ప్రశ్న వేశారు.రైతుల సంక్షేమం కోసం ఒక్క సంవత్సర కాలంలోనే దాదాపు రూ.54 వేల కోట్లు ఖర్చు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిందన్నారు. 21 వేల కోట్లతో రుణమాఫీ, రైతుపెట్టుబడికి 7600 కోట్లు, ధాన్యం కొనుగోళ్ల కోసం 10, 500 కోట్లు... 42 లక్షల మంది రైతులకు భీమా కవరేజ్ కోసం 1400 కోట్లు, అకాల వర్షాలకు నష్టపోయిన 94వేల రైతులకు ఎకరానికి 10 రూపాయిలు ఇచ్చాం. ఇవేం బిజెపి నాయకులకు కనపడటం లేదన్నారు.





Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com